మంగళవారం
18-3-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 176
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అమెరికాలో తగ్గిన కొనుగోళ్లు

వాషింగ్టన్: టారిఫ్‌ల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్న వేళ... ప్రతిగా ఆయా దేశాలూ ప్రతీకార సుంకాలు ప్రకటిస్తున్నాయి. ఈ పరిణామాలతో అమెరికా స్టాక్ మార్కెట్లు ఒడుదొడుకులకు లోనవుతున్నాయి. ఈ క్రమంలో గృహోపకరణాలు, ఇతరత్రా షాపింగ్ కోసం అమెరికన్లు ఆచితూచి ఖర్చు చేస్తున్నట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన జనవరిలో రిటైల్ సేల్స్ 1.2శాతం పడిపోయాయి. అనంతరం ఫిబ్రవరిలో స్వల్పంగా పుంజుకొని 0.2శాతం పెరిగినట్లు కామర్స్ డిపార్ట్‌మెంట్ గణాంకాలు వెల్లడించాయి.

ఏపీలో పది పరీక్షలు

తొలిరోజు 98.27 శాతం నమోదు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు మొదటి భాషా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఆయా పరీక్షా కేంద్రాల దగ్గర విద్యార్థులు, తల్లిదండ్రుల సందడి వాతావరణం నెల కొంది. రాష్ట్రవ్యాప్తంగా 6,27,277 మంది విద్యార్థులకుగాను 6,16,451 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మరో 10,826 మంది గైర్హాజరయ్యారు. 3,450 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండగా 1,545 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్లు తనిఖీ చేశాయి.

కాగ్ నియామక ప్రక్రియపై కేంద్రానికి సుప్రీం నోటీసు

న్యూఢిల్లీ: భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (కాగ్) నియామక ప్రక్రియపై సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీసు జారీ చేసింది. కేవలం ప్రధానమంత్రి సూచన మేరకే కాగ్ నియామక ప్రక్రియ జరపడాన్ని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని ఓ స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సోమవారం జస్టిస్ సూర్యకాంత్, ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపిన పిమ్మట... దీనిపై సమాధాన ఇవ్వాలని కేంద్ర

- మిగతా 2 లో

ఫ్లోరిడాలో రోడ్డు ప్రమాదం

ముగ్గురు తెలంగాణ వాసుల దుర్మరణం

వాషింగ్టన్: అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తెలంగాణ వాసులు దుర్మరణం చెందారు. కుటుంబసభ్యులు కారులో వెళు ్తండగా భారత కాలమానం ప్రకారం సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు ప్రమాదం జరిగింది. మృతులను తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండలం టేకులపల్లికి చెందిన ప్రగతిరెడ్డి (35), ఆమె కుమారుడు అర్విన్ (6), అత్త సునీత (56)గా గుర్తించారు. టేకులపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, ఆయన భార్య మాజీ సర్పంచ్ పవిత్రాదేవికి ఇద్దరు

- మిగతా 2 లో

బీసీల రిజర్వేషన్ సాధనకు

నాయకత్వం వహిస్తా

- 42 శాతం కల్పించాలనే బిల్లు తీసుకొచ్చాం
- అఖిలపక్షంగా ఏర్పడి ప్రధానిని కలుద్దాం
- వర్సిటీల పేర్ల మార్పిడిపై రాజకీయాలు తగవు
- శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర – హైదరాబాద్: రాష్ట్రంలో మేధావులు, వివిధ రాజకీయ పక్షాలు, బీసీ సంఘాలందరినీ సంప్రదించిన తరువాతే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే బిల్లును తీసుకొచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సభా నాయకుడిగా బీసీ రిజర్వేషన్ల సాధనకు తాను నాయకత్వం వహిస్తానని చెప్పారు. ఈ విషయంలో అఖిలపక్షంగా అందరం కలిసికట్టుగా వెళ్లి ప్రధానిని కలుద్దామన్నారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచేందుకు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుందామని పేర్కొన్నారు. ప్రధాని మోదీ కలిసేందుకు అనుమతి ఇప్పించాలని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, బీజేపీ సభాపక్షనాయకుడిని కోరారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనసభలో సోమవారం బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతామని రాహుల్ గాంధీ ఆనాడు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మేం బాధ్యతలు చేపట్టగానే ఫిబ్రవరి నాల్గోతేదీ, 2024 లో బీసీ కులగణన ప్రక్రియను మొదలు పెట్టామని తెలిపారు. బీసీ రిజర్వేషన్లు 37 శాతానికి పెంచాలని

- మిగతా 2 లో

'రాజీవ్ యువ వికాసం'తో

5 లక్షల మందికి ఉపాధి

ప్రారంభోత్సవంలో రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర – హైదరాబాద్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని అందులో భాగంగానే రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ పథకం కింద ఐదు లక్షల మంది యువత ఉపాధి కోసం ప్రభుత్వం రూ.ఆరు వేల కోట్లు ఖర్చు చేసేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం ఆయన 'రాజీవ్ యువ వికాసం' ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచే కార్యక్రమాన్ని ఇదే ప్రాంగణంలో ప్రారంభించుకున్నట్లు తెలిపారు. ఈ 15 నెలల్లో 57 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. 50 లక్షల కుటుంబాల్లో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వెలుగులు చూస్తున్నామని పేర్కొన్నారు. 43 లక్షల కుటుంబాలు రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాన్ని ఉపయోగించుకుంటున్నారు, స్వయం సహాయక సంఘాల మహిళలకు 1 కోటి 30 లక్షల నాణ్యమైన చీరలు అందించే ప్రయత్నం చేస్తున్నట్లు వెల్లడించారు. 29,500 ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో పాఠశాలల నిర్వహణ ఆడబిడ్డలకు అప్పగించామని చెప్పారు. కులగణన నిర్వహించి బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించుకుంటున్నామన్నారు. బీసీల లెక్క 56.36 శాతంగా తేలిందని, వారికి 42 శాతం రిజర్వేషన్లు అందించాలన్నారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు బిల్లును కూడా సభ ముందుకు తీసుకొచ్చామని వివరించారు. ప్రభుత్వ ఆదాయం తగ్గినా, అప్పులు పెరిగినా ధైర్యాన్ని కోల్పోలేదన్నారు. దుబారా తగ్గించి ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇసుక, ఇతర

- మిగతా 2 లో



ప్రజాస్వామ్య పరిరక్షణ అత్యవసరం

- వామపక్ష, లౌకికపార్టీలు ఐక్యతతో ముందుకు...
- మోదీ, అమిత్ షా, జగన్ దుష్ట సంప్రదాయాలు
- సీపీఐ కార్యదర్శి నారాయణ
- అప్పులపై శ్వేతపత్రం ఇవ్వండి: రామకృష్ణ

విశాలాంధ్ర–విజయవాడ (చిట్టినగర్): మోదీ సర్కారు విచ్ఛిన్న విధానాల నుంచి దేశాన్ని కాపడుకుంటామని సీపీఐ కార్యదర్శి డా.కె.నారాయణ స్పష్టంచేశారు. దేశంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలని, అన్ని మతాలను గౌరవించాలని సూచించారు. విజయవాడలోని దాసరి భవన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో నారాయణ మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనకు మంచి మిత్రుడని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పటం, చట్టాలను తనకు అనుకూలంగా మార్చుకొని విజయం సాధించానని ట్రంప్ పేర్కొనడం చూస్తే ఇద్దరూ అవినీతిపరులని స్పష్టమవుతోందన్నారు. ఆధారాలతో చేసే ఆరోపణలకు, ఉద్దేశపూర్వకంగా చేసే ఆరోపణలకు తేడా ఉంటుందని, గుజరాత్ అల్లర్లపై దుష్ప్రచారం చేసినా తాము అధికారంలోకి వచ్చామని, కోర్టులు సైతం నేరాలను నిరూపించలేదని మోదీ చెబుతున్నారని గుర్తుచేశారు. గోద్రా ఘటనలో మైనార్టీల ఊచకోత, అల్లర్లకు భయపడి నాడు బీజేపీకి అనుకూలంగా ఓట్లు వేసిన విషయం ప్రపంచమంతా గుర్తించిందని నారాయణ చెప్పారు. గోద్రా అల్లర్ల నుంచి సాంకేతికంగా తప్పించుకున్నా... మోదీ ముమ్మాటికీ ముద్దాయేనన్నారు. తనకు తాను పవిత్రుడిగా మోదీ చెప్పుకున్నా నమ్మేవారు లేరన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సైతం అనేక నేరాలకు పాల్పడ్డారని, ఆయనకు సంబంధించిన కేసుల్లో న్యాయవాది, సాక్షులు 12 మంది హత్యకు గురైన విషయం ప్రపంచానికి విదితమేనన్నారు. సాక్షులను మాయం చేసినంత మాత్రాన నేరస్తులు కాకుండా పోతారా అని ప్రశ్నించారు. జగన్ వ్యవహార శైలి కూడా అదేనని, బహుశా ఆయన అమిత్ షా సలహా తీసుకొని ఉంటాడని అన్నారు. తన బాబాయి వివేకానందరెడ్డి హత్య కేసులో సాక్షులు వరుసగా చనిపోవడాన్ని నారాయణ ప్రస్తావించారు. మోదీ, అమిత్ షా, జగన్ దుష్ట సంప్రదాయానికి పాల్పడుతున్నారని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో అన్ని భాషల ప్రజలు భాగస్వాములయ్యారన్నారు. బౌద్ధులు, సిక్కులు, జైనులు తక్కువ శాతంగా ఉన్నా... మైనార్టీ, మెజార్టీ అనే తేడాలేకుండా ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలని రాజ్యాంగం చెబుతోందన్నారు. కానీ సమాఖ్య వ్యవస్థకు, రాజ్యాంగానికి ప్రమాదం కలిగేలా 'మెజారిటీ' నినాదాన్ని మోదీ సర్కారు ముందుకు తెస్తోందని, ఇది దేశానికి అత్యంత ప్రమాదకరమన్నారు. కేంద్రం తీసుకొచ్చిన త్రిభాషా విధానంపై స్పందిస్తూ ఎవరైనా... ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చని, పీవీ నరసింహారావుకు 18 భాషలు వచ్చని, వామపక్ష నేత సీతారాం ఏచూరికి 12 భాషలు వచ్చని గుర్తు

- మిగతా 2 లో

'మద్యం'పై బీజేపీ రగడ

తమిళనాడులో కాషాయపార్టీ నేతల అరెస్టు

చెన్నై: ఢిల్లీ తరహాలోనే వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న తమిళనాడులో కూడా మద్యం కుంభకోణం పేరుతో అధికార డీఎంకేని ఎలాగైనా అప్రదిష్టపాల్జేయాలని కంకణం కట్టుకున్న బీజేపీ.... ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందులో భాగంగా ప్రభుత్వ యాజమాన్యంలోని మద్యం రిటైలర్, తమిళనాడు స్టేట్ మార్కెటింగ్ కార్పొరేషన్ (టాస్మాక్)లో రూ.1,000 కోట్ల అవినీతి జరిగిందన్న ఆరోపణలపై ఆందోళనకు దిగింది. టాస్మాక్ మద్యం కుంభకోణంపై దర్యాప్తును కోరుతూ 17న నిరసనకు దిగబోతున్నామని ప్రకటించిన తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలై, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, రాష్ట్ర కార్యదర్శి వినోజ్ పీ సెల్వం సహా అనేకమంది బీజేపీ నేతలను సోమవారం ఉదయమే పోలీసులు అరెస్టు చేశారు. ఉదయం 11 గంటలకు చెన్నై ఎగ్మోర్‌లోని టాస్మాక్ ప్రధాన కార్యాలయం వెలుపల ధర్నా చేయాలని నిర్ణయించుకున్న అన్నామలై... ఆ వేదిక వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా అంతకుముందుగానే అక్కరైలోని ఆయన నివాసం సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. అలాగే బీజేపీ సీనియర్ నేత, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, మహిళా మోర్చా అధ్యక్షురాలు, కోయంబత్తూర్ సౌత్ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్, మరో ఎమ్మెల్యే సరస్వతి సహా అనేక మంది సీనియర్ బీజేపీ నాయకులను కూడా నగరంలోని వివిధ ప్రదేశాలలో అదుపులోకి తీసుకున్నారు. బీజేపీ నేత సౌందరరాజన్

- మిగతా 2 లో

రూ.16.35 లక్షల కోట్ల రుణాలు రద్దు: కేంద్రం

న్యూఢిల్లీ: గడిచిన పదేళ్లలో రూ.16.35 లక్షల కోట్ల మొండి బాకీలను బ్యాంకులు రద్దు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రకటించింది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.2,36,265 కోట్లు సాంకేతికంగా రద్దు చేసినట్లు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం వెల్లడించారు. 2014–15 ఆర్థిక సంవత్సరంలో కనిష్టంగా రూ.58,786 కోట్ల మొండి బాకీలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,70,270 కోట్లు, అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో రూ.2,16,324 కోట్ల చొప్పున బ్యాంకులు రద్దు చేసినట్లు వివరించారు. భారత రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాలు, బ్యాంకు బోర్డులు ఆమోదించిన విధానం ప్రకారం నాలుగు సంవత్సరాలు పూర్తయిన నిరర్థక ఆస్తులను బ్యాంకులు రైటాఫ్ చేస్తాయని ఓ ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. రద్దు చేసినంత మాత్రాన రుణ గ్రహీతలకు ఊరట కల్పించినట్లు కాదని ఆమె

- మిగతా 2 లో

'కాలుష్య రహిత విద్యుత్' లక్ష్యం

- అందుబాటులోకి గ్రీన్ పవర్ పాలసీ
- 2030 నాటికి 20 వేల మెగావాట్ల ఉత్పత్తి
- రూ.లక్ష కోట్ల పెట్టుబడికి ముందుకొచ్చిన కంపెనీలు
- శాసనమండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

శాసనమండలిలో సోమవారం తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీపై ఎమ్మెల్సీలు బల్మూరు వెంకట్, మహేష్ కుమార్ గౌడ్,

విశాలాంధ్ర – హైదరాబాద్: తక్కువ ధరతో, కాలుష్య రహితంగా విద్యుత్ అందించడమే లక్ష్యంగా సమగ్ర గ్రీన్ పవర్ పాలసీని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకు వచ్చిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రూ.80 వేల నుంచి రూ.లక్ష కోట్ల వరకు ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు పెట్టుబడుదారులు ముందుకు వచ్చారని చెప్పారు. ఇప్పటికే కొన్ని కంపెనీలు ఎంఓయులు కుదుర్చుకున్నాయని వివరించారు.

- మిగతా 2 లో

బీసీ రిజర్వేషన్ల అమలుపై

కేంద్రంపై ఒత్తిడి

- స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగావకాశాల్లో 42 శాతం పెంపు
- కలిసి రావాలంటూ ప్రతిపక్షాలకు పిలుపు
- అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి పొన్నం

విశాలాంధ్ర – హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ సోమవారం శాసనసభలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వం తరపున బిల్లు ప్రవేశపెట్టారు. అలాగే విద్య, ఉద్యోగ అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఆడబిడ్డలను జైల్లో పెట్టడమేనా ఇందిరమ్మ రాజ్యం?

'చంచల్‌గూడ'లో మహిళా జర్నలిస్టులకు కేటీఆర్ పరామర్శ

విశాలాంధ్ర – హైదరాబాద్: ఆడబిడ్డలపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టడమే ఇందిరమ్మ రాజ్యమా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. సోషల్ మీడియాలో సీఎంపై అసభ్యకరంగా వీడియోలు పెట్టారని ఆరోపిస్తూ మహిళా జర్నలిస్టులు రేవతి, తన్వి యాదవ్ లపై కేసులు పెట్టి చంచల్‌గూడ జైలుకు తరలించడంతో సోమవారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి, దాసోజు శ్రవణ్‌తో కలిసి కేటీఆర్ జైలులోఉన్న వారిని పరామర్శించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసహనాన్ని, వ్యతిరేకతను చెప్పిన జర్నలిస్టులను అక్రమంగా అరెస్ట్ చేస్తారా

- మిగతా 2 లో

తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు ముదావహం

కూనంనేని



విశాలాంధ్ర– హైదరాబాద్: తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి యూనివర్సిటీగా పేరు మార్చేందుకు తీసుకున్న నిర్ణయం ముదావహమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. దీనిపై విమర్శలు ప్రతి విమర్శలు రావడం బాధాకరమన్నారు. పొట్టి శ్రీరాములుపై మనందరికీ గౌరవం ఉందని, సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ వైతాళికుడని దేశమొత్తం అంగీకరించిన విషయం అందరికి తెలుసన్నారు. 1930లో ప్రథమ ఆంధ్ర సభ ఏర్పాటు చేసినప్పుడు ఆయన అధ్యక్షులుగా ఉన్నారన్నారు. ఆంధ్ర మహాసభ అంతిమంగా హైదరాబాద్ రాష్ట్రం సాధించుకోవడానికి, భారత దేశంలో విలీనం కావడానికి చేసిన పోరాటానికి అంకురార్పణ జరిగిన ప్రథమ ఆంధ్ర మహాసభకు ప్రతాపరెడ్డి అధ్యక్షుడిగా వ్యవహరించారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి బీజాలు వేసింది కూడా ఆంధ్ర మహాసభ అని కూనంనేని గుర్తు చేశారు. నాడు తెలంగాణ ఉద్యమంలో త్యాగాలుచేసిన వారిలో 90 శాతం మంది కమ్యూనిస్టులే ఉన్నారన్నారు. 364 మంది కవులను సమీకరించి వారి రచనలను ఆరు నెలల్లో గొల్కొండ పత్రికలో ప్రచురించడం జరిగిందన్నారు. తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప రెడ్డి పేరును అందరూ అంగీకరిస్తే సంతోషమన్నారు. ఎన్.జి.రంగా చాలా గొప్ప వ్యక్తి అని ఆయన పేరుపై ఉన్న వ్యవసాయ వర్సిటీకి పేరు మార్చిన సమయంలో ఇలాంటి చర్చ జరగలేదన్నారు. ఎన్టీఆర్ మన అందరికి తెలుసునని ఆయన పేరు తీసివేసి కాళోజీ పేరు పెట్టారని, నాడు సైతం ఈ చర్చ జరగలేదన్నారు. ఇక్కడ పేర్లు మార్చామని, ఆంధ్రప్రదేశ్‌లో అవే పేర్లపై వర్సిటీలు కొనసాగుతున్నా యన్నారు. ఒకరిపై ఒకరికి ద్వేషం కాదన్నారు. బిల్లుకు సహకరించి అందరూ ఆమోదిస్తే చిరస్థాయిగా గుర్తించుకునే విధంగా ఉంటుందని విజ్ఞప్తి చేశారు.



ఎమర్జెన్సీ: సీపీఐ మింగిన గరళం

మరో మూడు నెలలు గడిస్తే దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తవుతాయి. దేశంలో క్రమశిక్షణ తప్పిందని, అందుకే ఎమర్జెన్సీ విధిస్తున్నామని అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ సమర్థించుకున్నారు. అవినీతికి వ్యతిరేకంగా గుజరాత్‌లో విద్యార్థులు భారీ ఎత్తున ఉద్యమించారు. ఈ ఉద్యమం వెనక ఆర్.ఎస్.ఎస్. హస్తం ఉంది. ఆ ఉద్యమంలో ప్రధాన పాత్రధారి ఆరెస్సెస్సే. ఈ ఉద్యమానికి లోకనాయక్ జై ప్రకాశ్ నారాయణ మద్దతిచ్చారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

భూమ్మీదకు సునీతా విలియమ్స్

షెడ్యూల్ ఖరారు

వాషింగ్టన్: దాదాపు 9 నెలల పాటు అంతరిక్షంలో చిక్కుకుపోయిన భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్ ఎట్టకేలకు భూమిని చేరుకోనున్నారు. మరికొన్ని గంటల్లో వారి తిరుగుపయనం ప్రారంభం కానుంది. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం 5.57 గంటలకు (భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 3 గంటలకు) వారు భూమ్మీద ల్యాండ్ అవనున్నారు. ఈ మేరకు నాసా ప్రకటించింది. సునీత, విల్మోర్‌ను తీసుకొచ్చేందుకు స్పేస్ఎక్స్ వ్యోమనౌక క్రూ డ్రాగన్ ఆదివారం విజయవంతంగా భూ కక్ష్యలోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో అనుసంధానమైంది. క్రూ-10 మిషన్‌లో వెళ్లిన నలుగురు వ్యోమగాములు ఒక్కొక్కరిగా అంతరిక్ష కేంద్రంలోకి ప్రవేశించారు. దీంతో సునీత రాకకు మార్గం సుగమమైంది. క్రూ డ్రాగన్ వ్యోమనౌక హ్యాచ్ మూసివేత ప్రక్రియ అమెరికా కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 10.45 గంటలకు మొదలవుతుంది. సోమవారం అర్ధరాత్రి 12.45 గంటలకు అంతరిక్ష కేంద్రం నుంచి క్రూ డ్రాగన్ వ్యోమనౌక అన్‌డాకింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ స్పేస్‌షిప్ విజయవంతంగా విడిపోయిన తర్వాత మంగళవారం సాయంత్రం 4.45 గంటలకు వ్యోమనౌక భూమికి తిరుగు పయనమవుతుంది. మంగళవారం సాయంత్రం 5.11 గంటలకు భూకక్ష్యలను దాటుకుని కిందకు వస్తుంది. అదే రోజు సాయంత్రం 5.57 గంటలకు ఫ్లోరిడా తీరానికి చేరువలో ఉన్న సముద్ర జలాల్లో స్పేస్ఎక్స్ క్యాప్సూల్ దిగుతుంది. అందులో నుంచి ఒక్కొక్కరిగా వ్యోమగాములను బయటకు తీసుకొస్తారని నాసా వెల్లడించింది.

ప్రత్యక్ష ప్రసారం

ఈ ప్రక్రియను నాసా ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. దీనిని నాసాలో భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 8:15 గంటల నుంచి స్ట్రీమింగ్ కానుంది. అలాగే నాసాకు సంబంధించిన సోషల్ మీడియా వేదికల్లో కూడా ప్రసారం కానుంది.

భారత ప్రధాని సానుకూల వ్యాఖ్యలకు చైనా అభినందన

బీజింగ్: భారత్-చైనాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని కోరుకుంటున్నట్లు ప్రధాని మోదీ పేర్కొనడాన్ని చైనా అభినందించింది. మోదీ సానుకూల వ్యాఖ్యలు అభినందనీయమని, పరస్పర సహకారం ఇరుదేశాల విజయానికి దోహదపడుతుందని పేర్కొంది. అమెరికాకు చెందిన లెక్స్ ఫ్రిడ్‌మన్ పాడ్‌కాస్ట్‌లో భారత్-చైనా సంబంధాలపై మోదీ సానుకూలంగా మాట్లాడిన నేపథ్యంలో చైనా ఈ విధంగా స్పందించింది. "గతేడాది అక్టోబర్‌లో రష్యాలోని కజాన్‌లో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల భేటీ.. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడటంతో పాటు వ్యూహాత్మక మార్గదర్శకత్వానికి దోహదం చేసింది. శతాబ్దాల చర్చల చరిత్రలో రెండు దేశాలు స్నేహపూర్వక సంప్రదింపులు కొనసాగించాయి. ఒకదాని నుంచి మరొకటి నేర్చుకుంటూ మానవ నాగరికత, పురోగతికి కృషి చేశాయి. అభివృద్ధి చెందుతున్న రెండు అతిపెద్ద దేశాలుగా ఉన్న చైనా, భారత్‌లు.. పరస్పరం సహకారంతో అభివృద్ధిపథంలో దూసుకెళ్తున్నాయి" అని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాధినేతల ఉమ్మడి లక్ష్యాలకు అనుగుణంగా భారత్‌తో కలిసి పనిచేసేందుకు చైనా సిద్ధంగా ఉందన్న విషయాన్ని ఆమె మరోసారి గుర్తుచేశారు. ఫ్రిడ్‌మన్ పాడ్‌కాస్ట్‌లో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారత్-చైనాల మధ్య వైరుధ్యాల పరిష్కారానికి చర్చలకే మొగ్గు చూపుతానని పేర్కొన్న సంగతి తెలిసిందే. వాస్తవాధీన రేఖ వెంట 2020 ముందునాటి పరిస్థితులను నెలకొల్పేందుకు రెండు దేశాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. ఇరు దేశాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని కోరుకుంటున్నామని, అది ఘర్షణకు దారి తీయరాదని పేర్కొన్నారు.

నేడు పుతిన్‌తో ట్రంప్ చర్చలు

వాషింగ్టన్: రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రయత్నిస్తున్న క్రమంలో మంగళవారం ఆయన రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడే అవకాశాలు ఉన్నాయి. ఆదివారం ఎయిర్ ఫోర్స్ వన్‌లో ట్రంప్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఉక్రెయిన్, రష్యా శాంతి ఒప్పందంపై పుతిన్‌తో మాట్లాడనున్నట్లు చెప్పారు. 'పుతిన్‌తో ఫోన్‌లో సంభాషించే అవకాశాలు ఉన్నాయి. గత వారం శాంతి ఒప్పందం కోసం అనేక చర్యలు చేపట్టాం. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు ప్రయత్నిస్తాం. భూభాగం అప్పగింత గురించి మాట్లాడుతాం. పవర్ ప్లాంట్ల గురించి కూడా చర్చిస్తాం' అన్నారు. ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాటించేందుకు పుతిన్, ట్రంప్ చర్చిస్తారని కొన్ని రోజుల క్రితం అమెరికా దౌత్యవేత్త స్టీవ్ విట్‌కాఫ్ తెలిపారు. ఇటీవల మాస్కోలో పుతిన్‌తో విట్‌కాఫ్ భేటీ అయ్యారు. ఆ చర్చలు పాజిటివ్‌గా ముగిసినట్లు ఆయన చెప్పారు. రష్యా, ఉక్రెయిన్ వర్గాలు.. చర్చలు చేపట్టేందుకు సుముఖంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇటీవల అమెరికా నేతృత్వంలో జెడ్డాలో జరిగిన భేటీలో ఉక్రెయిన్ 30 రోజుల కాల్పుల విరమణకు అంగీకరించింది. అయితే ఆ ప్రతిపాదనకు రష్యా కూడా అనుకూలంగా ఉన్నప్పటికీ కొన్ని షరతులు విధించిన క్రమంలో ట్రంప్, పుతిన్ ఫోన్ చర్చలు కీలకం కానున్నాయి.

టారిఫ్‌లపై వెనక్కు తగ్గం...

తమ దేశ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్న దేశాలపై భారీగా ప్రతి సుంకాలుంటాయని హెచ్చరించిన ట్రంప్... ఆ విషయంలో తగ్గేదేలేదని... తమ వ్యాపార భాగస్వాములపై ఏప్రిల్ 2 నుంచి సుంకాలు విధిస్తామని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు. సుంకాలపై ఏ దేశానికీ మినహాయింపులు కల్పించే ఉద్దేశం తమకు లేదని అమెరికా అధ్యక్షుడు పేర్కొన్నారు. "ఏప్రిల్ 2 మన దేశానికి విముక్తి కలిగించే రోజు. ఇదివరకు అధికారంలో ఉన్న తెలివి తక్కువ అధ్యక్షులు తాము ఏమి చేస్తున్నామో కూడా తెలియకుండా మన సంపదను ఇతరులకు ఇస్తూ పోయారు. ప్రస్తుతం విధిస్తున్న సుంకాల ద్వారా అందులో కొంత భాగాన్ని తిరిగి పొందబోతున్నాము. ఇన్నాళ్లు వారు మన నుంచి వసూలు చేశారు. వాటన్నిటినీ తిరిగి వసూలుచేసుకోవడానికి ఆయా దేశాలపై అదనపు సుంకాలు విధిస్తున్నాం" అని ట్రంప్ పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ అత్యవసరం

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. భాషల వల్ల రాష్ట్రాలు అభివృద్ధి సాధించలేవన్నారు. తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ఇష్టంలేని భాషను రుద్దవద్దని నారాయణ హితవు పలికారు. డీలిమిటేషన్ వివాదాన్ని ప్రస్తావిస్తూ... జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే కొన్ని రాష్ట్రాలకు సీట్ల సంఖ్య తగ్గుతుందన్నారు. నాడు జనాభా నియంత్రణ గురించి మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ఎక్కువమంది పిల్లలను కనమని చెబుతున్నారని, మహిళలు పిల్లలను కనే యంత్రాలుగా భావించొద్దని హితవు పలికారు. చర్చల ద్వారా నక్సలిజం సమస్యకు పరిష్కారం కనుగొనాలని, భౌతికంగా అంతం చేయడం సరికాదన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలివితేటలు అసంబద్ధ సనాతనవాదం కోసం కాకుండా రాష్ట్రాభివృద్ధి కోసం ఉపయోగిస్తే మంచిదని సూచించారు. లౌకికవ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వీటిపై సీపీఐ జాతీయమహాసభల్లో చర్చిస్తామన్నారు. వామపక్ష, లౌకిక పార్టీల ఐక్యత బలోపేతం అవసరమన్నారు.

రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు ఢిల్లీ వెళ్లి మోదీని ఆర్థిక సహాయం కోరటంలో తప్పు లేదన్నారు. అదేసమయంలో రాజధాని అమరావతికి ఇస్తున్న నిధులు గ్రాంటుగా ఇస్తున్నారా లేక అప్పుగా ఇస్తున్నారో స్పష్టంచేయాలని చంద్రబాబును ప్రశ్నించారు. హడ్కోతో రూ.11 వేల కోట్ల రుణానికి సంబంధిచిన ఒప్పందంపై ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పందం జరిగిందని, ఏడీబీ, ఇతర ఆర్థిక సంస్థల నుంచి కూడా అప్పులు తీసుకుంటున్నారని, వీటి సంగతేమిటని నిలదీశారు. వీటి ద్వారా చంద్రబాబు ప్రభుత్వం సైతం రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నట్లు కనిపిస్తోందని రామకృష్ణ విమర్శించారు. అమిత్ షా రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు రూ.3 లక్షల కోట్లు రాష్ట్రానికి ఇచ్చినట్లు చెప్పారని, ఆ నిధులు ఏమయ్యాయని నిలదీశారు. గత ప్రభుత్వం అప్పులు, 9 మాసాల్లో కూటమి ప్రభుత్వం చేసిన అప్పులపై స్పష్టత ఇవ్వాలని, శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీపై స్పష్టత రావట్లేదని, ప్రైవేటీకరణ కాకుండా స్వయంగా ప్రధాని మోదీతో చెప్పించాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతం దిశగా...

- 20 నుంచి అన్ని జిల్లాల్లో కేటీఆర్ పర్యటన
- ముఖ్య నేతలు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు

విశాలాంధ్ర - హైదరాబాద్: బీఆర్ఎస్ ... సిల్వర్ జూబ్లీ (25 సంవత్సరాలు) సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు పటిష్ట ప్రణాళికతో ఉంది. ఇందులో భాగంగా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బడ్జెట్ సమావేశాల అనంతరం రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పర్యటించనున్నారు. జిల్లా కేంద్రాల్లో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తారు. ఇప్పటికే ఆ పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ భవన్‌లో పార్టీ సీనియర్ నేతలు ప్రజాప్రతినిధులతో విస్తృతస్థాయి సమావేశం జరిగింది. అందులో భాగంగా వరంగల్‌లో లక్షలాదిమందితో భారీ బహిరంగ సభ నిర్వహించనునట్లు పార్టీ ప్రకటించింది. పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యాచరణ రూపొందించబడింది. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వంచిస్తున్న తీరుపై చేపట్టాల్సిన కార్యాచరణపై కేటీఆర్ పార్టీ శ్రేణులకు మార్గదర్శనం చేయనున్నారు. ఈ నేపథ్యంలో, ఈ నెల 20న సూర్యాపేట, 23న కరీంనగర్ జిల్లా నాయకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించ నున్నారు. 14 ఏళ్ల ఉద్యమం ప్రస్థానంతోపాటు, పదేళ్ల ప్రగతి ప్రస్థానంలో తెలంగాణ సమాజంతో బీఆర్ఎస్ పార్టీ పెనువేసుకున్న ఆత్మీయ అనుబంధాన్ని ఈ సమావేశాల ద్వారా మరోసారి గుర్తుచేసుకోనున్నారు. ఒడిదుడుకులు ఎదురైనా గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకుని నిలబడ్డ పార్టీ శ్రేణులకు మళ్లీ ఉజ్వల భవిష్యత్తు ఉండబోతున్న విషయాన్ని కేటీఆర్ తెలియజేయనున్నారు. ఏడాదిన్నరలోనే తీవ్రమైన ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్ సర్కారుపై ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారని, తెలంగాణ ప్రజల భరోసా ఇప్పుడు బీఆర్ఎస్... కేసీఆర్ పైనే ఉన్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో మరింత క్రియాశీలకంగా పనిచేయాలని దిశానిర్దేశం చేయబోతున్నారు.

నాయకత్వం వహిస్తా

(మొదటిపేజీ తరువాయి)

గత ప్రభుత్వం గవర్నర్ కు ప్రతిపాదన పంపించిందని వివరించారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచేందుకు గత ప్రభుత్వం గవర్నర్ కు పంపిన ప్రతిపాదనను ఉపసంహరించుకుని కొత్త ప్రతిపాదన పంపిస్తున్నామని వెల్లడించారు. 'సామాజిక న్యాయం రోజు'గా సభ ద్వారా తీర్మానం చేశామన్నారు.

రాహుల్ గాంధీని కూడా కలిసి పార్లమెంట్ లో ఈ అంశాన్ని ప్రస్తావించాలని కోరదామని అన్నారు. కులసర్వేలో పొందుపరిచిన బీసీల లెక్క వందశాతం సరైందని తెలిపారు. బీసీ బిల్లును పార్లమెంటులో ఆమోదించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. పొట్టి శ్రీరాములు చేసిన కృషిని ఎవరూ తక్కువగా చూడటంలేదని, వారి ప్రాణత్యాగాన్ని గుర్తించి అందరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి కాళోజీ పేరు పెట్టుకున్నాం అంటే ఇది ఎన్టీఆర్ ను అగౌరవపరిచినట్టు కాదన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీకి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టుకున్నాం, వైఎస్ పేరుతో ఉన్న హార్టికల్చర్ వర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నాం, వెంకటేశ్వర వెటర్నరీ వర్సిటీకి పీవీ పేరు పెట్టుకున్నాం, ఇందులో భాగంగానే పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టుకున్నామని వివరించారు. ఉమ్మడి ఏపీలో పాత పేర్లతో కొనసాగుతున్న యూనివర్సిటీలకు తెలంగాణలో పేర్లు మార్చుకున్నామని చెప్పారు. విశాల ప్రయోజనాల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు, బాధ్యతాయుత పదవుల్లో ఉన్నవారు కులాన్ని ఆపాదిస్తున్నారని మండిపడ్డారు. కుల, మత ప్రాతిపదికన విభజించి రాజకీయ ప్రయోజనాలు పొందాలనుకుంటే అది తప్పన్నారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్ కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టుకుందామని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్రం నుంచి అనుమతులు తీసుకురావాలన్నారు. బల్కంపేట నేచర్ క్యూర్ ఆసుపత్రికి రోశయ్య పేరు పెట్టుకుందాం, రోశయ్య సేవలను కీర్తించుకునేలా అక్కడ వారి విగ్రహాన్ని ఆవిష్కరించుకుందామన్నారు.

'కాలుష్య రహిత విద్యుత్' లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

కల్వకుంట్ల కవిత, భాను ప్రసాద్ ప్రశ్నలకు భట్టి సమాధానం ఇచ్చారు. 2030 నాటికి 20 వేల మెగావాట్లు, 2040 నాటికి 40 వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యమన్నారు. సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్ వంటి విభాగాల ద్వారా విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. గ్రీన్ పవర్ లో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు సింగిల్ విండో పద్ధతుల్లో అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రభుత్వ, దేవదాయ శాఖ ఖాళీ భూముల్లో సోలార్, ఫ్లోటింగ్ సోలార్ ద్వారా గ్రీన్ పవర్ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు వివరించారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి జెన్కోతో ఎంఓయు చేసుకున్నామని చెప్పారు. ప్రభుత్వ ఖాళీ భూములను వీరికి లీజుకు ఇచ్చి పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. నిరుద్యోగులు... బ్యాంకుల సహకారంతో గ్రీన్ పవర్ ఉత్పత్తి చేసేందుకు అవకాశం ఉందన్నారు. ఇటీవల రాజస్థాన్ ప్రభుత్వంతో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందాలు చేసుకున్నామని తెలిపారు. ఎలక్ట్రికల్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు రిజిస్ట్రేషన్‌లో ట్యాక్స్ ఫ్రీ చేశామని ఫలితంగా విక్రయాలు పెరిగాయని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 8,938 మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు. ఉత్సాహవంతులు ముందుకు వస్తే ఎలక్ట్రికల్ చార్జింగ్ స్టేషన్‌లు పెట్టుకునేందుకు అనుమతులు ఇస్తామన్నారు. రాష్ట్రంలో ఎలక్ట్రికల్, బ్యాటరీ బేస్డ్ బస్సులు ప్రవేశ పెడుతూ, డీజిల్ బస్సులను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నామని వివరించారు. హైదరాబాద్ సిటీలో డీజిల్ ఆటోలకు అనుమతి ఇవ్వడం లేదని, బ్యాటరీతో నడిచే ఆటోలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కాలుష్య కార్యక్రమం నగరం నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వెలుపులకు తరలించాలని ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు.

ఆడబిడ్డలను జైల్లో పెట్టడమేనా ఇందిరమ్మ రాజ్యం?

(మొదటిపేజీ తరువాయి)

అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రధాన మీడియాని రేవంత్ రెడ్డి తనకు అనుకూలంగా మార్చుకున్నాడు కాబట్టి ప్రజలు డిజిటల్ మీడియాలో తమ అభిప్రాయాన్ని బయట పెడితే జర్నలిస్టులను జైలులో పెట్టడం ఎంతవరకు న్యాయం అని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక సిద్దిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గౌతమ్ గౌడ్, ఆకుల శ్రీనివాస్ రెడ్డి, శంకర్ గౌడ్, రంజిత్ రెడ్డి, రాజ్ కుమార్ నాయక్, సరిత యాదవ్, విజయారెడ్డి, రేవతి, తన్వీ యాదవ్, శివారెడ్డి ... ఇలా ఎంతో మంది జర్నలిస్టులను అక్రమ అరెస్ట్ చేశారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి వ్యవహార శైలిని చూస్తుంటే ఇందిరమ్మ ఎమర్జెన్సీ రోజులు గుర్తుకు వచ్చేలా ఉందని అన్నారు. 420 హామీలను ఇచ్చి తమని మోసం చేసి కాంగ్రెస్ గద్దెనెక్కిందని ప్రజలు తమ ఆక్రోషాన్ని వెళ్లగక్కుతున్నారని అన్నారు. రాహుల్ గాంధీ చెప్పిన మొహబ్బత్ కి దుకాణ్ ఇదేనా అని ప్రశ్నించారు. జనం నిలదీస్తే ప్రజలు ప్రశ్నిస్తే జర్నలిస్టులపై ఉక్కుపాదం మోపుతారా... జర్నలిస్టులను జైలుకు పంపుతారా అని నిలదీశారు. ఆరు గ్యారంటీ లతోపాటు ఏడో గ్యారెంటీ ప్రజాస్వామ్యమని పెద్ద పెద్ద మాటలు చెప్పిన రేవంత్ రెడ్డి ప్రజలు గొంతు విప్పితే మాత్రం తట్టుకోలేకపోతున్నాడని ధ్వజమె త్తారు. తన భార్య పిల్లలను దూషిస్తున్నారని బాధపడుతున్న రేవంత్ రెడ్డి గతంలో మా మీద అవాకులు చెవాకులు మాట్లాడిన సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు. మా పిల్లల ప్రస్తావన తీసుకుని వచ్చినప్పుడు రేవంత్‌కు తన కుటుంబం గుర్తుకు రాలేదా... నువ్వు మాట్లాడితే మంచిది ఇంకొకరు మాట్లాడితే చెడ్డదా అని మండిపడ్డారు. జర్నలిస్టుల తరపున న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. జైల్లో పెడతామంటే భయపడడానికి ఇక్కడ ఎవరూ లేరు... తామంతా ఉద్యమాల నుంచి, జనం నుంచి వచ్చిన వాళ్లం, కేసులకి భయపడే వాళ్లం కాదని హెచ్చరించారు. దయచేసి మీడియా గొంతు విప్పి రేవంత్ రెడ్డి అక్రమాలపై మాట్లాడాలని పిలుపునిచ్చారు.

మహిళా జర్నలిస్టులకు బెయిల్

విశాలాంధ్ర- హైదరాబాద్: పల్స్ న్యూస్ ఎండీ పి.రేవతి, రిపోర్టర్ బండి సంధ్య అలియాస్ తన్వీ యాదవ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ నాంపల్లి కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రూ. 25 వేల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేసింది. ప్రతి సోమ, శుక్రవారం విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. కోర్టు ఆర్డర్ కాపీలు అందిన వెంటనే చంచల్‌గూడ జైలు నుంచి విడుదల కానున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన ఓ రైతు వీడియోను పోస్ట్ చేయడమే వీరు చేసిన నేరం. ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం అంటూ మహిళా జర్నలిస్టులను అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. అరెస్టు అనంతరం వీరిద్దరిని ఎనిమిది గంటల పాటు రహస్యంగా విచారించారు.

కేంద్రంపై ఒత్తిడి

(మొదటిపేజీ తరువాయి)

పెంచుతూ మరో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ ఇక్కడ చట్టబద్ధం చేసిన బిల్లుపై తెలంగాణ అంత ఒక్కటిగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వద్దకు వెళ్దామన్నారు. కామారెడ్డి డిక్లరేషన్, న్యాయవాద అంశాలు ఏవైనా తరువాత మాట్లాడుకుందామని... ముందు రిజర్వేషన్లపై ఏకగ్రీవంగా చట్టబద్ధత కల్పించి ఢిల్లీకి వెళ్తే మంచిదని సూచించారు. రాజ్యాంగ సవరణలో 50 శాతం పరిమితి మించి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఎలా అమలు చేశారో ఇప్పుడు బీసీ రిజర్వేషన్లు పెంచడానికి మీ నాయకత్వాన్ని ఒప్పించాలని బీజేపీ సభ్యులను ఉద్దేశించి అన్నారు. ఒక గొంతుగా ఐక్యమయ్యారని కేంద్రం భావించి రిజర్వేషన్లు అమలు చేసేలా మనం ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు.

నేతలంతా మద్దతివ్వాలి: బీర్ల ఐలయ్య

దేశాన్ని పాలించిన ప్రధాన మంత్రుల కంటే ఈ పదేళ్లలో మోదీ రూ.130 లక్షల కోట్లు అప్పులు చేశారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ ప్రవేశపెట్టిన తర్వాత జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ ఇక్కడ బీసీ అంశం మాట్లాడమంటే మోదీ అంశంపై నేతలు మాట్లాడటం ఏంటని మండిపడ్డారు. ఇంత అప్పు చేసి భారతదేశాన్ని ఎక్కడ తాకట్టు పెట్టాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. బీసీ కులగణన చేయాలనే రాహుల్ గాంధీ సంకల్పాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెరవేర్చారన్నారు. గత పదేళ్లలో బీసీలను అణగదొక్కారు... ఇప్పుడు బీసీ బిల్లు పై చర్చలో కూడా బీసీల కోసం మద్దతు ఇవ్వకపోవడం ఏంటని నిలదీశారు. బిల్లుకు మద్దతు ఇవ్వాలన్నారు.

బడుగు బలహీన వర్గాలకు...చారిత్రాత్మక దినం: మహేశ్ గౌడ్

తెలంగాణలో బడుగు బలహీన వర్గాలకు ఇది చారిత్రాత్మక దినమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. శాసనసభలో బీసీ బిల్లు ప్రవేశపెట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీ బిల్లును ప్రవేశ పెడుతున్న కాంగ్రెస్‌తో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కలిసిరాకపోతే బీసీ సామాజికవర్గం ఆయా పార్టీలను ఎన్నటికీ క్షమించదన్నారు. బీజేపీ నేతలకు నిజంగా బీసీలకు న్యాయం చేయాలని ఉంటే దీన్ని కేంద్రంలో కూడా ఆమోదించేలా అధిష్టానాన్ని ఒప్పించాలని సూచించారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తుందని చెప్పడానికి బీసీ రిజర్వేషన్ల, ఎస్సీ వర్గీకరణ బిల్లులను చట్టసభల్లో ప్రవేశపెట్టడమే నిదర్శనమన్నారు. బీసీలకు న్యాయం చేసే దిశగా వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్య, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిల్లును చట్టసభల్లో ఆమోదం తర్వాత కేంద్రానికి పంపిస్తుందని వివరించారు. గతంలో 23 శాతానికి తగ్గించి చారిత్రాత్మక తప్పు చేసిన బీఆర్ఎస్ ఇప్పుడు పశ్చాతాపంతో బిల్లు ఆమోదం కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు.

రూ.16.35 లక్షల కోట్ల రుణాలు రద్దు: కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పుకొచ్చారు. రుణాలు తిరిగి వసూలుకు బ్యాంకులు వివిధ మార్గాలు అనుసరిస్తాయన్నారు. సివిల్ కోర్టుల్లో దావా వేయడం, రుణ రికవరీ ట్రిబ్యునళ్లను ఆశ్రయించడం, ఎన్‌సీఎల్‌టీ ఆశ్రయించడం వంటి పద్ధతులను అనుసరిస్తాయని తెలిపారు. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం 2024 డిసెంబర్ 31 నాటికి షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు 29 కంపెనీలను ఎన్‌పీఏలుగా గుర్తించినట్లు మంత్రి వివ రించారు. వాటిలో ప్రతి ఒక్కటి రూ.1,000 కోట్లకు పైగా బకా యిలు కలిగి ఉన్నాయని చెప్పారు. వీటి విలువ రూ.61,027 కోట్ల పైమాటేనన్నారు. 8వ వేతన కమిషన్‌ను ఏర్పాటు చేశామని, సిఫార్సుల ఆధారంగా ఆర్థికంగా ఎంతమేర ప్రభావం పడుతుందనేది తెలుస్తుందని మరో ప్రశ్నకు సమాధానంగా నిర్మలా సీతారామన్ చెప్పారు.

కాగ్ నియామక ప్రక్రియపై కేంద్రానికి సుప్రీం నోటీసు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. అలాగే దానిని ఈ అంశంపై పెండింగ్ కేసుతో జత చేసింది. ఎన్జీఓ సెంటర్ ఫర్ పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ దాఖలు చేసిన పిల్ పై ధర్మాసనం స్పందిస్తూ... 'అంతిమంగా మనం మన సంస్థలను విశ్వసించాలి. ఆర్టికల్ 148 కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు అందించే రక్షణను అందిస్తుంది' అని పేర్కొంది. పిటిషనర్ తరపున హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ... ఈ ప్రశ్న సంస్థ స్వేచ్ఛకు సంబంధించిందన్నారు. మహారాష్ట్ర వంటి బీజేపీ పాలిత రాష్ట్రాల కాగ్ ఆడిట్‌లను నిలిపివేస్తున్నాయని పేర్కొన్నారు. చాలా కాలంగా కాగ్ నియామకం చాలావరకు స్వతంత్రంగా ఉండేది. కానీ ఇటీవల కేంద్రం, రాష్ట్రాలు, ప్రభుత్వ రంగ సంస్థల పథకాలను ఆడిట్ చేసే రాజ్యాంగ సంస్థ స్వేచ్ఛ హరించారని తెలిపారు. గతంలో 40 ఆడిట్ నివేదికలతో పోలిస్తే... 2023లో 18 కాగ్ నివేదికలు మాత్రమే పార్లమెంటులో సమర్పించబడ్డాయని భూషణ్ అన్నారు. 'ఇప్పుడు, ముఖ్యంగా కేంద్రంలోని అధికార పార్టీ పాలించే రాష్ట్రాల్లోని పథకాలను ఆడిట్ చేయడానికి కాగ్‌కు అనుమతి లేదు. ప్రత్యేకించి మహారాష్ట్రకు, ఆడిట్ బృందాలు సిద్ధంగా ఉన్నాయి, కానీ ఎన్నికల తర్వాత ఆడిట్ చేయాలని ఆదేశం వచ్చింది" అని ఆయన అన్నారు.

'మద్యం'పై బీజేపీ రగడ

(మొదటిపేజీ తరువాయి)

తన నిర్బంధంపై మాట్లాడుతూ 'వారు మమ్మల్ని ఇంటి నుండి బయటకు వెళ్లనివ్వడం లేదు. మా కార్యకర్తలలో మూడు వందల మందిని ఒక కల్యాణ మండపంలో నిర్బంధిం చారు. టీఏఎస్ఎంఏసీలో జరిగిన వెయ్యి కోట్ల రూపాయల కుంభకోణంపై దర్యాప్తు చేపట్టాలని కోరుతున్నామని' అన్నారు. పోలీస్ నిర్బంధాలను అన్నామలై ఖండించారు. డీఎంకే ప్రభుత్వం భయంతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. 'ఎక్స్' ఆయన స్పందిస్తూ... 'డీఎంకే ప్రభుత్వం భయంతో వణికిపోతోంది. అందుకే బీజేపీ నేతలైన తమిళిసై సౌందరరాజన్, రాష్ట్ర కార్యదర్శి వినోజ్ పి సెల్వన్ రాష్ట్ర జిల్లా నిర్వాహకులను గృహ నిర్బంధంలో ఉంచింది. వారు నిరసనలో పాల్గొనకుండా నిర్బంధించింది. తేదీ ప్రకటించకుండా అకస్మాత్తుగా నిరసన ప్రారంభిస్తే ఏం చేయగలరు?' అని అన్నామలై ప్రశ్నించారు. కాగా డీఎంకే ప్రభుత్వం బీజేపీ చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. ప్రతిపక్షపాలిత రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకుని, కేంద్ర సంస్థలు పనిచేస్తున్నాయని డీఎంకే నేతలు ఆరోపించారు.

రూ. వెయ్యికోట్ల అవినీతి: ఈడీ

తమిళనాడు స్టేట్ మార్కెటింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ (టాస్మాక్)లో రూ.1,000 కోట్లకు పైగా అవినీతి చోటుచేసుకుందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని టాస్మాక్.. రాష్ట్రవ్యాప్తంగా 4,830 దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు సాగిస్తోంది. వీటిల్లో ప్రతిరోజూ సరాసరిన రూ.150 కోట్ల మేర వ్యాపారం జరుగుతోంది. టాస్మాక్ సంస్థ ఏడు కంపెనీల నుంచి బీర్లు, 11 కంపెనీల నుంచి మద్యం రకాలు కొనుగోలు చేస్తోంది. మద్యం దుకాణాల్లో నిర్వహించే బార్లు ప్రధానంగా అధికార పార్టీ నేతలకు చెందినవనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో చెన్నైలోని టాస్మాక్ ప్రధాన కార్యాలయం, మద్యం విక్రయించే సంస్థలు, టాస్మాక్ మాజీ అధికారుల ఇళ్లలో ఈ నెల 6న ఈడీ అధికారులు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. మూడు రోజులు సాగిన ఈ తనిఖీల్లో కీలక పత్రాలు, భారీగా నగదు లభ్యమైనట్లు సమాచారం. దర్యాప్తు అనంతరం టెండర్ ప్రక్రియలలో అవకతవకలు బయటపడ్డాయని... ప్రాథమిక అర్హత ప్రమాణాలను పాటించని బిడ్డర్లకు రూ.100 కోట్ల విలువైన రవాణా ఒప్పందాలు జరిగాయని, ఒకే దరఖాస్తుదారు ఉన్నప్పటికీ కొన్ని టెండర్లు మంజూరు చేయబడ్డాయని ఈడీ ప్రకటించింది. ప్రముఖ మద్యం తయారీదారులు - ఎస్ఎన్‌జె, కాల్స్, అక్కోర్డ్, ఎస్ఏఐఎఫ్ఎల్... శివ డిస్టిలరీ - దేవి బాటిల్స్, క్రిస్టల్ బాటిల్స్ వంటి బాట్లింగ్ కంపెనీల ద్వారా లెక్కల్లో లేని నగదును తరలించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నిధులను టాస్మాక్ అధికారులకు లంచం ఇవ్వడానికి ఉపయోగించారని ఆరోపణలు ఉన్నాయి. సిబ్బంది బదిలీలలో లంచం తీసుకోవడాన్ని కూడా ఈడీ పరిశీలిస్తోంది. అలాగే టాస్మాక్ దుకాణాలు క్రమం తప్పకుండా వినియోగదారుల నుండి బాటిల్‌కు రూ.10 నుండి రూ.30 వరకు అధికంగా వసూలు చేస్తున్నాయని ఆరోపణలున్నాయి. పెరిగిన ఖర్చులు, నకిలీ ఇన్‌వాయిస్‌ల ద్వారా ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని, అక్రమ నగదు ప్రవాహ చక్రం సృష్టించబడిందని ఈడీ ఆరోపించింది. పెద్ద మొత్తాలను స్వాహా చేయడానికి ముందు డిస్టిలరీలు లంచం, అక్రమ చెల్లింపుల కోసం ముఖ్యంగా నకిలీ బాటిల్ తయారీ ఒప్పందాల ద్వారా ఖర్చులను క్రమపద్ధతిలో పెంచాయని ఆధారాలు సూచిస్తున్నాయని ఈడీ స్పష్టం చేసింది. ఈ క్రమంలో బీజేపీ ఆందోళనలకు పిలుపునిచ్చింది.

5 లక్షల మందికి ఉపాధి

(మొదటిపేజీ తరువాయి)

విధానాలను స్ట్రీమ్ లైన్ చేస్తూ ప్రభుత్వ ఆదాయం పెంచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. పన్నుల వసూలులో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందని, నిరుద్యోగ సమస్యను 8.8 నుంచి 6.6 తగిందని, నిత్యావసర వస్తువుల ధరల తగ్గుదలలో 1.3 తో దేశంలోనే తెలంగాణ ముందు ఉందన్నారు. ఇది మేం చెప్పేది కాదు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా వెల్లడించిన గణాంకాలుగా వెల్లడించారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించామని, జూన్ రెండో తేదీన లబ్ధిదారుల జాబితా ప్రకటిస్తామన్నారు. ఈ పథకం ద్వారా నియోజకవర్గానికి నాలుగు నుంచి ఐదు వేల మందికి ఉపాధి కల్పించవచ్చన్నారు. తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని, ఇది పార్టీ పథకం కాదు ప్రజల పథకంగా పేర్కొన్నారు.

ఫ్లోరిడాలో రోడ్డు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

కుమార్తెలున్నారు. రెండో కుమార్తె ప్రగతి రెడ్డికి సిద్దిపేటకు సమీపంలోని బక్రి చెప్యాల చెందిన రోహిత్‌రెడ్డితో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రోహిత్‌రెడ్డి తల్లి సునీత కూడా వారితో పాటే అమెరికాలో ఉన్నారు. ప్రగతిరెడ్డి, రోహిత్‌రెడ్డి, ఇద్దరు పిల్లలు, సునీత కారులో వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ప్రగతిరెడ్డి, పెద్దకుమారుడు అర్విన్, సునీత అక్కడికక్కడే మృతిచెందారు. రోహిత్‌రెడ్డి, చిన్నకుమారుడు గాయాలతో బయటపడ్డారు. ఘటన జరిగిన సమయంలో రోహిత్ కారు నడుపుతున్నారు. సమాచారం తెలిసిన వెంటనే ప్రగతిరెడ్డి తల్లిదండ్రులు మోహన్‌రెడ్డి, పవిత్రాదేవి అమెరికాకు బయల్దేరారు. మృతులకు ఫ్లోరిడాలోనే దహన సంస్కారాలు చేస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్‌తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తుల స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రకాల ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

ఇంటి వద్దకే ముత్యాల తలంబ్రాలు

విశాలాంధ్ర - సత్తుపల్లి : ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా భద్రాచలం సీతా రాముల కల్యాణం ముత్యాల తలంబ్రాలు 151 రూపాయలకే ఇంటి వద్దకే అందించబడును అని డిపో మేనేజర్ యూ రాజ్యలక్ష్మి తెలిపారు. డిపో మేనేజర్ కార్యాలయంలో సీతారాములకు కళ్యాణం ముత్యాల తలంబ్రాలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం విడుదల చేసి మొదటి బుకింగ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ భద్రాచలం సీతారాముల కళ్యాణానికి వెళ్లలేని వారి కోసం టిజిఎస్ఆర్‌సి లాజిస్టిక్స్ ద్వారా 151 రూపాయలతో ముత్యాల తలంబ్రాలను అందించనున్నట్లు తెలిపారు. బుకింగ్ చేసిన వారికి రెండు ముత్యాలతో కూడిన తలంబ్రాలు అందించనున్నట్లు తెలిపారు. సత్తుపల్లి ప్రాంతానికి చెందిన రామభక్తులు సత్తుపల్లి డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎస్కే. మునీర్ పాషా 9154298585, విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర. ఆనందరావు 9866619189లను, అశ్వరావుపేట ప్రాంతానికి చెందిన భక్తులు 9154298594, కల్లూరు ప్రాంతానికి చెందిన రామభక్తులు 9494232424, వి ఎం బంజర్ ప్రాంతానికి చెందిన భక్తులు 8688972823, 7382858372, అన్నపురెడ్డిపల్లి ఏరియాకి చెందిన భక్తులు 9701573644 నంబర్లలో సంప్రదించాలని కోరారు. అసిస్టెంట్ మేనేజర్ పి. విజయ శ్రీ, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్. సాహితి, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎస్ కే.మునీర్ పాష ,ఆఫీసు సిబ్బంది బాబురావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా, త్వరితగతిన పరిష్కరించే విధంగా, చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి సందర్భంగా, జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చినప్రజలు, 19 ఫిర్యాదులు సమర్పించారని, వాటిలో ధరణికి సంబంధించిన భూ సమస్యలు, ఇందిరమ్మ ఇండ్లు, ఉద్యోగ ఉపాధి, ఆసరా పెన్షన్లు, ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తులు సమర్పించారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. సోమవారం ఏటూరునాగారం ఐటిడిఏ ఛాంబర్‌లో గిరిజన దర్బార్ నిర్వహించారు. దరఖాస్తులను స్వీకరించిన పిఓ చిత్ర మిశ్రా ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ మండలాల నుండి, వివిధ సమస్యలపై, వచ్చిన గిరిజన దరఖాస్తులను సత్వరమే వాటిని పరిష్కరించాలన్నారు. డిడి వై. పోచం, ఏఓ యం. రాజకుమార్, మేనేజర్ శ్రీనివాస్ గ్రీవెన్స్‌లో పాల్గొన్నారు.

మహిళలను లక్షాధికారులు చేయడమే లక్ష్యం

విశాలాంధ్ర - కారేపల్లి : తెలంగాణ రాష్ట్రంలోని మహిళలను లక్షాధికారులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేసిందని వైరా శాసనసభ్యులు మాలోత్ రామదాసు నాయక్ అన్నారు. మహిళా ఉన్నతి- తెలంగాణ ప్రగతి అనే నినాదంలో భాగంగా ఇందిరా మహిళా పథకం సింగరేణి మండల (సెర్ప్) విజేత మహిళా సమైఖ్యా అందజేసిన రుణంతో వెన్నెల గ్రామ సమైక్య పెద్దమ్మ తల్లి ఎస్ హెచ్ జి గ్రూపు సభ్యురాలు కంచి నాగలక్ష్మికి కేటాయించిన స్త్రీ టీస్టాల్‌ను సోమవారం అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి హాజరైన రాందాసు నాయక్‌కు మహిళలు ఘన స్వాగతం పలికి హారతులు పట్టారు. స్త్రీ టీస్టాల్‌ను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేస్తుందన్నారు. సంక్షేమం అభివృద్ధి రెండు కళ్ళుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ఏపిఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, సీసీలు చైతన్య, పగడాల పుష్ప, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు సుహాసిని, గ్రామ సమైక్య అధ్యక్షురాలు ప్రమీల, వివోఏ పాలిక మమత, మండల కాంగ్రెస్ నాయకులు మేదరి టోనీ, భానోత్ హీరోలాల్, గుగులోత్ భీముడు ధారావత్ వినోద్ నాయక్, ఇమ్మడి తిరుపతిరావు,అడ్డగోడ ఐలయ్య,మల్లెల నాగేశ్వరరావు,తాజుద్దీన్,శ్రీను రెడ్డి,గౌస్ పాషా,తోగర శ్రీను, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ అభిలాష అభినవ్ దరఖాస్తులను స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, డబుల్ బెడ్ రూమ్, రైతు రుణమాఫీ వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఎండలు తీవ్రస్థాయిలో ఉన్నందున, జిల్లాలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించడంలో భాగంగా స్టీల్ నీళ్ళ సీసాల వైపు మళ్లిన అధికారులను కలెక్టర్ అభినందించారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అత్యున్నత స్థానం సాధించేలా విద్యార్థులు కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : సమాజంలో అత్యున్నత స్థానం సాధించడమే లక్ష్యంగా విద్యార్థులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఉదయాదిత్య భవన్లో సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఉంటూ పదవ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ఉద్దేశించి ఏర్పాటుచేసిన ప్రేరణ తరగతులకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు కష్టపడి చదవాలని, ఇందుకు ముందే ఒక లక్ష్యాన్ని ఎంపిక చేసుకోవాలని, ఆ లక్ష్యం సమాజంలో అత్యున్నత స్థానం అయి ఉండాలని, దాన్ని సాధించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని విద్యార్థులను ప్రోత్సహించారు. పదవ తరగతి జీవితంలో అన్నింటికీ పునాది వంటిదని, అందువల్ల రానున్న పదవ తరగతి పరీక్షలను సవాల్‌గా తీసుకొని రాయాలని చెప్పారు. ప్రతి గంట, ప్రతిక్షణాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అనవసరంగా సమయాన్ని వృధా చేసుకోకుండా చదవాలన్నారు. పరీక్షల సమయంలో ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని, అలాగే స్మార్ట్ వర్క్, హార్డ్ వర్క్ రెండింటిని చేయాలని సూచించారు. పరీక్షలను బాగా రాసి 10/10 జీపీఏ సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ ఇంచార్జ్ డిప్యూటీ డైరెక్టర్ కోటేశ్వరరావు, ట్రైనర్లు ఈ ప్రేరణ తరగతుల కార్యక్రమానికి హాజరయ్యారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టొప్పో అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో (రెవెన్యూ) అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారితో కలసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ గ్రామాల తండాల ప్రజలు వారి సమస్యల పరిష్కారం కొరకు 69 దరఖాస్తులు వచ్చారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి, తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. జెడ్పి సీఈఓ పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, సిపిఓ సుబ్బారావు, ఎడి సర్వే ల్యాండ్ నరసింహమూర్తి, జిల్లా సివిల్ సప్లై అధికారి ప్రేమ్ కుమార్, హార్టికల్చర్ అధికారి మరియన్న, గ్రౌండ్ వాటర్ డిడి సురేష్, వెల్ఫేర్ అధికారిని ధనమ్మ, మత్స్య శాఖాధికారి వీరన్న, మైనార్టీ వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్ మోహన్, వివిధ మండలాల డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం సాధించిన ఓసి-5 కార్మికులకు అభినందనలు

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: 2024-25 సంవత్సరానికి గాను ఓసి 5 ఓపన్ కాస్టులో 36 లక్షల టన్నుల వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని 15 రోజుల ముందుగానే సాధించిన కార్మికులను, అధికారులను ఆర్జీ వన్ జిఎం లలిత్ కుమార్ అభినందించారు. సోమవారం గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో జిఎం.మాట్లాడుతూ గత నెల సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం "కార్మిక చైతన్య యాత్ర" ద్వారా ఇచ్చిన స్ఫూర్తితో అందరు కలిసికట్టుగా అంకితభావంతో పనిచేసి జిడికే ఓసి.5 ఉపరితల గనికి నిర్దేశించిన 36 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 36.19 లక్షల టన్నులు (106 శాతం) 15 రోజుల ముందే సాధించటం జరిగిందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ముందు కుడా కలిసి కట్టుగా పనిచేసి ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని కోరారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.చంద్రశేఖర్, సేఫ్టీ అధికారి పొనుగోటి శ్రీనివాస్,ప్రాజెక్టు ఇంజనీర్ రమేష్, సూపర్డెంట్ ఆఫ్ మైన్స్ అనిల్ గబలే, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, డిప్యూటి మేనేజర్ పెరుమాళ్ళ శ్రీనివాస్, గుర్తింపు సంఘం ఏఐటీయుసి, పిట్ సెక్రెటరీ ప్రభుదాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టుతో ఆంధ్ర ప్రాంతం సస్యశ్యామలం

విశాలాంధ్ర - ఇల్లందు : కొత్తగూడెం జిల్లాలోని దుమ్ముగూడెం వద్ద నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు నీళ్లను ఆంధ్ర ప్రాంతానికి తరలించి అక్కడి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని చూస్తున్నారని ఆదివాసి సంక్షేమ పరిషత్ తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఈసాల సురేష్ ఆరోపించారు. పట్టణంలోని స్థానిక గోవింద్ సెంటర్ వద్ద సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణం వలన భద్రాచలం, పినపాక, కొత్తగూడెం, ఇల్లందు నియోజకవర్గ రైతులకు మేలు జరుగుతుందని అందరూ భావించారని తెలిపారు. జిల్లా రైతుల ఆశలను అడిఆశలు చేస్తూ ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు తమాషా చూస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలోని మైదాన ప్రాంతంతో పాటు నల్గొండ జిల్లాలకు నీళ్లు తరలిస్తున్నారన్నారని ఆరోపించారు. ఆ జిల్లాల కింద ఉన్న ఆంధ్ర ప్రాంతం సస్యశ్యామలం కానుందని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు నీళ్లను ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల భూములకు తరలిస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. ఈ సమావేశంలో ఆ సంఘ నాయకులు వాగబోయిన చంద్రయ్య, పూనెం శివరాం, వట్టం నాగేశ్వరరావు, రామచంద్రు, చీమల వెంకటేశ్వర్లు, కోటయ్య తదితరులు ఉన్నారు.

రైతులను కాపాడాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదు

విశాలాంధ్ర - వనపర్తి : పెద్దగూడెం తండాలో గిరిజన రైతు జూలనాయక్ వేసిన 3ఎకరాల వరిపంట కరెంట్ కోతలతో సరియైన నీళ్ళు లేక ఎండిపోయిన పంటను పరిశీలించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి నిత్యం కె.సి.ఆర్‌ని నిందించడం తప్పా రైతులను, ప్రజలను ఆదుకోవాలన్న ధ్యాస, స్పృహ, చిత్తశుద్ధి లేదని అన్నారు. రైతులు సాగునీళ్ళు లేక, కరెంట్ కోతలతో, రైతు బంధు రాక హరిగోసా పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం 3 ఎకరాలకు రైతు బంధు ఇచ్చామని చెప్పడం బూటకమని ఇందుకు నిదర్శనం జులనాయక్ అని, ఈ రాష్ట్రంలో 3ఎకరాల లోపల భూమి ఉన్న రైతులకు కె.సి.ఆర్ రైతు బంధు ఇస్తే 67లక్షల 30వేల ఎకరాల రైతులు లబ్ధి పొందారని అన్నారు. కరెంట్ కోతలతో ఎండిపోయిందని రాష్ట్రవ్యాప్తంగా రైతుల దీనస్థితి ఈ విధంగానే ఉందని ప్రభుత్వం ఎండిన పంటలకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిరంజన్ రెడ్డి వెంట మండల పార్టీ అధ్యక్షులు మాణిక్యం, ధర్మా నాయక్, కృష్ణా నాయక్, చిట్యాల. రాము, చంద్రశేఖర్, నారాయణ్ నాయక్, టీక్య నాయక్, రూప్లా నాయక్ ఉన్నారు.

ఖాళీ బిందాలతో ఐటిడిఏ ముందు నిరసన

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ములుగు జిల్లా వాజేడు మండల గిరిజనులకు, మంచినీరు, విద్యుత్ అందించాలని, సిపియం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. సోమవారం వాజేడు నుండి ఏటూరునాగారం ఐటిడిఏ కార్యాలయం వరకు, మంచి నీళ్లు, విద్యుత్ అందించాలని పాదయాత్రతో వచ్చారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ అక్కడ నివాసం ఉంటున్న గిరిజనులకు, కనీసం త్రాగటానికి మంచి నీళ్లు, విద్యుత్ అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం ఐటిడిఏ పిఓకు విన్నతి అందచేశారు. ఈ సందర్భంగా పిఓ చిత్ర మిశ్రా మాట్లాడుతూ మీ సమస్య ప్రభుత్వం ద్రుష్టికి, జిల్లా కలెక్టర్ ద్రుష్టికి తీసుక వెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాజేడు మండల గిరిజనులు, సిపియం నాయకులు దావుద్, గుగిల్లా దేవయ్య, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంటి చూపు లోపాలను గుర్తించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు, కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులను, ఉద్దేశించి మాట్లాడుతూ పోషకాహార మైన ఆకు కూరలు, గుడ్లు, చేపలు పాలు, పండ్లను ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు మాట్లాడుతూ మొదటి రెండు ఐస్క్రీనింగ్ కార్యక్రమాలను జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల నిర్వహించి 1427 మంది పిల్లలను గుర్తించి, కంటి అద్దాల కొరకు మూడవ స్క్రీనింగ్ నిర్వహించి 1219 మంది జాబితాను ప్రభుత్వానికి అందజేశామన్నారు. ఆర్‌బిఎస్‌కే ప్రోగ్రాంలోని వైద్యాధికారులు, సిబ్బందితో అన్ని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ జరుపుతామని డిఎంహెచ్ఓ గోపాలరావు తెలిపారు. ఆర్బిఎస్కె జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రణధీర్, ములుగు ప్రధాన ఆస్పత్రి కంటి నిపుణులు డా. ప్రవీణ్ రెడ్డి, డెమో సంపత్, డా. శ్రీలత, డాక్టర్ మల్లికార్జున్, పాఠశాలల అధ్యాపకులు, హాస్టల్ వార్డెన్, ఆర్ బిఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాలలో 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్'

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : "ఏక్ భారత్ శ్రేష్ట భారత్" కార్యక్రమంలో భాగంగా, రామన్నగూడెం జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం హర్యానా రాష్ట్రానికి చెందిన హర్యాన్వి భాష, వేశధారణ, ఆహార పదార్థాలు, నృత్య ప్రదర్శనలను పరిచయం చేయడం జరిగింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్యానా వేశాధారణలో మెరిసారు. పాఠశాల హెడ్‌మాస్టర్ కొయ్యాడ మల్లయ్య మాట్లాడుతూ భారతదేశం విభిన్న సంస్కృతుల సమ్మేళనం అని, భిన్నత్వంలో, ఏకత్వమని, అన్ని సంస్కృతులను గౌరవించాలన్నారు. జయలక్ష్మి బాజరి కె కిచిడి, బాజరి కె.లడ్డులను తయారు చేసి ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, సూర్యనారాయణ, కోడి వెంకట్, జయలక్ష్మి, రమాదేవి, రాంబాబు, దేవా, నర్సయ్య, నటరాజ్ పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-పెద్దపల్లి: ప్రజావాణి అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండ పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఎలిగేడు మండలానికి చెందిన ఎం.అంజమ్మ. సుల్తాన్ పూర్ గ్రామ శివారులో తన తండ్రికి 10 గుంటల వ్యవసాయ భూమి ఉందని, తన తండ్రి మరణించినందున ఆ భూమిని ధరణిలో తన పేరుపై చేర్చి పట్టా పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ ఎలిగేడుకు రాస్తూ విచారణ చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముని కుంభాభిషేకానికి మంత్రి తుమ్మలకు ఆహ్వానం

విశాలాంధ్ర- సత్తుపల్లి : మండల పరిధిలోని కిష్టారం గ్రామంలో ప్రతిష్టింపబడిన కోదండరామ స్వామి ఆలయం 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించే షష్టిబ్ది, మహా కుంభాభిషేక మహోత్సవ వేడుకలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆహ్వానించినట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. సోమవారం తుమ్మల నివాసంలో కలిసిన ఆలయ కమిటీ బాధ్యులుఆహ్వాన పత్రికను అందజేసి దేవాలయ మహోత్సవ కార్యక్రమానికి హాజరవ్వాలని కోరారు. తుమ్మలను కలిసిన ఆలయ కమిటీ బాధ్యులు ఉడతనేని అప్పారావు, రావి నాగేశ్వరరావు, నరుకుళ్ళ అప్పారావు, మాజీ సర్పంచి విష్ణువర్ధన్, కొలపనేని ధనుంజయ్ తదితరులు ఉన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

విశాలాంధ్ర - గూడూరు : నెలరోజుల క్రితం బైక్ ప్రమాదంలో తీవ్ర గాయమై వరంగల్ జిల్లాలోని గార్డెన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ప్రాంతాన గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇండ్ల రమేష్ (48) తుదిశ్వాస విడిచారు. రమేష్ కొడుకులు లేనందున మొదటి కూతురు మౌనిక తండ్రికి తలకొరివి పెట్టింది. గూడూరు మండల కేంద్రానికి చెందిన ఇండ్ల రమేష్ గత రెండు నెలల నుండి కొత్తగూడెంలో తాపీమేస్త్రిగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తూ ఉండేవాడు. పనులు నిర్వహించుకుని తిరిగి వస్తున్న క్రమంలో మరిమిట్ట గ్రామపంచాయతీ బంధాల గడ్డ వెళ్లే నేషనల్ హైవే దారిలో గుర్తుతెలియని వాహనం ఢీకొని గాయాల పాలయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంకు తరలించగా పరిస్థితి విషమించగా వరంగల్లోని గార్డెన్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆదివారం తుదిశ్వాస విడిచారు. రమేష్ కుటుంబంలో భార్య సులోచన కూతుర్లు మౌనిక, మానసలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

మిర్చిని తగలబెట్టిన దుండగుల అరెస్ట్ : సీఐ

విశాలాంధ్ర - పినపాక : ఒక రైతు పండించిన ఎండు మిరపకాయలను కళ్ళంలోనే తగులు పెట్టిన దుండగులను పోలీసులు అరెస్టు చేశారు. పినపాక మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన రైతు పొనగంటి పురుషోత్తం పండించిన 50 క్వింటాళ్ల ఎండు మిరపకాయలను ఈనెల 10న పెట్రోల్ పోసి తగుల బెట్టారు. ఈ విషయంపై రైతు పురుషోత్తం బయ్యారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై రాజ్ కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మణుగూరు డీఎస్పి రవీందర్ రెడ్డి ఆదేశాల మేరకు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్సై రాజకుమార్ కేసు దర్యాప్తును ముమ్మరం చేసి సాక్షాధారాలతో నిందితులను పట్టుకున్నారు. స్థానిక సీఐ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం వెంకటరవుపేట గ్రామానికి చెందిన తాండ్ర బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, మంచర్ల వెంకటేశ్వర్లులను నిందితులుగా గుర్తించామన్నారు. వెంకటేశ్వరపురం గ్రామం వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తుల్ని వెంకటేశ్వర్లు మోటార్ సైకిల్‌పై పారిపోతుంటే పట్టుకొన్నామని చెప్పారు. 50 క్వింటాళ్ల మిర్చి కుప్పగా వేసి ఉండగా బాలకృష్ణ తను తెచ్చిన ఐదు లీటర్ల పెట్రోలు పోసి నిప్పంటించినట్లు చెప్పారు. ఆ సమయంలో వెంకటేశ్వర్లు రోడ్డుపై కాపలాగా ఉన్నాడన్నారు. నిందితులు ఇద్దరినీ పట్టుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. కేసును త్వరగా చేదించిన సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై రాజుకుమార్‌లను డి.ఎస్.పి రవీందర్ రెడ్డి అభినందించారు. సిబ్బంది లక్ష్మినారాయణ, దిలీప్, శ్రీనివాస్, రాము, లక్ష్మయ్యలు పాల్గొన్నారు.

ఏజెన్సీ జిల్లాలో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా ఆదివాసీలు గిరిజనులకు న్యాయం జరగటం లేదని నేషనల్ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ విమర్శించారు. జిల్లాలోని మంత్రులతో పాటు, ప్రజా ప్రతినిధులను అధికారులపై కూడా ఆయన తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ఆయన రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం వచ్చారు. తొలుత ఆయనకు గిరిజన సంఘాల ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికి పూలదండలు వేసి సత్కరించారు. గిరిజన సంఘాల నుంచి అనేక ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం చంద్రుగొండ మండలంలోని సీతయి గూడెం గ్రామానికి వెళ్లి ఆదివాసి గిరిజనులు, రైతులను కలిశారు. ఇక్కడ గడచిన వర్షాకాలంలో భారీ వరదలకు అలుగు తెగిన వెంకటరాయ ప్రాజెక్ట్ ను హుస్సేన్ నాయక్ రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం అసరా పేట మండలంలోని భారీ గండికి గురైన పెద్దబాబు ప్రాజెక్టులు కూడా పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిధులన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్ హౌస్ కేంద్రంగా దుర్వినియోగం అయినట్లు విమర్శలు ఉన్నాయన్నారు. జిల్లాలో రెండు ప్రాజెక్టులు తెగిపోయి గిరిజన రైతులు అవస్థలు పడుతుంటే జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు నిద్రపోతున్నారా అనే ప్రశ్నించారు. ఆరేళ్ల నుంచి సీతాగూడెంలోని వెంగళరాయ ప్రాజెక్ట్ కింద 3000 ఎకరాలు పండాల్సిన ఉండగా నీళ్లు అందక రైతులు పంటలు కోల్పోతున్నట్లు తన దృష్టికి తెచ్చారన్నారు. గండి పడిన ఈ రెండు భారీ ప్రాజెక్టులను వెంటనే మరమ్మతు లు చేయాలని లేకుంటే కమిషన్ తరఫున చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సింగరేణి కాంటాక్ట్ కార్మికుల జీతాలు పెంచాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: సింగరేణిలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికుల వేతనాలను పెంచాలని సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. సోమవారం కొత్తగూడెంలోని సిఐటీయు కార్యాలయంలో రాసూరు శంకర్ అధ్యక్షతన సింగరేణి కార్మిక సంఘాల సంయుక్త సమావేశం జరిగింది. కార్మికుల వేతనాల పెంపుదల కోసం కాంటాక్ట్ కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా జేఏసీగా ఏర్పడి కృషి చేయాలని నిర్ణయించాయి. వేతనాల పెంపు, వైద్య సదుపాయం, ఉద్యోగ భద్రత, తదితర డిమాండ్ల సాధన అసెంబ్లీ సమావేశాల్లోపుగా ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీ సహకారంతో సింగరేణి యాజమాన్యాన్ని, ఇందని శాఖ మంత్రి బట్టి విక్రమార్కతోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలిసి పరిష్కారం కోసం కృషి చేయాలని తీర్మానించారు. పరిష్కారం కానట్లయితే మార్చి 25న ప్రజాభవన్‌లో సామూహిక రాయబార కార్యక్రమాన్ని నిర్వహించాలని జేఏసీ నిర్ణయించింది. సిఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. మధు, రాష్ట్ర కమిటీ సభ్యులు భూక్యా రమేష్, టియుసిఐ రాష్ట్ర నాయకులు యాకూబ్ సావలి, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు కందగట్ల సురేందర్, తెలంగాణ జన సమితి కార్మిక సమైక్య రాష్ట్ర కన్వీనర్ మల్లెలరామనాథం, కో కన్వీనర్ వరదబోయన బాబు, ఐఎన్‌టిసి నుండి కే ఆల్బర్ట్, హెచ్ఎంఎస్ నుండి గడిపల్లి కృష్ణ ప్రసాద్, ఐఎఫ్‌టీయు నుంచి నాగేశ్వరావు, ఎన్ సంజవరావు, కాంట్రాక్టు కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు రవి పాల్గొన్నారు.

డ్రగ్స్, సైబర్ నేరాలపై ఎస్ఐ అవగాహన సదస్సు

విశాలాంధ్ర - నేరేడుచర్ల : సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు సోమవారం నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని చిల్లేపల్లి మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల కళాశాలలో సైబర్ నేరాలు, మహిళల భద్రత, షీ టీమ్స్, గంజాయి, డ్రగ్స్ మత్తు మందులపై, రోడ్డు ప్రమాదాలపై పోలీసు కళాబృందంతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం మాట్లాడుతు సైబర్ నేరాలపై, మహిళల భద్రత, గంజాయి డ్రగ్స్ మత్తు మందులు, గుట్కాపై పటిష్టంగా పనిచేస్తున్నామని తెలిపారు. సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దు, బ్యాంక్ ఖాతా, ఏటి ఎం కార్డ్ వివరాలు ఓటిపి వివరాలు ఇతరులకు తెలపవద్దు, ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దు. బెట్టింగ్ యాప్ లకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు ఫిర్యాదు చేయాలని అన్నారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నెంబర్లు, సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దన్నారు. గంజాయి మత్తుమందులకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే తప్పకుండా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే కళాశాల ప్రిన్సిపల్ అనుకరణ,కళాబృందం ఇంచార్జ్ యల్లయ్య, గోపయ్య, చారి, గురులింగం, నాగార్జున విద్యార్థినిలు, పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర - గార్ల: గిరిజన ఆశ్రమ పాఠశాల వసతిగృహాల్లో రోజు వారిగా వంట చేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించాలని సీఐటీయూ గార్ల మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన వసతి గృహాల్లో రోజువారీ కార్మికుల సమస్యలు పరిష్కరించి, వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. ఆశ్రమ పాఠశాల ఎదురుగా సోమవారం సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఎంతో శ్రమిస్తు విద్యార్థులకు వంట చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు జి.వో 64 జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పని చేసే ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మె చేపట్టినట్లు తెలిపారు. ఈ సమ్మెకు సిపిఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి సంఘీభావం తెలిపారు. ఈ సమ్మెలో గార్ల, బయ్యారం మండలాలకు చెందిన కార్మికులు బి.వీరన్న, ఈ.సత్యం, కె.నరసింహారావు, బాబురావు, సీతారాములు, వెంకన్న, శోభారాణి, లక్ష్మి, సూరమ్మ, తిరుపతమ్మ, శేఖర్, నవీన్, రమణ, పార్వతీ, ఝాన్సీ, తార తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

మోదీతో ఫ్రీడ్‌మాన్ లాలూచీ కుస్తీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పత్రికల వారితో మాట్లాడరు. ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేయరు. గత పదకొండేళ్ల కాలంలో ఒకే ఒక్క పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన కనిపించారు. అది 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు. అప్పుడు ఆయన పక్కన అమిత్ షా కూడా ఉన్నారు. మోదీ ఒక్క ప్రశ్నకైనా సమాధానం చెప్పలేదు. అన్ని ప్రశ్నలకు అమిత్ షానే జవాబు చెప్పారు. ఇటీవల అమెరికా వెళ్లినప్పుడు ట్రంప్‌తో కలిసి మోదీ విలేకరుల సమావేశంలో పాల్గొనాల్సి వచ్చింది. విలేకరులు అదానీకి సంబంధించి ప్రశ్న అడిగితే మోదీ ఎంత ఆగ్రహోదగ్రులయ్యారో ఆయన హావభావాలు చూస్తే అర్థం అవుతుంది. ఇలాంటి వ్యక్తిగత విషయాలు విలేకరుల సమావేశంలో మాట్లాడరు అని చేతులు కోపంగా తిప్పుతూ సమాధానం దాట వేశారు. అయితే మోదీ విడివిడిగా తనకు నచ్చిన పత్రికా రచయితలతో ముచ్చటిస్తుంటారు. అలాంటి సంభాషణలు ఒకరిద్దరు పత్రికా రచయితలకే పరిమితం అవుతాయి. కొన్ని సందర్భాలలో ఆయన "పాడ్ కాస్టుల్లో" పాల్గొనడం కనిపిస్తుంది. అమెరికాకు చెందిన కృత్రిమ మేధ పరిశోధకుడు ఫ్రీడ్ మాన్ నిర్వహించిన పాడ్ కాస్ట్‌లో మోదీ పాల్గొన్నారు. ఇది దాదాపు మూడు గంటల పాటు జరిగింది. ఇందులో మోదీ తన వ్యక్తిగత జీవితం నుంచి మొదలుకుని అంతర్జాతీయ రాజకీయాల దాకా అనేక ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. కృత్రిమ మేధ ఆధారంగా మునుపటి ట్విట్టర్ అయిన ఎక్స్‌లో గ్రోక్‌లో ఈ పాడ్ కాస్ట్ ప్రసారమైంది. బహుళ ప్రచారంలోకి కూడా వచ్చింది. ప్రధానమంత్రి మోదీ ప్రచారానికి దూరంగా ఉంటారని కాదు కానీ ఆయన తనదైన శైలిలో తన గురించి ప్రచారం చేసుకుంటారు. ఆయన గురించి ప్రచారం చేయడానికి పెద్ద సైన్యమే ఉంది. ఈ ఇంటర్వ్యూ చేయడానికి ముందు 45 గంటల పాటు తాను వ్రతం పూనానని, భోజనం కూడా చేయలేదని, కేవలం మంచి నీళ్ల మాత్రమే తాగానని ఈ పాడ్ కాస్ట్ నిర్వహించిన ఫ్రీడ్ మాన్ చెప్పారు. ఇంటర్వ్యూ ఇవ్వడం అంటే పూజ చేయడం అని ఆయన ఉద్దేశం కాబోలు. ఇంటర్వ్యూ చేయడానికి ముందు ఫ్రీడ్‌మాన్ సంపూర్ణంగా సంసిద్ధం కావాల్సింది. లోతైన పరిశోధన చేయాల్సింది. కాని నిరశన వ్రతం చేశారట. ఫ్రీడ్‌మాన్ ఈ మాటలు చెప్పడాన్నిబట్టి చూస్తే మోదీ గతంలో ఇచ్చిన ఇంటర్వ్యూలలాగే ఇదీ లాలూచీ కుస్తీ అని అర్థం అవుతోంది. ఈ పాడ్ కాస్ట్ మూడు గంటలపాటు ఓపిక చేసుకుని చూస్తే ఇది ఎంతటి లాలూచీ కుస్తీనో అర్థం అవుతుంది. సాధారణంగా పత్రికా విలేకరులు ఇంటర్వ్యూ చేసేటప్పుడు కూడా గుచ్చి గుచ్చి ప్రశ్నలు అడుగుతారు తప్ప తాము ఎవరినైతే ఇంటర్వ్యూ చేస్తున్నారో వారికి మోకరిల్లరు. నిజానికి ఫ్రీడ్ మాన్ చేసిన సుదీర్ఘ ఇంటర్వ్యూలో పస ఉండాలని అనుకుని ఉంటే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనకు అత్యంత సన్నిహిత మిత్రుడు అని చెప్పుకుంటున్న మోదీని ఆ విషయం అడగాల్సింది. ట్రంప్ ప్రమాణ స్వీకారానికి మోదీని మాత్రం ట్రంప్ ఆహ్వానించలేదు. అనేక చిన్న దేశాల అధిపతులను కూడా ఆహ్వానించారు. తన సన్నిహిత మిత్రుడిని మాత్రం ఆహ్వానించలేదు. జోర్డాన్ రాజు, ఫ్రాన్స్ అధ్యక్షుడు, జపాన్ ప్రధానమంత్రి, ఇజ్రాయిల్ ప్రధాని, బ్రిటన్ ప్రధానమంత్రి వైట్ హౌజ్‌కు వెళ్లి కలిసినప్పుడు ట్రంప్ వైట్ హౌజ్ గుమ్మం దగ్గరికి వచ్చి వారిని సాదరంగా ఆహ్వానించారు. కానీ మోదీ వెళ్లినప్పుడు ట్రంప్ ఇలా ఎదురేగి ఆహ్వానించలేదు. మోదీని లోపలికి తీసుకెళ్లడానికి ట్రంప్ తన సహాయకురాలిని పంపించారు. ఫ్రీడ్‌మాన్ ఈ విషయంపై మోదీని ప్రశ్నించనే లేదు. తన స్నేహితుడు మోదీకి 29 మిలియన్ డాలర్లు ఇచ్చామని ట్రంప్ చెప్తున్నారు. ఈ విషయం నిజమో కాదో తెలుసుకోవడానికి ఫ్రీడ్ మాన్ ప్రయత్నించలేదు. ఈ విషయంలో ట్రంప్ పచ్చి అబద్ధం చెప్పారు. కానీ అబద్ధాన్ని బట్టబయలు చేయాలని ఫ్రీడ్‌మాన్‌కు తట్టనే లేదు. మోదీకి ట్రంప్ 29 మిలియన్ డాలర్లు ఇచ్చారన్నది పచ్చి అబద్ధం. ట్రంప్ రెండో సారి అమెరికా అధ్యక్షుడైనప్పటి నుంచి భారత్‌ను తృణీకరించే మాటలు చెప్పింది చెప్పకుండా చెప్తున్నారు. దీని మీదా మోదీని ప్రశ్న అడగొచ్చునని ఫ్రీడ్‌మాన్‌కు తట్టలేదు.

మోదీ చిన్ననాటి సంగతులు కూడా ఈ పాడ్ కాస్ట్ లో ప్రస్తావనకు వచ్చాయి. "మీ చిన్నతనంలో మీ కుటుంబం సంపన్నమైంది కాదు. మీ కుటుంబం ఒక గది మాత్రమే ఉన్న ఇంట్లో ఉండేదటగా!" అని ఫ్రీడ్ మాన్ మోదీ కార్యాలయం ఇచ్చిన ప్రశ్నావళిని చూసి చదువుతున్నట్టు అడిగేశారు. ప్రశ్నలు మోదీ తయారు చేయించి ఇచ్చినవే, జవాబులూ ఆయనవే కనక మోదీ కట్టుకథలన్నీ ఈ ఇంటర్వ్యూలో దర్శనమిస్తాయి. "మా నాన్న తెల్లవారు ఝాముననే ఇంట్లోంచి బయలుదేరేవారు. ఆయన వేసుకునే జోళ్లు బాగా శబ్దం చేసేవని, వాటి శబ్దం విని జనం తమ గడియారాలలో టైం సరి చేసుకునే వారు అని మోదీ ఆనందంగా చెప్పారు. ఇలాంటి సమాధానాల మీద నవ్వాలో ఏడవాలో తెలియదు. ఈ పాడ్ కాస్ట్ లో చూపించిన మోదీ చిన్ననాటి ఫొటోలు ఏవీ ఆయన పేద కుటుంబం నుంచి వచ్చినట్టు నమ్మడానికి అనువుగా లేవు. ఇలాంటి ప్రశ్నలు, జవాబులవల్ల మోదీ భక్తులు తన్మయులు అయిపోవచ్చు. కానీ నమ్మడం కష్టమే. తాను దుఃఖం భరించలేనని, తప్పు చేస్తే ఒప్పుకుంటానని మోదీ చెప్పారు. పెద్దనోట్లు రద్దు చేసినప్పుడు మోదీకి దుఃఖం ఎందుకు కలగలేదో! మణిపూర్ మారణ కాండ మోదీ హయాంలోనే జరిగింది. దానిని ఆయన ఎందుకు అంగీకరించరు? కృత్రిమ మేధ మీద ఆధారపడ్డ సదుపాయాలు ఇప్పుడు చాలానే అందుబాటులోకి వచ్చాయి. గ్రోక్ మాత్రం ఎలాన్ మస్క్ కంపెనీ కల్పించిన సదుపాయం. అది విచిత్రమైంది. అది మోదీని మహా మనీషిగా చిత్రించడానికే తయారు చేసినట్టుంది. గ్రోక్ కృత్రిమ మేధ ఆధారంగా సమాధానాలు ఇస్తుంది. ఇందులో అందరికన్నా ఎక్కువ అనుయాయులు ఎవరికి ఉన్నారు అని గ్రోక్ ను అడిగితే మోదీకే అని సమాధానం వచ్చింది. అందరికన్నా మతతత్వ వాది నాయకుడు ఎవరు అని ప్రశ్నించినా గ్రోక్ మళ్లీ మోదీ పేరే చెప్పింది. ఎక్కువ అబద్ధాలు ఎవరు చెప్తారు అని అడిగితే గ్రోక్ మళ్లీ మోదీనే అగ్రభాగాన నిలబెట్టింది. ఇలాంటి సత్యాలు చెప్పడానికి సాధారణ జనానికి బెరుకు ఉండొచ్చు కానీ గ్రోక్‌కు అభయమే లేదు. స్వాతంత్ర్య పోరాటంలో తమకూ పాత్ర ఉందని నమ్మించడానికి ఆర్.ఎస్.ఎస్. గత 15 ఏళ్ల నుంచి నానా పాట్లూ పడ్తోంది. గ్రోక్ దీనిబండారం కూడా విప్పింది. ఆర్.ఎస్.ఎస్.కు స్వాతంత్ర్యోద్యమంతో బొత్తిగా సంబంధం లేదని గ్రోక్ తేల్చేసింది. అలాంటప్పుడు ఫ్రీడ్‌మాన్ ది లాలూచీ కుస్తీనే అవుతుందిగా!

ఆపరేషన్ కగార్ లోగుట్టు...!

డాక్టర్ సి.ఎన్. క్షేత్రపాల్ రెడ్డి

ఆదివాసీలు దేశ మూలవాసులు. అనాదిగా అటవీ ప్రాంతాన్నే నమ్ముకుని జీవనం సాగిసున్నారు. ఆదివాసీల జీవన విధానం ఎంతో వైవిధ్యంగా ఉంటుంది. వారి జీవనోపాధికి అడవులే ఏకైక మార్గం. పర్యావరణానికి నష్టం కలిగించని పోడు వ్యవసాయం వారికి ఆహారాన్ని కూర్చి పెడుతున్నది. జీవవైవిధ్యం వారి జీవనశైలిలో మిళితమై ఉంటున్నది. అయితే గత కొన్ని దశాబ్దాలుగా వారి జీవితాలు తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. ఇప్పుడు అడవుల ఉనికి సంక్షోభంలో పడింది. దేశ వ్యాప్తంగా వివిధ కారణాలతో ఆదివాసీలపై అణచివేత కొనసాగుతున్నది. కశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ను రద్దు చేయడం, మణిపూర్‌లో జాతుల మధ్య ఘర్షణలకు ఆజ్యం పోయడం, మావోయిస్టుల ఏరివేత కోసం అంటూ ఇప్పుడు కేంద్రం ఆపరేషన్ కగార్ అని పిలుపుతో అక్కడి ప్రజలకు జీవనాధారమైన అడవుల నుంచి వారిని తరిమేస్తున్నారు. అక్కడ నిక్షిప్తమైన సకల సంపదల్ని కార్పొరేట్లకు దోచిపెట్టడమే కగార్ పరమార్థం. 2000వ దశకం నుంచి మధ్య భారతంలోని వివిధ రాష్ట్రాల్లో అడవులపై అక్కడ నిక్షిప్తమైన వివిధ రకాలైన సంపదలపై కార్పొరేట్ శక్తుల కన్ను పడింది. అప్పటికే దేశంలో పాలకులు ప్రవేశ పెట్టిన ప్రైవేటీకరణ విధానాల రూపంలో వారికి ఆ సంపదల్ని సులభంగా కొల్లగొట్టే అవకాశాలు ఏర్పడ్డాయి. ఇదే అదనుగా ఆదివాసీలకు రక్షణగా నిలుస్తున్న అనేక చట్టాలను ప్రభుత్వం అపహాస్యం చేస్తూ ఆదివాసీల హక్కుల హననం ప్రారంభమైంది. పంచాయతీ చట్టం -1996 (పట్టణ ప్రాంతాలకు పొడిగింపు), అటవీ హక్కుల చట్టం (2006) వంటి రక్షణాత్మక చట్టాలు, షెడ్యూల్డ్ ఏరియాల్లో అభివృద్ధి ప్రాజెక్టులకు ముందుగానే ఆదివాసీల అంగీకారాన్ని పొందేలా రూపొందిన వివిధ చట్టాలు క్రమంగా నీరుగారిపోయాయి.

ఇది చాలదన్నట్టు ఇప్పుడు మోదీ ప్రభుత్వం తలపెట్టిన ఆపరేషన్ కగార్ దండకారణ్యంలో నెత్తుటేర్లు పారిస్తోంది. మావోయిస్టుల ఏరివేత అంటూ ప్రారంభించిన ఈ ఆపరేషన్ కగార్ వెనుక అటవీ సంపదల్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడమే ప్రధాన లక్ష్యంగా ఉన్నది. కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లోకి చేరిన కేంద్ర ప్రభుత్వాలు వారి అడుగులకు మడుగులొత్తే క్రమంలో 2005 లోనే సల్వాజుడం, 2009 లో ఆపరేషన్ గ్రీన్ హంట్ చేపట్టాయి. దానికి కొనసాగింపుగానే ఇప్పుడు ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంలో బహుళ జాతి కార్పొరేట్ కంపెనీల రాజ్యం ఏర్పాటుకు రంగం సిద్ధం అవుతున్నట్టు తెలుస్తోంది. చత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిశాల్లో విస్తరించిన దండకారణ్యంలో వజ్రాలు, ఇనుము, సున్నపురాయి, బాక్సైట్, డోలమైట్ సహా 28 రకాల విలువైన ఖనిజాలున్నాయి. ఇండియన్ మినరల్స్ ఇయర్ బుక్ -2021 అందించిన వివరాల మేరకు దేశంలోని మొత్తం తగరం నిల్వల్లో ఇక్కడే సుమారు 36 శాతం ఉన్నది. 20 శాతం ఇనుము, 20 శాతం బాక్సైట్, 18 శాతం బొగ్గు, 11 శాతం డోలమైట్, 4 శాతం వజ్రాలు, 4 శాతం సున్నపు రాయి ఉన్నట్టు తేలింది. ఈ ఖనిజ సంపదల్ని మొత్తం తవ్వుకునేందుకు కార్పొరేట్ శక్తులు చాలా కాలం నుంచి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. కార్పొరేట్ శక్తులకు లాభం చేయాలని పరితపిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ సంపదల తరలింపునకు అక్కడి ప్రజలు అడ్డం తగులు తున్నందున మావోయిస్టుల అంతం పేరుతో ఆపరేషన్ కగార్ ప్రారంభించారనే వాదన ఉంది.

> **అభివృద్ధి పేరిట అడవుల విధ్వంసం జరుగుతున్నది. అందులో పర్యావరణానికి జరుగుతున్న హాని అత్యంత తీవ్రమైంది. అటవీ సంపదలు క్రమంగా కార్పొరేట్ శక్తుల పరం అవుతుండడంతో అడవులు హరించుకుపోతున్నాయి. ఆదివాసీల ఆవాసాలు కనుమరుగయ్యే స్థితి ఏర్పడింది. అటవీ ఉత్పత్తులు, పోడు వ్యవసాయం ద్వారా జీవనం సాగించే ఆదివాసీల జీవితాలు అభివృద్ధి ముసుగులో బుగ్గి అవుతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దండకారణ్యంలో చేస్తున్న అభివృద్ధి పని ఏదయినా ఉన్నదంటే అది రోడ్లు వేయడం తప్ప మరొకటి కనిపించదు.**

అభివృద్ధి పేరిట అడవుల విధ్వంసం జరుగు తున్నది. అందులో పర్యావరణానికి జరుగుతున్న హాని అత్యంత తీవ్రమైంది. అటవీ సంపదలు క్రమంగా కార్పొరేట్ శక్తుల పరం అవుతుండడంతో అడవులు హరించుకుపోతున్నాయి. ఆదివాసీల ఆవాసాలు కనుమరుగయ్యే స్థితి ఏర్పడింది. అటవీ ఉత్పత్తులు, పోడు వ్యవసాయం ద్వారా జీవనం సాగించే ఆదివాసీల జీవితాలు అభివృద్ధి ముసుగులో బుగ్గి అవుతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దండకారణ్యంలో చేస్తున్న అభివృద్ధి పని ఏదయినా ఉన్నదంటే అది రోడ్లు వేయడం తప్ప మరొకటి కనిపించదు. పాఠశాలల నిర్మాణం, ఆరోగ్య కేంద్రాలు, అడవి బిడ్డలకు నివాసాలు ఇతర కనీస వసతుల ఏర్పాటు వంటివి అస్సలు ప్రభుత్వాల దృష్టిలోనే లేవు. ఆదివాసీల ఆర్థిక, సామాజిక వెనుకబాటును రూపుమాపే ఏ చర్యలు తీసుకోవడం లేదు. ఆకలి తీర్చడం, కనీస అక్షరాస్యత, పోషకాహార లోపానికి సంబంధించిన అనేక తీవ్రమైన సమస్యలు ఉన్నా అవేవీ పాలకులకు పట్టడం లేదు. కానీ జన సంచారం పెద్దగా లేని మారు మూల ప్రాంతాలకు కూడా ఆరు లైన్ల రహదారులు వేస్తుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. ఆ రోడ్లపై సాధారణ వాహనాల రాకపోకలు అస్సలు కనిపించవు. ఆ రోడ్లకు దగ్గరిగా జీవించే ప్రజలకు కనీసం చెప్పులు కూడా వేసుకునే స్తోమత ఉండడం లేదు. సైకిలును వినియోగించే వారు కూడా కనిపించరు. అంటే ఇంత పెద్ద ఎత్తున రోడ్లు వేయడం, దీన్ని అభివృద్ధి కార్యక్రమం కింద చూపడం వెనుక పర్యావరణ విధ్వంసంతో పాటు అటవీ సంపదను సులభంగా తరలించుకుపోవడమనే అజెండా ఉన్నదని సులభంగానే అర్థమవుతున్నది.

ఇదే తరుణంలో దండకారణ్యంలో వందల కొద్ది పోలీసు క్యాంపులు ఏర్పాటవడంతో ఆదివాసుల్లో భయోత్పాతం ఏర్పడింది. పారామిలటరీ దళాలు, కేంద్ర రిజర్వ్ పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్), జిల్లా రిజర్వ్ గార్డులు (డీఆర్‌జీ), సీఆర్‌పీఎఫ్‌కి చెందిన కోబ్రా (సీఓబీఆర్ఏ) వంటి వివిధ దళాలు అడవిలో తిష్ట వేసి ఆదివాసీలకు భారత రాజ్యాంగం కల్పించిన రక్షణను దూరం చేస్తున్నాయి. ఆదివాసీ ప్రాంతాల్లో నిర్మాణమవుతున్న పోలీసు క్యాంపులు అక్కడి ప్రజల్లో విశ్వాసాన్ని నింపడం లేదు. తమను విముక్తి చేయడం అటుంచితే ఉన్న ఉపాధిని దూరం చేస్తున్నాయని ఆదివాసులు ఆందోళన చెందుతున్నారు. భద్రతను ఇస్తామంటున్న క్యాంపులే అక్కడి జన జీవనంలో అభద్రతకు కారణమవుతున్నాయి. సామాన్యులను విచారణ పేరిట, ఇన్ఫార్మర్లు పేరిట ఎన్‌కౌంటర్లు చేయడం, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. దండకారణ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ పేర్లతో పిలిచే 12 లక్షల మంది సాయుధ బలగాలను కేటాయించినట్టు తెలుస్తోంది. దండకారణ్యంలో ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక పోలీసు క్యాంపు ఏర్పాటైనట్టు తెలుస్తోంది. ప్రతి తొమ్మిది మంది ఆదివాసులకు ఒక సైనికుడు నిష్పత్తిలో ఆ మోహరింపు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ చర్యలు ఆదివాసుల దైనందిన జీవితాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఆదివాసీలు నిరంతరం పోలీసుల నిఘాలో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అడవిలోకి వెళ్లడానికి, జీవనోపాధికి విఘాతంగా మారుతోందని అక్కడి పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా సాగుతున్న ఆదివాసుల నిరసన దీక్షలను గమనిస్తే అర్థమవుతుంది. పోలీసు క్యాంపుల కోసం, రోడ్ల నిర్మాణం కోసం తమ పంట పొలాలు పోగొట్టుకున్న ఆదివాసీలు ఉన్నారంటే అక్కడి పరిస్థితిని అంచనా వేయవచ్చు. తమకు అన్యాయం జరుగుతోందని, చట్టాలు నిర్వీర్యం అవుతున్నాయని న్యాయస్థానాలను ఆశ్రయించినా ఎదురు దెబ్బలు తప్పడం లేదు. మావోయిస్టుల బూచిని చూపి ఆదివాసులు తిరుగుబాట్లను అణచివేయడం షరా మామూలైంది. పాలకులు తమ లోపాలను కప్పిపుచ్చుకోవడం కోసం, బాధ్యత నుంచి తప్పించుకోవడానికి బాధితులనే మావోయిస్టులంటూ ముద్ర వేసే స్థితి ఏర్పడింది.

సెల్: 9059837847

(ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర సమితి మంగళవారం విశాఖపట్నంలో సదస్సు నిర్వహిస్తున్న సందర్భంగా)

కొలువులు

రంగస్థలం

కుడివైపు నుంచి వచ్చి డాగీ, ఎడంవైపు నుంచి వచ్చి డాంకీ అరుగు ఎక్కడానికి రడీ అయిపోయి ముఖాలు చూసుకున్నాయి.'వాటె కో ఇన్సిడెన్స్' అంది డాంకీ. అవును ఇలాగ ఎప్పుడూ జరగలేదు అంది డాగీ. 'పహలే ఆప్' అంది డాంకీ. పెద్దలకు మర్యాద ఇవ్వడం మనుషులు పూర్తిగా మరిచిపోయినట్టున్నారు కానీ మేం ఇంకా పొలైట్‌గా, ఫెయిత్ ఫుల్‌గానే బతుకు జట్కాబండిని లాగుతున్నాం అంది డాగీ.

డాంకీ దాని వెనుక డాగీ మెట్లెక్కిన తర్వాత వాళ్లకు మరో సర్‌ప్రైజ్ ఎదురొచ్చి 'వాటెసర్‌ప్రైజ్!' అనిపించింది. ఎప్పుడొచ్చాడో తెలుగు అబ్బాయి అరుగు మీద ఓ మూల కూచుని ఉన్నాడు దీనంగా, దిక్కులేని దివాణంలా. వాటె సర్‌ప్రైజ్! మా కంటే ముందు నువ్వు వచ్చి ఇలా కూచుని ఉండడం మేం ఎప్పుడూ చూసిందే లేదు అన్నాయి ఫోర్‌లెగ్‌డ్ ఎనిమల్స్ డ్యుయట్ డైలాగ్ లాగుతూ.

మనసేం బాగులేదు ఫ్రెండ్స్. ఊళ్లో రోడ్లన్నీ తిరిగి తిరిగి, ఓపిక నశించి ఇదిగో ఇట్లా వచ్చిపడ్డా అన్నాడు అబ్బాయి. మనసు బాలేకపోతే మందు కొడ్తారు కదా మనుషులు. అందుకే కదా సర్కారోళ్లు మనుషుల మనసులు బాగాలేకుండా చేసి, మందు బాబులుగా మార్చి ఆఫైన మందు ధరల పాత లేబిళ్లు చింపేసి, కొత్తవి అంటించేసి పరిపాలన యమ ఘనంగా సాగించేస్తున్నారు అంది డాగీ. పరిపాలన సాగించడం అంటే ఏముందిలే సంక్షేమ పథకాలు అమలు చేయడం అంటే ఏముందిలే మళ్లీ వచ్చే ఎన్నికలకు మనుషుల్ని, వాళ్ల ఓట్లని ముందస్తుగానే కొనేసి ఎఫ్.డి. ఖాతాలో వేసేసుకోవడం అంతే ఇంకేం లేదు అంతే అన్నమాట అంది డాంకీ. మందు రేట్లు పెంచేయడం, పన్నుల్ని రాకెట్లు చేసెయ్యడం, కనపడ్డ జాగానల్లా అమ్మేసుకోవడం, అయినకాడికి అప్పులు చేసేసుకోవడం ఇవన్నీ సొమ్ము భద్రం-భవిత బంగారం కోసమే కద. మరో ఐదేళ్లు మేమే అంటే మరో ముప్ఫయ్యేళ్లు మేమే అని జబ్బలు చరచుకోవడమే కద అంది డాగీ.

ఏ సంక్షేమ పథకంలో ఏ బంగారు పుట్ట ఉందో, ఏ పార్టీ నెత్తిన ప్రజలు పాలు గుమ్మరిస్తారో నా కనవసరం నా కవసరం ఉద్యోగం మాత్రమే అది వచ్చే అవకాశం లేదనే ఏడుపు మాత్రమే నా వంతయింది అన్నాడు అబ్బాయి ఏడుపు గొంతుకతో. అదా విషయం ఉద్యోగాల కోసం రాసిన పరీక్షల్లో తలరాత మార్చే రిజల్టు రాలేదన్న మాట అందుకే మనసు బాగోలేదన్న మాట నిజంగా ఇది నువ్వు మందు కొట్టి కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్ అని పాడాల్సిన తరుణం అన్నది డాంకీ.

జనరేషన్ గ్యాప్. ఇప్పుడా పాటలు అవుట్ డేటెడ్ అయినవి. అయిటం సాంగులూ, డ్యూయట్లూ, ఫైట్లూ తప్ప ఆ ఏడుపూ లేదు ఆ పాటలూ లేవు, వదిలెయ్యి. 'బ్రో' బాగా చదివాననే అన్నావు కదా మరి ఫలితం ఎందుకు దక్కలేదు తెలుగు మీడియం వాడివా కొంపదీసి అంది డాగీ. ప్రతివాడూ మాతృభాష మదర్ టంగ్ అని యాగీ చేస్తాడు కానీ రెండొందల ఏళ్ల సంబంధ అనుబంధం ఆంగ్ల భాషను కాదనగలడా. ఒక ప్రాంతపు భాష మరొక ప్రాంతం వాడికి గిట్టదు కానీ ఆంగ్లమే కదా ఆత్మబంధువు అందరికీ అంది డాంకీ.

ఏం జరిగిందో మరి ఫలితాల్లో ఏదో తేడా కొడ్తున్నదని, తెలుగు మీడియం వాళ్లకు అన్యాయం జరిగిందని అంటున్నారు అన్నాడబ్బాయి ముక్కు చీదేస్తూ. ఇలాంటివి మామూలే 'బ్రో' మరొక్కసారి ప్రయత్నించు ఇది వరకు ఎన్నడూ లేని విధంగా అనేకంగా కొలువులు వస్తున్నాయంటున్నారు అంది డాగీ. అనేకం కొలువులు మనుషులు చాలకపోతే మనకూ ఇస్తారులే అంది డాంకీ నోటి పళ్లు బయటపెట్టి. ఏమిటీ కుక్కలకూ, గాడిదలకూ కూడా కొలువులే. ఏ డిగ్రీలూ చదవని మనమేం ఉద్యోగాలు చేయగలం అంది డాగీ తోక చక్రంలా తిప్పుతూ. ఏం ఎందుకు చెయ్యలేరు, డిగ్రీలు చదవని వారంతా ప్రజా ప్రతినిధులు కావడంలా, మంత్రులు కావడంలా, డిగ్రీలు ఉన్న వాళ్ల నెత్తిన ఎక్కి తీన్‌మార్ డాన్సులు చేయడంలా అన్నాడు అక్కసుగా అబ్బాయి. మనమేం ఉద్యోగాలు చేయగలం అనకు డాగీ ప్రతిపక్షాల వారిని కరవడానికి డాగ్స్‌నీ, విపక్షాలను వెనక కాళ్లతో తన్నడానికి డాంకీస్‌నీ వాడుకోవచ్చు కదా అంది డాంకీ.

అలాగైతే ఎక్కువ డాగ్స్‌కీ డాంకీస్‌కీ అవకాశంరాదు. చట్ట సభల్లో ఒకళ్ల మీద ఒకళ్లు అరుచుకోవడానికి బూతులు బట్వాడా చేసుకో వడానికి సభ్యులకు శక్తి చాలడం లేదు. కోపం, కసీ, ఉక్రోషం, అసూయ, ద్వేషం ఇవన్నీ కలవడంతో బూతులు తప్ప మాటలు దొరకడంలేదు. అవతలి వాడ్ని అవమానించడం, బెదిరించడం భయపెట్టడం తప్ప వాళ్లకి మరో అజెండా లేదు అన్నాడు అబ్బాయి.

అలాగయితే సభ్యులు అనవసరంగా హైరానా పడకుండా ఒక్కొక్కరికీ ఒక్కో కుక్కని 'పీఏ' గా అపాయింటు చేస్తే సరి. వాళ్ల నోరు నొవ్వకుండా మేం మొరిగిపెడతాం కదా అంది డాగీ.

రోజురోజుకీ వివాదాలు, సింహనాదాలు పెడబొబ్బలు ముదిరి చేతల్లోకి దిగే రోజులు కూడా వచ్చేట్టున్నాయి. అప్పటికి మమ్మల్ని అపాయింటు చేసి వాళ్ల చొక్కాలు ఖరాబు కాకుండా మా వెనక కాళ్లు వాడుకోవచ్చు గదా అంది డాంకీ.

ఎమర్జెన్సీ: సీపీఐ మింగిన గరళం

ఆర్వీ రామారావ్

మరో మూడు నెలలు గడిస్తే దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తవుతాయి. దేశంలో క్రమశిక్షణ తప్పిందని, అందుకే ఎమర్జెన్సీ విధిస్తున్నామని అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ సమర్థించుకున్నారు. అవినీతికి వ్యతిరేకంగా గుజరాత్‌లో విద్యార్థులు భారీ ఎత్తున ఉద్యమించారు. ఈ ఉద్యమం వెనక ఆర్.ఎస్.ఎస్. హస్తం ఉంది. ఆ ఉద్యమంలో ప్రధాన పాత్రధారి ఆరెస్సెస్సే. ఈ ఉద్యమానికి లోకనాయక్ జై ప్రకాశ్ నారాయణ మద్దతిచ్చారు. దానితో అవినీతి వ్యతిరేక ఉద్యమం దక్షిణాదిలో మినహా మిగతా ప్రాంతాలలో విస్తృతమైంది. అల్లకల్లోల పరిస్థితి ఏర్పడింది. దానికి తోడు ఎన్నికలలో ఇందిరా గాంధీ అక్రమాలకు పాల్పడ్డారని అలహాబాద్ హైకోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పును శిరసావహించడం ఇందిరా గాంధీకి ఇష్టం లేదు. ఎమర్జెన్సీ విధించడానికి ఇదీ ఒక కారణమైంది. 1975 జూన్ 25వ తేదీ రాత్రి ఇందిరాగాంధీ రేడియో ద్వారా జాతి జనులను ఉద్దేశించి ప్రసంగిస్తూ "రాష్ట్రపతి ఎమర్జెన్సీ విధించారు. కానీ భయపడవలసిన పనేం లేదు అన్నారు." అయితే అదే రోజు అర్ధరాత్రి దేశంలోని అనేకమంది ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేసి జైళ్లల్లో తోశారు. ప్రాథమిక హక్కులన్నీ రద్దు అయినాయి. న్యాయవ్యవస్థపై కేంద్ర ప్రభుత్వ పట్టు బిగిసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నియామకంలో అంతకు ముందున్న సంప్రదాయాలను ఇందిరా గాంధీ తుంగలో తొక్కారు. ఎమర్జెన్సీ సందర్భంగా తీసుకొచ్చిన 42వ రాజ్యాంగ సవరణ వివాదాస్పదమైంది. సరిగ్గా అదే సమయంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఇందిరా గాంధీ వేపు మొగ్గింది. ఎమర్జెన్సీని సమర్థించింది.

శివసేన వ్యవస్థాపకుడు, కాంగ్రెస్‌కు బద్ధ విరోధి బాల్ థాక్రే, ప్రసిద్ధ సంపాదకుడు కుష్వంత్ సింగ్, మచ్చలేని గాంధేయవాదిగా ముద్రపడ్డ ఆచార్య వినోబా భావే లాంటి వారు ఎమర్జెన్సీని సమర్థించారు. ఈ సమర్థనకు ఎవరి కారణాలు వారు చెప్పుకున్నారు. ఎమర్జెన్సీ అమలు జరిగిన తీరు చూస్తే అవి చీకటి రోజులని తేలిపోయింది. బాల్ థాక్రే నాయకత్వం లోని శివసేన మాత్రం ఎమర్జెన్సీని సమర్థించడం తప్పని ఇప్పటిదాకా అంగీకరించలేదు. "ఎమర్జెన్సీ విధించిన రోజు చీకటి రోజు అయితే ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఏలుబడిలో అనేక చీకటి రోజులు ఉన్నాయి అని సంజయ్ రౌత్ శివసేన అధికార పత్రిక "సామ్నా" లో దాదాపు మూడేళ్ల కింద రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. పెద్దనోట్లను రద్దు చేసిన రోజు కూడా చీకటి రోజే అని ఆయన అన్నారు.

1977లో ఎమర్జెన్సీని తొలగించారు. ఎమర్జెన్సీ సమయంలో ఇందిరా గాంధీ నియంతృత్వం కొనసాగింది. విచిత్రం ఏమిటంటే ఎమర్జెన్సీని రద్దు చేయడం ద్వారా ఇందిరా గాంధీ తన నిరంకుశత్వాన్ని తానే రద్దు చేసుకున్నారు. ఇలాంటి ఉదాహరణలు ప్రపంచంలో ఎక్కడా కనిపించవు. ఎమర్జెన్సీకి మద్దతు ఇచ్చినందుకు 1978లో జరిగిన మహారాష్ట్ర శాసన సభ ఎన్నికలలో శివసేన భారీ మూల్యం చెల్లించవలసి వచ్చింది. దీనితో బాల్ థాక్రే శివసేన అగ్రనాయక స్థానానికి రాజీనామా చేయడానికి సిద్ధ పడాల్సి వచ్చింది. కానీ ఆయన మద్దతుదార్లు ఒప్పుకోకపోవడంతో ఆయన రాజీనామా చేయలేదు.

ఇందిరా గాంధీ


బాల్ థాక్రే


వినోబా భావే

అలాగే 1977 జనవరిలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో లోక్‌సభలో సీపీఐకి తీరని విఘాతం కల్గింది. బాహాటంగా ఎమర్జెన్సీని సమర్థించడం సీపీఐని బాగా కుంగ దీసింది. 1978లో పంజాబ్‌లోని భటిండాలో జరిగిన పార్టీ జాతీయ మహాసభలో ఎమర్జెన్సీని సమర్థించడం పెద్ద తప్పిదమని సీపీఐ అంగీకరించింది. సీపీఐకి, కాంగ్రెస్‌కు మధ్య విభజన రేఖ తొలగిపోయింది అని కూడా ఒప్పుకుంది. రాజకీయ వాస్తవికతను గుర్తించలేకపోయామని, ఇది పెద్ద రాజకీయ తప్పిదం అని సీపీఐ అంగీకరించింది. ఎమర్జెన్సీ విధించడంవల్ల మితవాద ప్రతీప శక్తులు ఓడిపోతాయనుకున్నాం కానీ ఎమర్జెన్సీ నిరంకుశత్వానికి దారి తీసిందని సీపీఐ భావించింది. అయితే ఎమర్జెన్సీని సత్వరం తొలగించాలని డిమాండు చేసింది కూడా సీపీఐనే.

ఎమర్జెన్సీ సమయంలో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలను అనుమతించేవారు కాదు. కానీ ఎమర్జెన్సీ అంత్యదశలో ఎమర్జెన్సీ తొలగించాలని సీపీఐ సమావేశాలు నిర్వహించి కోరింది. ఎమర్జెన్సీలో తీవ్ర విఘాతం కలిగిన తరవాత సీపీఐ తన తప్పు గ్రహించి వామపక్ష ఫ్రంట్‌లో భాగస్వామిగా మారింది.

ప్రసిద్ధ సంపాదకుడు కుష్వంత్ సింగ్ కూడా ఎమర్జెన్సీని సమర్థించిన వారిలో ఉన్నారు. ఆయన తాను ఎందుకు ఎమర్జెన్సీని సమర్థించారో 2000 సంవత్సరంలో వివరణ ఇచ్చారు. "నిరసన తెలియజేయడం ప్రజాస్వామ్యంలో విడదీయలేని హక్కు అని నేను అంగీకరిస్తాను. ప్రభుత్వాన్ని విమర్శించడానికి సభలు, సమావేశాలు పెట్టుకోవచ్చు. ఊరేగింపులు, ప్రదర్శనలు నిర్వహించవచ్చు. సమ్మెలు చేయవచ్చు. వ్యాపారాలు మూసేయించవచ్చు. అయితే దౌర్జన్యానికి దిగకూడదు. దౌర్జన్యకర సంఘటనలు జరిగితే వాటిని అణచి వేయడం ప్రభుత్వ బాధ్యత" అని కుష్వంత్ సింగ్ వివరించారు.

సాధారణంగా రాజకీయాలకు దూరంగా ఉండే ప్రముఖ పారిశ్రామికవేత్త జె.ఆర్.డి.టాటా కూడా ఎమర్జెన్సీని సమర్థించారు. తాను ఇందిరాగాంధీని సమర్థించడం సబబే అని టాటా న్యూ యార్క్ టైమ్స్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఎమర్జెన్సీ విధించక ముందు తాను ఆఫీసులోంచి వీధిలోకి అడుగు పెట్టే పరిస్థితి ఉండేది కాదని జె.ఆర్.డి.టాటా చెప్పారు. ఆయన మరో అడుగు ముందుకు వేసి మనకు పార్లమెంటరీ వ్యవస్థ సరిపడదు అని కూడా అన్నారు. వినోబా భావే అయితే ఎమర్జెన్సీని అనుశాసన పర్వం అని స్తుతించారు.

కేంద్రంపై ఢిల్లీ విమానాశ్రయం దావా

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వంపై ఢిల్లీ విమానాశ్రయం దావా వేసింది. రక్షణశాఖకు చెందిన విమానాశ్రయంలోకి వాణిజ్య విమానాలను అనుమతించడాన్ని సవాల్ చేస్తూ దావా వేసినట్లు జీఎంఆర్ సంస్థ తెలిపింది. గజియాబాద్ విమానాశ్రయంలోకి వాణిజ్య విమానాలను అనుమతిస్తే ఢిల్లీ విమానాశ్రయం ఆర్థికంగా నష్టపోతుందని ఆరోపిస్తూ మార్చి 10న న్యాయస్థానంలో దావా దాఖలు చేసినట్లు పేర్కొంది. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా లేకపోతే ఒక విమానాశ్రయానికి, మరో విమానాశ్రయానికి మధ్య 150 కి.మీ దూరం ఉండాలనే నిబంధనలను ప్రభుత్వం ఉల్లంఘించిందని అధికారులు పేర్కొన్నారు. ఢిల్లీ విమానాశ్రయానికి దాదాపు 30 కి.మీ దూరంలో ఉన్న హిండన్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి కొనసాగుతున్న ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమాన సర్వీసులకు ఇచ్చిన అనుమతిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోర్టును కోరారు. ఈ విషయంపై భారత విమానయాన మంత్రిత్వ శాఖ స్పందించాల్సి ఉంది. ప్రపంచంలోని అత్యంత రద్దీ గల విమానాశ్రయాల్లో ఢిల్లీ విమానాశ్రయం ఒకటి. గతేడాది దాదాపు 73.6 మిలియన్ల మంది ప్రయాణికులు దీనిని ఉపయోగించారు. ప్రభుత్వ రుసుములు పెరగడం వల్ల దాదాపు 21 మిలియన్ డాలర్లు నష్టపోయింది. ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయాల యాజమాన్యంలో జీఎంఆర్‌కు మెజారిటీ వాటా ఉంది.

ఉగ్రవాదాన్ని సహించం: మోదీ

న్యూజిలాండ్‌తో రక్షణ ఒప్పందంపై సంతకాలు

న్యూఢిల్లీ: ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. 2019లో క్రైస్ట్‌చర్చ్ నగరంపై జరిగిన దాడి అయినా... 2008లో ముంబైపై దాడి అయినా తమవైఖరి ఒకటేనని స్పష్టంచేశారు. ఉగ్రవాదులు, వేర్పాటువాదులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సహకారం కొనసాగిస్తామని తెలిపారు. భారత్‌లో పర్యటిస్తోన్న న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌తో ప్రధాని మోదీ సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ న్యూజిలాండ్‌లో కొన్ని శక్తులు భారత్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న విషయాన్ని క్రిస్టోఫర్ దృష్టికి తీసుకెళ్లారు. వాణిజ్యం, రక్షణ, విద్య, వ్యవసాయం వంటి రంగాలపై ఇద్దరు నేతల మధ్య చర్చలు జరిగాయి. రక్షణ రంగంలో రెండు దేశాల మధ్య సహకారం కొనసాగించే దిశగా ఒప్పందంపై సంతకాలు జరిగాయి. పరస్పర ప్రయోజనకరమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ ఒప్పందంతో రెండు దేశాలకు ఉపయోగపడే రీతిలో వాణిజ్య సామర్థ్యం పెరుగుతుందని, పాడిపరిశ్రమ, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా వంటి రంగాల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. తాము అభివృద్ధివాదాన్ని కోరుకుంటున్నామని, విస్తరణవాదాన్ని కాదని రెండు దేశాలు వెల్లడించాయి. 2019లో క్రైస్ట్‌చర్చ్ నగరంలోని మసీదుపై జరిగిన ఉగ్రదాడి ఘటనలో 51 మంది ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ విషయాన్ని మోదీ గుర్తుచేశారు.

స్వల్పంగా పెరిగిన టోకు ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: దేశంలో టోకు ధరల ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 2.38 శాతానికి పెరిగింది. జనవరిలో ఇది 2.31 శాతంగా ఉన్నట్లు సోమవారం విడుదలైన అధికారిక నివేదిక తెలిపింది. ఆహార ఉత్పత్తులు, ఆహార వస్తువులు, వస్త్రాలు, ఆహారేతర వస్తువులు, ఇతర తయారీ ఉత్పత్తుల ధరలు పెరగడంతో టోకు ద్రవ్యోల్బణం పెరిగినట్లు పేర్కొంది. కూరగాయల ఉత్పత్తికి అనుకూల వాతావరణం, సరఫరా పెరగడంతో ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు ఇటీవల కాలంలో తగ్గుతున్నాయని, రానున్న నెలల్లో మరిన్ని వడ్డీ రేట్లపై కోతలు అంచనాలను మరింత పెంచుతున్నాయి. ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం కేంద్రబ్యాంకు నిర్దేశించిన 4 శాతం లక్ష్యం కంటే తక్కువకు పడిపోయిందని, కూరగాయల ధరలు తగ్గడమే ప్రధాన కారణమని గతవారం ప్రభుత్వం ప్రకటించింది.

నిబంధనల ఉల్లంఘన కేసులో అదానీ పేరు తొలగింపు

ముంబై: స్టాక్ మార్కెట్ నిబంధనల ఉల్లంఘనపై దాఖలైన కేసులో అదానీ, మేనేజింగ్ డైరెక్టర్ రాజేశ్ అదానీ పేర్లను బాంబే హైకోర్టు సోమవారం తొలగించింది. ఉత్తర్వులను కొట్టివేసి... వారిద్దరినీ కేసు నుండి విడుదల చేస్తున్నట్లు జస్టిస్ ఆర్ఎన్ లద్దా నేతృత్వంలోని హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులకు సంబంధించిన వివరణాత్మక కాపీ అందుబాటులో లేదు. దాదాపు రూ.388 కోట్ల స్టాక్ మార్కెట్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి 2012లో సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఓ) 2012లో అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్), దాని వ్యవస్థాపకులు గౌతమ్ అదానీ, రాజేశ్ అదానీపై కేసు విచారణ ప్రారంభించింది. వారిపై నేరపూరిత కుట్ర, మోసం అభియోగాలతో చార్జిషీటు దాఖలు చేసింది. అదే సంవత్సరం సెషన్స్ కోర్టు తమను కేసు నుండి విడుదల చేయడానికి నిరాకరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ 2019లో ఇద్దరూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఆర్జీకర్ మృతురాలి తల్లిదండ్రుల పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపై గత ఏడాది జరిగిన హత్యాచారం ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో మళ్లీ సీబీఐ విచారణ జరిపించాలని మృతురాలి తల్లిదండ్రులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు తాజాగా ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. కోల్‌కతా హైకోర్టులో ఈ పిటిషన్ కొనసాగించొచ్చని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా సూచించారు. గతేడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీకర్ ఆసుపత్రి సెమినార్ రూమ్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టించింది. ఈ కేసుకు సంబంధించి ఆసుపత్రి ఆవరణలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్‌రాయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా తేల్చింది. శిక్ష ఖరారు చేయడానికి ముందు... తాను ఏ నేరం చేయలేదని ఏ కారణం లేకుండానే తనను ఇందులో ఇరికించారని సంజయ్ తన వాదనలు వినిపించాడు. ఈ కేసులో కోర్టు అతడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది.



కాషాయసేన మరో కరసేవ!

- ఔరంగజేబు సమాధి కూల్చివేతకు కుట్ర
- ప్రజాస్వామ్యవాదులు... రాజకీయ నేతల ఆగ్రహం
- బీజేపీ పాలిత మహారాష్ట్రలో ఉద్రిక్తతలు
- సమాధి వద్ద పోలీసుల మోహరింపు

ఛత్రపతి శంభాజీనగర్: దేశంలో కాషాయ శ్రేణులు మరో కరసేవకు సిద్ధమవుతున్నాయి. మతోన్మాద చర్యల ద్వారా ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ (గతంలో ఔరంగాబాద్)లోని ఖుల్దాబాద్‌లో ఉన్న మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధి ప్రధాన రాజకీయ, మతపరమైన ఘర్షణ కేంద్రంగా మారింది. బాబ్రీ మసీదు మాదిరిగానే ఔరంగజేబు సమాధి కూల్చివేతకు గురవుతుందా అనే అనుమానాలు, ఆందోళనను ప్రజాస్వామ్యవాదులు, ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాషాయ సంస్థలు ఔరంగజేబు సమాధిని తొలగించాలనే డిమాండ్ లేవనెత్తాయి. దీనిని అధికారులు తొలగించకపోతే బాబ్రీ మసీదు కూల్చివేత వంటి చర్య తీసుకుంటామని హిందూ సంస్థలు బెదిరిస్తున్నాయి. బజరంగ్ దళ్ నాయకుడు నితిన్ మహాజన్ తీవ్ర హెచ్చరిక జారీ చేస్తూ 'ప్రభుత్వం సమాధిని తొలగించకపోతే మేము కరసేవ చేస్తాం. బాబ్రీ నిర్మాణాన్ని తొలగించడానికి అయోధ్యలో ఏమి జరిగిందో మనమందరం చూశాం' అని పేర్కొన్నారు. ఆయన ప్రకటన అశాంతి, ఆందోళనను రేకెత్తించింది. ఆ స్థలం చుట్టూ భద్రత పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. శివాజీ మహారాజ్ కుమారుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్‌ను ఉరి తీయడం సహా హిందువులపై జరిగిన దారుణాలకు ఔరంగజేబు ఒక 'నిరంకుశుడు' అని వాదిస్తూ బజరంగ్ దళ్, వీహెచ్‌పీ వంటి మితవాద సంస్థలు ఔరంగజేబు సమాధి కూల్చివేతకు డిమాండ్ చేశాయి. ఆ సంస్థలకు చెందిన కొంతమంది నాయకులు 1992లో బాబ్రీ మసీదు కూల్చివేతతో పోలిస్తూ, విషయాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటామని బెదిరిస్తున్నారు. బజరంగ్ దళ్, వీహెచ్‌పీ మార్చి 17 నుంచి సమాధి తొలగించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు దిగాయి. ఈ నేపథ్యంలో ఔరంగజేబు సమాధి వద్ద సోమవారం భద్రతా సిబ్బందిని మోహరించినట్లు కనిపించింది. సందర్శకులపై కఠినమైన నిఘాతో పోలీసులు భద్రతా తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఔరంగజేబు సమాధినితొలగించాలనే డిమాండ్‌పై బజరంగ్ దళ్ సభ్యులు సోమవారం నాగపూర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. వీహెచ్‌పీ మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల అధ్యక్షుడు గోవింద్జీ షిండే విలేకరులతో మాట్లాడుతూ 'ఈ ఉద్యమం దశలవారీగా నిర్వహిస్తాం. ప్రజా అవగాహన కార్యక్రమాలతో ప్రారంభమవుతుంది. ఇందులో నిరసనలు, దిష్టిబొమ్మల దహనం, సమావేశాలు ఉంటాయి. చివరి దశ చలో శంభాజీనగర్‌కు ప్రదర్శన చేపడతాం' అని చెప్పారు. బీజేపీ నాయకుడు, తెలంగాణ రాష్ట్రం గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్... ఔరంగజేబు సమాధి నిర్వహణకు భారత పురావస్తు సర్వే (ఏఎస్ఐ) ఖర్చు చేసిన నిధులపై వివరణాత్మక సమాచారం కోరుతూ కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు మార్చి 15న లేఖ రాశారు.

ఆ సమాధి మనకెందుకు: ఫడ్నవీస్

ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందిస్తూ 'ప్రతి ఒక్కరూ సమాధి తొలగించాలని కోరుకుంటున్నారు' అని చెప్పారు. కానీ మునుపటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ స్థలాన్ని ఏఎస్ఐ రక్షణలో ఉంచిందని, దీనివల్ల ఏ తొలగింపు అయినా చట్టవిరుద్ధంగా, సంక్లిష్టంగా మారిందని చెప్పుకొచ్చారు. ఈ వివాదంపై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే మాట్లాడుతూ మరాఠాల మనోభావాలను తాను గౌరవిస్తానని, ఔరంగజేబుకు ఎవరూ మద్దతు ఇవ్వకూడదని అభిప్రాయపడ్డారు. 'నేను మరాఠాల మనోభావాలను గౌరవిస్తాను. ఔరంగజేబు శంభాజీ మహారాజ్‌ను హింసించాడు. ఔరంగజేబును కీర్తించకూడదు. ఔరంగజేబుకు ఎవరూ మద్దతు ఇవ్వకూడదు' అని అన్నారు. 'అతను మహారాష్ట్రకు శత్రువు. దేశద్రోహి. మహారాష్ట్రలో ఔరంగజేబు అవశేషాలు మనకు అవసరమా అని షిండే ప్రశ్నించారు. అదే సమయంలో సమాధిని తొలగించడం వల్ల ప్రయోజనం లేదని కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే అన్నారు. హిందూ సంస్థల డిమాండ్‌ను వ్యతిరేకించారు.

శాంతిభద్రతల సమస్యలు... తగ్గిన పర్యాటకం

ఈ వివాదంతో ఛత్రపతి శంభాజీనగర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హిందూత్వ నాయకుడు మిలింద్ ఎక్బోటేను జిల్లాలోకి ప్రవేశించకుండా నిషేధించారు. భారీ సంఖ్యలో పోలీసులను మోహరించారు. సమాధి సంరక్షకుడు ఫిరోజ్ అహ్మద్ కబీర్ అహ్మద్ మాట్లాడుతూ ఈ వివాదం కారణంగా సందర్శకుల సంఖ్య గణనీయంగా తగ్గిందని, రోజుకు 2,500–3,000 మంది నుంచి ఇప్పుడు 200–400 మందికి తగ్గిందని చెప్పారు. దుకాణాలు, హోటళ్లు సహా స్థానిక వ్యాపారాలు కూడా మతపరమైన ఉద్రిక్తతలకు భయపడి ప్రభావితమయ్యాయి. మరోవైపు, రాజకీయ పార్టీలు, హిందూత్వ సమూహాలు తమ వాదనలు పెంచుతుండటంతో ఈ వివాదం మహారాష్ట్రలో చారిత్రక, మతపరమైన ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేస్తోంది.

రాజకీయ నాయకుల జోక్యమెందుకు: సూలే

హిందూ సంస్థల డిమాండ్లపై ఎన్‌సీపీ (ఎస్‌పీ) ఎంపీ సుప్రియా సూలే మాట్లాడుతూ 'ఇది ఒక పార్టీకి సంబంధించిన విషయం కాదు. ఇది చరిత్రకు సంబంధించిన అంశం. రాజకీయ నాయకులు ఇందులో జోక్యం చేసుకోకూడదు. నిపుణులను నిర్ణయం తీసుకోనివ్వండి. చరిత్రకారులను దాని గురించి మాట్లాడనివ్వండి' అని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయ్ వాడేట్టివార్ మాట్లాడుతూ హిందూ సంఘాలకు మరో గత్యంతరం లేకుండా పోయిందని ఆరోపించారు. 'వారు (వీహెచ్‌పీ, బజరంగ్ దళ్) వేరే ఏమీ చేయాల్సిన అవసరం లేదు. మహారాష్ట్ర ప్రజలు ప్రశాంతంగా జీవించాలని వారు కోరుకోవడం లేదు. రాష్ట్ర అభివృద్ధి వేగాన్ని మందగించాలనుకుంటున్నారు' అని మండిపడ్డారు. మహారాష్ట్రలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉందని కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి అతుల్ లోండే పాటిల్ అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కుప్పకూలిపోయాయని, ప్రభుత్వం ఆ విషయాన్ని దాచిపెడుతోందని విమర్శించారు. 'రైతులు విద్యుత్, నీరు అందక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. నిరుద్యోగం పెరిగింది. ఈ సమస్యలన్నింటినీ దాచడానికి బీజేపీ హిందువులు, ముస్లింల కొత్త సమస్యలను తెర పైకి తెస్తోంది. వారు పీఎఫ్, పెన్షన్ పథకాల నుంచి ప్రజలను షేర్ మార్కెట్ వైపు మళ్లించారు. ఇప్పుడు ఐదు నెలల్లోనే సామాన్యుడు పేదవాడిగా మారాడు. ఇలాంటి గిమ్మిక్కులతో ప్రజల దృష్టి మళ్లించలేరు. ఈసారి ప్రజలు దాని వలలో పడరు. వారు నిజమైన సమస్యలపై చర్చించాలి' అని పాటిల్ అన్నారు.

హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌కు టోకరా

న్యూఢిల్లీ: సైబర్ కేటుగాళ్లు ఏకంగా భారత్‌లో విమానాలు తయారుచేసే హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌నే మోసం చేసి రూ.55 లక్షలు కొల్లగొట్టారు. తాజాగా హాల్ జనరల్ మేనేజర్ అశోక్ కుమార్ సింగ్ ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు ఐటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టారు. 2024 మే నెలలో హాల్ సంస్థ మూడు ఫైటర్ విమానాలకు సంబంధించిన కొన్ని పార్టుల కోసం అమెరికాలోని కంపెనీని సంప్రదించింది. ఆ సంస్థ కూడా దీనికి ఈ-మెయిల్‌లో స్పందించింది. ఇదే సమయంలో ఎక్కడో ఒక ఫేక్ ఈ-మెయిల్ దీనిలో వచ్చి చేరింది. మోసగాళ్లు దాని ఆధారంగా డబ్బులు వసూలు చేశారు. 'విమానాల విడిభాగాల కోసం హాల్, అమెరికాకు చెందిన పీఎస్ ఇంజినీరింగ్ ఇన్‌కార్పొరేటెడ్ అనే సంస్థను సంప్రదించింది. అధికారిక ఈమెయిల్ నుంచే సంప్రదింపులు మొదలయ్యాయి. ఆ మెయిల్ సూచించిన ఖాతాకు 63,000 (రూ.55 లక్షలు) డాలర్లు చెల్లించారు. కానీ, పీఎస్ ఇంజినీరింగ్ మాత్రం తమకు డబ్బు ముట్టలేదని చెప్పడంతో అధికారులు కంగారుపడి ఖాతాలు సరిచూశారు. చివరికి తప్పుడు ఈమెయిల్ సూచించిన ఖాతాకు డబ్బు వెళ్లినట్లు గుర్తించారు' అని సీనియర్ పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు.

త్వరలో చంద్రుడిపై అధ్యయనం

ఇస్రో చైర్మన్

చెన్నై: చంద్రుడిపై అధ్యయనం చేయడానికి ప్రతిష్ఠాత్మకమైన చంద్రయాన్-5 మిషన్‌కు కేంద్రం ఆమోదం తెలిపినట్లు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన గౌరవార్థం చెన్నైలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ... చంద్రయాన్-5 మిషన్‌కు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. జపాన్ సహకారంతో ఈ ప్రాజెక్టు చేపడుతున్నట్లు ప్రకటించారు. చంద్రయాన్-5 ఇదివరకటి మిషన్‌ల కంటే అత్యంత ప్రత్యేకమైందని తెలిపారు. చంద్రుడి ఉపరితలాన్ని అధ్యయనం చేయడానికి 2023లో ప్రయోగించిన చంద్రయాన్-3... 25 కిలోల బరువున్న 'ప్రజ్ఞాన్' రోవర్‌ను మోసుకెళ్లగా, చంద్రయాన్-5 ఏకంగా 250 కిలోల రోవర్‌ను మోసుకెళ్తుందని అన్నారు.

భారత్-అమెరికాకు ఇస్లామిక్ ఉగ్రవాదంతో ముప్పు

జైశంకర్‌తో భేటీలో తులసీ గబ్బర్డ్

న్యూఢిల్లీ: ఇస్లామిక్ ఉగ్రవాదం అమెరికా, భారతదేశం రెండింటికీ గణనీయమైన ముప్పుగా ఉందని అమెరికా జాతీయ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బర్డ్ అన్నారు. దానిని ఎదుర్కోవడానికి ప్రధాన మంత్రి నరేంద్ర, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కలిసి పని చేస్తున్నారని చెప్పారు. సోమవారం ఉదయం భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో సమావేశమైన గబ్బర్డ్, ఇస్లామిక్ ఉగ్రవాదం అమెరికా, భారతదేశాన్ని మాత్రమే కాకుండా మధ్యప్రాచ్యంలోని అనేక దేశాలను కూడా ఎలా ప్రభావితం చేసిందో ప్రత్యేకంగా ప్రస్తావించారు. పాకిస్తాన్ నుంచి భారత్‌పై తరచూ జరుగుతున్న ఉగ్రవాద దాడుల గురించి అడిగినప్పుడు... గబ్బార్డ్ ఇస్లామిక్ ఉగ్రవాదం విస్తృత సమస్యను ప్రస్తావిస్తూ స్పందించారు. 'అధ్యక్షుడు ట్రంప్ ఇస్లామిక్ ఉగ్రవాద ముప్పును ఓడించడానికి తన నిబద్ధత గురించి చాలా స్పష్టంగా ఉన్నారు. ఇది మనల్ని విషాదకరంగా ప్రభావితం చేసింది. అమెరికన్ ప్రజలకు ప్రత్యక్ష ముప్పుగా కొనసాగుతోంది' అని గబ్బర్డ్ అన్నారు. 'ఇది భారతదేశంలో, బంగ్లాదేశ్‌లో, ప్రస్తుతం సిరియా, ఇజ్రాయిల్, మధ్యప్రాచ్యంలోని వివిధ దేశాలలో ప్రజలను ఎలా ప్రభావితం చేసిందో చూస్తున్నాం. ఇది ప్రధాన మంత్రి కూడా తీవ్రంగా పరిగణిస్తున్న ముప్పు అని నాకు తెలుసు. దీనిని గుర్తించి ఓడించడానికి మా నాయకులు కలిసి పనిచేయడానికి కట్టుబడి ఉన్నారు' అని చెప్పారు.

రక్షణ, భద్రతపై రాజ్‌నాథ్‌తో సుదీర్ఘ మంతనాలు

రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో అమెరికా డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ అధికారులు భేటీ అయ్యారు. ఢిల్లీలోని సౌత్‌బ్లాక్‌లో సోమవారం ఈ సమావేశం జరిగింది. రెండు దేశాల మధ్య రక్షణ, భద్రతాపరమైన సంబంధాల బలోపేతం, ఇంటెలిజెన్స్ షేరింగ్ వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. సీమాంతర ఉగ్రవాదంపైనా చర్చలు జరిపారు. ఓ రక్షణ ఒప్పందంపైనా చర్చలు జరిగినట్లు సమాచారం. భారత్‌లో రెండున్నర రోజుల పర్యటనకుగాను డీఎన్ఐ తులసీ గబ్బర్డ్ న్యూఢిల్లీకి వచ్చారు. ఆమె గ్లోబల్ ఇంటెలిజెన్స్ కాంక్లేవ్‌లో పాల్గొన్నారు. ట్రంప్ రెండోవిడత కార్యవర్గంలోని సీనియర్ స్థాయి అధికారి భారత్‌ను సందర్శించడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో భాగంగా ఆమె ఇప్పటికే జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో భేటీ అయ్యారు. రెండుదేశాల మధ్య నిఘా సమాచార పంపిణీ, సాంకేతిక పరిజ్ఞాన సహకారాన్ని పెంపొందించుకోవడం, భారత్-అమెరికా ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యానికి అనుగుణంగా భద్రత రంగంలో బంధాన్ని బలోపేతం చేసుకోవడంపై ఇద్దరి మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ఇండో-పసిఫిక్, ఖలిస్తానీ ఉగ్రవాదం వంటి అంశాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది.

సమష్టి లక్ష్యాలపై మోదీ-ట్రంప్ దృష్టి

ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మంచి మిత్రులని తులసీ గబ్బర్డ్ పేర్కొన్నారు. 'వారు సమష్టి లక్ష్యాలపై దృష్టిపెట్టారు. భారత్-అమెరికా సంబంధాలు ఎంతో పురాతనమైనవి. వాటిని బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తున్నాం. రెండుదేశాలు పరస్పర ప్రయోజనాలను గుర్తిస్తున్నాయి. శాంతి, సుసంపన్నత, స్వేచ్ఛ, భద్రత వంటి అంశాలు కేంద్రంగా ఇవి ఉన్నాయి. రెండు దేశాలకు ఉత్తమ నాయకులు ఉన్నారు. వారు మంచి మిత్రులు. సమష్టి లక్ష్యాలు, పరస్పర ప్రయోజనాలపై దృష్టిపెట్టారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చాలా స్పష్టమైన వైఖరితో చూస్తున్నారు. ఆయన దృష్టి మొత్తం శాంతిస్థాపనపైనే ఉంది. యుద్ధాన్ని ముగించడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. చర్చలు ఇప్పుడే మొదలయ్యాయి' అని తులసీ ఓ వార్తా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

కేంద్రం ప్రజలను దోచుకుంటోంది

మోదీ సర్కార్‌పై ఖర్గే ధ్వజం

న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. సోమవారం ఆయన సామాజిక మాధ్య వేదికగా స్పందిస్తూ, ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ... దాని ప్రయోజనాలను ప్రజలకు చేరవేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముడి చమురు ధరలు 42 నెలల కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయని అనేక మీడియా సంస్థలు వెల్లడించిన నివేదికలను ఉటంకించారు. బీజేపీ ప్రభుత్వం ఇంకెన్నాళ్లు ప్రజల నుంచి వసూళ్లకు పాల్పడుతూ, వారిని దోచుకుంటుందని ప్రశ్నించారు. 'ముడి చమురు ధరలు నిరంతరం తగ్గుతూనే ఉన్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గట్లేదు. మే 2014 నుంచి సుమారు 34 శాతం తగ్గాయి. పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం రూ.36 లక్షల కోట్ల పన్ను వసూలు చేసింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా ప్రజలు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఇంకా ఈ దోపిడీ ఎంతకాలం కొనసాగుతుంది' అని ఖర్గే ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో అమలులోకి తీసుకురానున్న లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై మాట్లాడుతూ కేంద్రం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తోందన్నారు. దేశ వనరులు, పాలనలో అన్ని రాష్ట్రాలకు సమన్యాయం ఉండాలని స్పష్టం చేశారు. 'జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయడం వల్ల దక్షిణాదిలో ఎమ్మెల్యే సీట్ల సంఖ్య తగ్గే అవకాశం ఉంది. కానీ ఉత్తరాదిలో వాటి సంఖ్య పెరుగుతుంది. దీని వల్ల దేశంలో సమన్యాయం లేకుండా పోతుంది. అందువల్ల అలాంటివి జరగకుండా సామాజిక సమానత్వం కోసం అందరు కలిసికట్టుగా పోరాడాలి' అని ఖర్గే పిలుపునిచ్చారు.

వీగిన అన్నాడీఎంకే అవిశ్వాస తీర్మానం

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ ఎం.అప్పావుకి వ్యతిరేకంగా సోమవారం అన్నాడీఎంకే ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. అన్నాడీఎంకే ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మూజువాణి ఓటుతో విఫలమైందని డిప్యూటీ స్పీకర్ పిచాండి ప్రకటించారు. 154 మంది సభ్యులు తీర్మానాన్ని వ్యతిరేకించగా, కేవలం 62 మంది మాత్రమే అనుకూలంగా ఓట్లు వేసినట్లు తెలిపారు. అసెంబ్లీలో స్పీకర్ ఎం. అప్పావు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని, డీఎంకే కార్యకర్తలా పనిచేస్తున్నారని అన్నాడీఎంకే తన తీర్మానంలో పేర్కొంది. అన్నాడీఎంకే ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని చూసి ప్రజలు నవ్వుతారని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఎద్దేవా చేశారు. అప్పావు చర్యలు నిష్పక్షపాతంగానే ఉన్నాయని, అందుకే స్పీకర్‌గా ప్రకటించామని అన్నారు. తమ ప్రభుత్వం, పార్టీ ప్రభావం లేకుండా ఆయన వ్యవహరిస్తున్నారని, ఈ అంశాన్ని ప్రజలు కూడా విశ్వసిస్తారని అన్నారు.

కొత్త నిబంధనలు మా సంస్కృతిపై దాడి: ఎంపీ

న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో (ఎంజీఎన్ఆర్ఈజీఏ)లో గత ఐదేళ్లలో కేంద్రం ప్రవేశపెట్టిన కొత్త నిబంధనలపై భారత్ ఆదివాసి పార్టీ ఎంపీ రాజ్‌కుమార్ రోట్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉపాధిహామీ పథకంలో కూలీలకు రెటీనా స్కాన్‌లు తప్పనిసరి చేయడం వంటి నిబంధనలతో ఆ పథకాన్ని కేంద్రం బలహీనపరుస్తుందని ఆయన తీవ్రంగా విమర్శించారు. సోమవారం లోక్‌సభలో జీరో అవర్‌లో ఉపాధిహామీ పథకంలో తెచ్చిన నిబంధనలపై ఆయన కేంద్రంపై ధ్వజమెత్తారు. 'మామ, బావమరిది, పెద్దవాళ్లయిన పురుషుల ముందు మహిళలు ముసుగు తొలగించరు. ఇది మా సంస్కృతిలో భాగం. కానీ ఎంఎన్ఆర్ఈజీఏ పథకంలో హాజరు నమోదుకు రెటీనా స్కాన్ స్క్రీనింగ్ కోసం మహిళలు వారి ముసుగు తొలగించాల్సి వస్తోంది. మా సంస్కృతిపై దాడి చేయడానికే కేంద్రం ఈ నిబంధన అమలు చేస్తోంది. ఈ కొత్త నిబంధనలు ఉపాధి పథకాన్ని బలహీనపరుస్తున్నాయి' అని ఆయన విమర్శించారు.

వర్సిటీ ప్రాంగణంలో నమాజ్... విద్యార్థి అరెస్ట్

మీరట్: యూనివర్సిటీ ప్రాంగణంలో నమాజ్ చేయడంతో పాటు ఆ వీడియోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన ఒక విద్యార్థిని యూపీ పోలీసులు అరెస్ట్ చేశారు. మీరట్‌లోని ఐఐఎంటీ యూనివర్సిటీలో గత శుక్రవారం ఈ ఘటన జరిగింది. యూనివర్సిటీ ప్రాంగణంలో కొందరు విద్యార్థులు నమాజ్ చేస్తున్న వీడియోను ఖాలిద్ ప్రధాన్ (ఖాలిద్ మేవతి) సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. ఈ వీడియోపై స్థానిక హిందూ సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. ఖాలిద్ ప్రధాన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. యూనివర్సిటీ ప్రాంగణంలో నమాజ్ చేస్తున్న వీడియోను సోషల్‌మీడియాలో పోస్ట్ చేసి... మత విద్వేషాలు రెచ్చగొట్టినందుకు ఖాలిద్‌ను అదుపులోకి తీసుకున్నామని సర్కిల్ ఆఫీసర్ ప్రతాప్ సింగ్ తెలిపారు. కార్తీక్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు శనివారం గంగానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బీఎన్ఎస్ సెక్షన్ 299, ఐటీ (సవరణ) చట్టం, 2008లోని సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేశామని అన్నారు. బహిరంగ ప్రదేశంలో నమాజ్ చేయడంతో పాటు మతసామరస్యాన్ని దెబ్బతీసేందుకు ఆ వీడియోను సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేసినట్లు దర్యాప్తులో తేలిందని యూనివర్సిటీ ప్రతినిధి సునీల్ శర్మ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఖాలిద్‌తో పాటు ముగ్గురు భద్రతా సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థినులపై లైంగిక వేధింపులు

ప్రొఫెసర్‌పై కేసు

లక్నో: మహిళా విద్యార్థినులను లైంగికంగా వేధించిన ప్రొఫెసర్‌పై పోలీసులు కేసు నమోదు చేయగా... కళాశాల యాజమాన్యం అతడిని విధుల నుంచి సస్పెండ్ చేసింది. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లాలో జరిగింది. వివరాల్లోకి వెళితే... హత్రాస్‌లోని సేఠ్ ఫూల్ చంద్ బాగ్లా పీజీ కళాశాలలో భౌగోళికశాస్త్ర ప్రొఫెసర్ రజనీష్ కుమార్ పలువురు మహిళా విద్యార్థినుల పై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ నెల 13న ప్రొఫెసర్ రజనీష్‌పై పోలీసులకు ఒక అనామక ఫిర్యాదు అందింది. అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు వీడియోలు రికార్డ్ చేశాడని బాధిత మహిళ ఆరోపించింది. మోదీ ప్రభుత్వం 'బేటీ బచావో బేటీ పఢావో'కు మద్దతు ఇస్తుంది. కానీ, ఆ తర్వాత కూడా ఇలాంటి వ్యక్తులు కుమార్తెలపై క్రూరత్వానికి పాల్పడుతున్నారు. ఈ క్రూరమైన వ్యక్తి నన్ను చాలా బాధపెడుతున్నాడు. కొన్నిసార్లు నేను ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నా. దయచేసి విద్యార్థినులను రక్షించండి. అవమానం కారణంగా ఏ విద్యార్థిని బహిరంగంగా ఫిర్యాదు చేయలేదు. దయచేసి ఈ రాక్షసుడిపై కఠిన చర్యలు తీసుకోండి. నాలాంటి చాలా మంది అమ్మాయిలకు న్యాయం చేయండి' అని ఆ లేఖలో వేడుకుంది. ఆ ప్రొఫెసర్ ఏడాదిన్నరగా విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు బాధిత మహిళ ఆరోపించింది. మహిళా కమిషన్, ఇతర సీనియర్ అధికారులకు లేఖ ద్వారా ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె విమర్శించింది. ప్రొఫెసర్ అసభ్యకరమైన చర్యలకు పాల్పడుతున్న ఫొటోలు, వీడియో క్లిప్‌లు పోలీసులకు పంపింది. ఇవి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కాగా, అజ్ఞాత మహిళ ఫిర్యాదుపై పోలీసులు స్పందించారు. ప్రొఫెసర్ రజనీష్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అతడి దారుణాలపై మరింతగా దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ప్రొఫెసర్ రజనీష్‌పై కాలేజీ యాజమాన్యం చర్యలు చేపట్టింది. ఆయనపై కేసు నమోదు కావడంతో సస్పెండ్ చేసింది.

విశాలాంధ్ర హైదరాబాద్

వెయ్యి మాటల కన్నా ఒక్క ఫోటో ఎంతో గొప్పది

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఫోటోగ్రఫీలో తెలంగాణ, త్రిపుర రాష్ట్రాలకు గొప్ప చరిత్ర ఉందని, ఆ రోజుల్లో దేశంలో ప్రప్రథమంగా ప్రైవేట్‌గా ఫోటో కెమెరాలు కొనుగోలు చేసిన ఘనత హైదరాబాద్, త్రిపుర సంస్థానాలకే దక్కిందని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. సోమవారం బషీర్ బాగ్‌లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) అనుబంధ సంఘమైన తెలంగాణ స్టేట్ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన ఉత్తమ ఫోటో జర్నలిస్టులకు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వెయ్యి మాటల కన్నా ఒక్క ఫోటో ఎంతో గొప్పదన్నారు. పత్రికల్లో ఎన్నో వార్తలు ప్రచురితమైనా పాఠకుల దృష్టిని ఆకర్షించేది ఫోటోలు మాత్రమేనని జిష్ణు దేవ్ వర్మ స్పష్టం చేశారు. చరిత్రలో రికార్డుగా ఉండి పోయేది ఫోటోలే అన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావంతో పత్రికలకు ఆదరణ తగ్గి పోతుందని చర్చ జరుగుతుందని, కానీ ఇది తాత్కాలికం మాత్రమేనని, భవిష్యత్తు పత్రికలకే ఉంటుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, రాష్ట్ర టూరిజం అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, టీయూడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి గంగాధర్, కె.ఎన్.హరి పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఫిక్స్డ్ పేమెంట్ ఇవ్వాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆశా యూనియన్ జనరల్ సెక్రెటరీ సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి ఉమా గౌరికి తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటానికి వెళ్తున్నామని విన్నవించారు. ఆశా వర్కర్లు 18 సంవత్సరాలుగా పని చేస్తున్నప్పటికీ వాళ్లకి ఫిక్స్ వేతనం ఈఎస్,ఐ, పిఎఫ్, గ్రాడ్యుడిటీ, ప్రమాద బీమా సౌకర్యం ఇలాంటి కనీస వసతులు ఏవి లేవని, పనికి పారితోషకం పేరుతో ప్రభుత్వాలు ఆశలను శ్రమను దోసుకుంటున్నారని, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ ఈనెల 18న తహసీల్దార్ కార్యాలయాల ముందు ధర్నా, 19న కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా, 21న పీఎస్సీ సబ్ సెంటర్ల ముందు నిరసన 24న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని సమాచారం అందించడం జరిగింది. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆశలకు 18000 ఫిక్స్ వేతనం చేస్తానన్న మాటను సీఎం రేవంత్ రెడ్డి నెరవేర్చాలన్నారు. ఆశాల సమస్యలు తీరని ఎడల భవిష్యత్తులో తీవ్రమైన పోరాటం కొనసాగిస్తారని ప్రభుత్వాన్ని సిఐటియు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె.ఉన్ని కృష్ణ హెచ్చరించారు. వారి తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమన్నారు. జిల్లా కార్యదర్శి ఎం.రేవతి, కళ్యాణి, జిల్లా నాయకులు రాధా, యాదమ్మ, లలిత, కోమలత, మంగ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్లు కదిరివన్ పలని, డాక్టర్ ముకుంద రెడ్డి జిల్లా తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో ప్రజల నుండి 69 దరఖాస్తులు అందాయని తెలిపారు. అట్టి అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో గృహ నిర్మాణ శాఖకు 29, పెన్షన్ 12 ఇతర శాఖలకు సంబంధించినవి 28 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఈ. వెంకట చారి, జిల్లా అధికారులు పవన్ కుమార్, సుబ్రహ్మణ్యం, సిపిఓ సురేందర్, రాజేందర్, శ్రీరామ్, రమేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో ఎస్సీల లబ్ధిపై కలెక్టర్ సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జిల్లాలోని శాఖల వారీగా రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలలో ఎస్సీలకు ఎంత శాతం లబ్ది చేకూరుతుందనే జాబితాలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం పరిశీలించారు. సోమవారం కలెక్టరేట్ విసి హాల్‌లో షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు మంగళవారం రానున్న సందర్భంగా జిల్లా అధికారులతో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలలో ఎస్సీలకు ఎంత శాతం లబ్ది చేకూరుతుందని శాఖల వారీగా కలెక్టరు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్సీలకు ఎంత శాతం లబ్దిచేకూరుతుందనే జాబితాలను కలెక్టరు పరిశీలించారు. వివిధ సంక్షేమ శాఖల ద్వారా అందించే రైతు భరోసా, రైతు బీమా, రుణ మాఫీ, గృహలక్ష్మి, స్వయం సహాయక బృందాల రుణాలు, మహిళా శక్తి, 2 బిహెచ్‌కె వంటి పథకాల అమలులో ఎంత మంది ఎస్సీలకు లబ్ది చేకూరిందని జిల్లా కలెక్టరు సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా జనాభాలో ఎస్సీలు ఎంత శాతం ఉన్నారు. అని సిపిఓను అడిగారు. డిఆర్ఓ హరిప్రియ, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, సిపిఒ శేఖర్, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, విద్యాశాఖాధికారి విజయ కుమారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత, హౌజింగ్ ఈ.ఈ రమణమూర్తి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి బాబు మోసెస్, పరిశ్రమలు అధికారి ప్రశాంత్, సివిల్ సప్లై, అధికారి సుగుణబాయి, మెడికల్ అండ్ హెల్త్ అధికారి ఉమాగౌరి, విద్యుత్తు శాఖాధికారి, జిల్లా ఉపాధి అధికారి రాధిక తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువత తలరాత మార్చే పథకం రాజీవ్ యువవికాసం

ఏడాదిలోనే 56 వేల మందికి ఉద్యోగాలు

పథకం ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : పవిత్రమైన శాసనసభ నుంచి రాష్ట్ర యువత కోసం ప్రారంభిస్తున్న రాజీవ్ యువ వికాస పథకం యువత తలరాతను మారుస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 6 వేల కోట్ల రూపాయలతో తెలంగాణ రాష్ట్రంలోని ఐదు లక్షల మంది యువతకు లబ్ధి చేసే విధంగా ఈ పథకాన్ని రూపకల్పన చేశామని వివరించారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత అంతకు ముందు ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ యువత స్వయం ఉపాధి పథకాలకు ఒకటేసారి 6000 కోట్ల రూపాయలు కేటాయించిన దాఖలాలు లేవన్నారు. ఈ ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కార్పొరేషన్లను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక సంవత్సరంలోనే 56 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించామన్నారు. దశాబ్ద కాలం అధికారంలో ఉన్న గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్షలు ఒక్కసారి కూడా నిర్వహించలేదని, ఒక సంవత్సరంలోనే గ్రూప్-1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేసి, యువతలో ఆనందోత్సాహాలను నింపామని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ప్రకారంగా నోటిఫికేషన్లు విడుదల చేయడం వల్ల పోటీ పరీక్షలకు ఒకేసారి సిద్ధం కావడం ఇబ్బందిగా ఉందని, నోటిఫికేషన్ల మధ్యన కొంచెం గ్యాప్ ఇవ్వాలని కోరుతూ ఆందోళన చేసి స్థాయికి విరివిగా నోటిఫికేషన్లు ఇచ్చే పరిస్థితి ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు రాని నిరుద్యోగ యువత వారి కాళ్లపై నిలబడి సమాజంలో తలెత్తుకొని బతకడానికి స్వయం ఉపాధి పథకాలు అందించాలని ముఖ్యమంత్రి ఆలోచన చేసి రాజీవ్ యువ వికాస పథకం తీసుకొచ్చారని వివరించారు. ఆర్థిక శాఖ బాధ్యతలు చూస్తున్న మంత్రిగా ఈ పథకం అమలు కోసం విధి విధానాలు, కావలసిన నిధుల సమీకరణ పై క్యాలెండరు సిద్ధం చేయాలని చెప్పడంతో అన్ని శాఖలను సమన్వయం చేసుకొని ఈ పథకాన్ని రూపకల్పన చేయడంతో పాటు నిర్దిష్టమైన క్యాలెండర్ రూపొందించి ప్రకటించడం జరిగిందని తెలిపారు. నిన్న రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారి నివాసంలో ఆర్థిక శాఖ బాధ్యతలు చూస్తున్న నాతో పాటు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులతో సమీక్షించి ఈ పథకం 100శాతం అమలు కావడానికి కావలసిన విధి విధానాలను ఖరారు చేశారని చెప్పారు. రాజీవ్ యువ వికాస పథకానికి సంబంధించి ఈ నెల 15 నోటిఫికేషన్ జారీ చేశామని, దరఖాస్తుల ప్రక్రియ ఈరోజు నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఆన్లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తుల డౌన్లోడ్ చేసుకొని మండల కార్యాలయంలో సంబంధిత అధికారులకు సమర్పించాలన్నారు. మండల అధికారులు వాటిని స్క్రూటినీ చేసి జిల్లా అధికారులకు పంపించి కలెక్టర్ సమక్షంలో దరఖాస్తుల వెరిఫికేషన్ చేస్తారని, ఆ తర్వాత ఇన్చార్జి మంత్రి అప్రూవల్ చేయడం ద్వారా జూన్ 2న మంజూరు పత్రాలు పంపిణీ జరుగుతుందన్నారు. 50 వేల నుంచి 4 లక్షల వరకు స్వయం ఉపాధి పథకాల ద్వారా యువతకు ఆర్థిక సాయం చేయడానికి ప్రత్యేక రాష్ట్రంలోనూ అంతకుముందు ఉన్న ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఒకటేసారి 6వేల కోట్ల రూపాయలు కేటాయించిన దాఖలాలు లేవన్నారు.

ఆర్‌బిఎస్‌కే ద్వారా విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : విద్యార్థులలో కంటి చూపు లోపాలని ముందుగా గుర్తించి మెరుగైన చికిత్సలు అందేలా ప్రభుత్వం ఉచిత కంటి పరీక్షలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం మెహిదీపట్నం సఫ్దరియా బాలికల పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆర్‌బిఎస్‌కె కార్యక్రమం కింద దృష్టి లోపం ఉన్న పిల్లలకు కళ్లద్దాలు పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ శెట్టి పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని చదవాలని అన్నారు. విద్యార్థులు మొబైల్, టాబ్, కంప్యూటర్, టివి వంటి ఎలక్ట్రానిక్ ఐటమ్స్‌పై ఎక్కువ సమయం కేటాయించడంతో విద్యార్థులలో కంటి సమస్యలు ఎక్కువ అవుతున్నాయని వాటి నివారణకు హైదరాబాద్ జిల్లాలో మొదటి దశలో గత ఏప్రిల్, 2024లో రెసిడెన్షియల్ హాస్టల్స్‌లలో విద్యార్థులకు కంటి పరీక్షల నిర్వహించడం జరిగిందని అలాగే రెండో దశలో సెప్టెంబర్ 2024 నుండి డిసెంబర్ 2024 వరకు అనుబంధ పాఠశాలలో కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. పాఠశాలలో చదువుతున్న పిల్లలను కంటి పరీక్షలు చేపట్టి దృష్టి లోపాన్ని గుర్తించి నాణ్యమైన కంటి అద్దాలను అందిస్తున్నామని పిల్లలు చదువుపై ఎక్కువ దృష్టి సారించి తమ లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. జిల్లాలోని 695 పాఠశాలలో 71309 విద్యార్థులకు కంటి పరీక్షల నిర్వహించగా అందులో 8849 మందికి వక్రీభవన లోపాలతో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. అదే విధంగా 15 రోజులపాటు పునః పరీక్ష ఐదు ప్రధాన ఆస్పత్రిలో నిర్వహించడం జరిగిందని అందులో 7524 మందికీ దృష్టి లోపాలు ఉన్నాయని ధ్రువీకరించడంతో పిల్లల ఉజ్వల భవిష్యత్తు లక్ష్యంగా నాణ్యమైన కంటి అద్దాలు అందించే దిశగా అందరికీ ఆర్‌బిఎస్‌కే ద్వారా కంటి అద్దాలు అందించడం జరుగుతుందని అందులో భాగంగా జిల్లాలోని మూడు పాఠశాలలోని 40 మంది విద్యార్థులకు అందించడం జరిగిందని తెలిపారు. దృష్టిలోపం ఉన్న పిల్లలు వారు తప్పనిసరిగా కళ్లద్దాలు వాడాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటి, డిఈఓ రోహిణి, డిప్యూటీ డిఎంహెచ్ఓలు డా. సాయిబాబా, డా. మురళీధర్, డిఐఓ డా.శ్రీధర్, డిఎంఓ రాములు, కార్పొరేటర్ సరారేజ్ అహ్మద్, పాఠశాల కరస్పాండెంట్ అలీ మీర్జా, హెచ్ఎం బేబీజైనబ్, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

టియుడబ్ల్యుజె సభ్యత్వాల నమోదు ప్రారంభం

విశాలాంధ్ర - మహబూబ్‌నగర్ : తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు మహబూబునగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జోరుగా సభ్యత్వాల నమోదు కార్యక్రమం జరిగింది. మహబూబునగర్‌లోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో సోమవారం నిర్వహించిన సభ్యత్వ నమోదును జిల్లా అడ్ హాక్ కమిటీ సభ్యులు ప్రారంభించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో టియూడబ్ల్యుజెను మరింత పటిష్టపరిచేందుకు 2025-26 సంవత్సరానికి గాను పలువురు జర్నలిస్టులు తమ సభ్యత్వాలను నమోదు చేసుకున్నారు. మహబూబ్ నగర్ పట్టణంలో సభ్యత్వాలు ప్రారంభించిన మొదటి రోజునే 60 మంది జర్నలిస్టులు సభ్యత్వాలను పొందారు. టియూడబ్ల్యుజెలో చేరేందుకు జర్నలిస్టుల నుంచి విశేష స్పందన కన్పించింది. సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని రాష్ట్ర నాయకులు జర్నలిస్టు ఆహ్మద్ పాష ప్రారంభించారు. ఈనెల చివరి తేది వరకు మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని ప్రతి జర్నలిస్టు టియూడబ్ల్యుజె (ఐజెయూ)లో చేరాలని ఆయన పిలుపునిచ్చారు. మండలాల వారీగా ఉన్న గ్రామీణ జర్నలిస్టులు పాత సభ్యత్వాలను రిన్యూవల్ చేయించుకోవా లని ఇప్పటి వరకు సభ్యత్వం పొందని వారు నమోదు చేసుకోవాలని జర్నలిస్టులకు ఆహ్మద్ పాష సూచించారు. ఈ సభ్యత్వ నమోదులో జిల్లా అడ్ హాక్ కమిటీ సభ్యులు జెమిని శేఖర్, ముజీబ్, పేట వెంకటయ్య, గోకులం వెంకటేష్, తేజ వెంకట్, సీనీయర్ జర్నలిస్టులు ఐలమోని శేఖర్, పవన్ కుమార్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, చంద్రశేఖర్ గౌడ్, వెంకటేష్ గౌడ్, తిరుపతయ్య, శంకర్ గౌడ్, నరేందర్ గౌడ్, గోకులం రవి, వెంకటేష్, జయాకర్ గౌడ్, ఫోటో జర్నలిస్టులు రాజు, మధు, విడియో జర్నలిస్టులు సందీప్ రెడ్డి, నర్సింగ్ రెడ్డి, నగేష్, రామ్ కొండ, మోహన్ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈట. నర్సింహా

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు అధిక ప్రాధాన్యత, నిధులు ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు ఈటీ.నర్సింహా డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతిని పురస్కరించుకుని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని క్రికెట్ గ్రౌండ్లో చివరి రోజు ఏర్పాటు చేసిన భగత్ సింగ్ మెమోరియల్ టోర్నమెంట్‌కు వారు అతిథిగా హాజరయ్యారు. ఐదవ రోజు పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు కరచాలనం చేసి అభినందించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టి.నర్సింహా మాట్లాడుతూ క్రీడలపై పాలకుల తీరు మారాలని అన్నారు. 140 కోట్ల జనాభా ఉన్న మనదేశంలో అంతర్జాతీయ క్రీడల్లో మెడల్స్ సాధించడానికి నానా తంటాలు పడుతున్నామని, మనకన్నా చిన్న దేశాలు అంతర్జాతీయ క్రీడల్లో మెడల్స్‌ను చాలా సాధారణంగా సాధిస్తున్నారని అన్నారు. దీనికి ప్రధాన కారణం ఆయా దేశాలు క్రీడలకు ప్రాధాన్యత, అధిక నిధులు కేటాయించడమే అని వారు అన్నారు. కానీ మన దేశంలో క్రీడల్లో రాజకీయ జోక్యం, వివక్షత వంటి కారణాల వలన క్రీడలకు అన్యాయం జరుగుతుందన్నారు. క్రీడలను స్వతంత్రంగా నడిపించాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ నేత, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీ స్థాపన ద్వారా క్రీడలకు, క్రీడాకారులకు మరింత ప్రాధాన్యత ద్వారా ఒలింపిక్స్‌లో పతకాల సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. భగత్ సింగ్ పేరిట క్రికెట్ నిర్వహించిన ఏఐవైఎఫ్ బృందాన్ని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ మాజీ జాయింట్ రిజిస్ట్రార్ ఎల్లేష్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్. బోస్, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయా దేవి, సక్రిభాయి, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యారా నరేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్య ప్రసాద్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీద్, కళ్యాణ్, అనిల్, హేమంత్, బాలు, విజయ్, మహేష్ పాల్గొన్నారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన భగత్ సింగ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఖైరతాబాద్‌కు చెందిన ఏవి కళాశాల జట్టు విజేత కాగా, ఈసీఐఎల్‌కు చెందిన వసుంధర జట్టు రన్నరప్‌గా ఉన్నారు. విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

బ్యాంక్ ఉద్యోగుల సమ్మెకు ఏఐటీయుసీ మద్దతు

విశాలాంధ్ర - హైదరాబాద్ : యూన్కైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్స్ బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాక కేంద్ర ప్రభుత్వం ఏలాంటి సానుకూల చర్చలు జరపకపోవటంతో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా బ్యాంక్ ఉద్యోగుల పట్ల వ్యవహరించినం దుకు యున్కైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ సమ్మెకు నిర్ణయం చేసినందున కేంద్ర ప్రభుత్వం కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలను విడనాడి తెగేదాక లాగకుండా చర్చలు జరిపి సమ్మెను నివారించాలని ఎఐటీయుసి తెలంగాణ రాష్ట్ర సమితి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిందని ఎఐటీయుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఇందిరాగాంధీ హయాంలో బ్యాంకులను జాతీయం చేసి ప్రజలకు అందుబాటులో బ్యాంకులను ఏర్పాటు చేసి పేద, మధ్య తరగతి వారికి రుణాలు, పొదుపు చేసుకునే సౌకర్యం కల్పిస్తే నేటి ప్రభుత్వం ప్రభుత్వరంగ బ్యాంకులను ఒక్కొక్కటిగా ప్రైవేటీకరిస్తూ, బ్యాంకింగ్ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తుందని ఆయన విమర్శించారు. బ్యాంక్ ఉద్యోగులు అన్ని క్యాడర్ల లో పనిభారం తగ్గేందుకు నియామకాలు చేపట్టాల ని, వారంలో 5 రోజులు పని కొరకై చర్చించేం దుకు యున్కైటెడ్ ఫోరం బ్యాంక్ యూనియన్స్ సభ్యులు ఐబిఎను కలిసిన ఫలితం లేకపోవటంతో ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూల వైఖరి తీసుకోనందు వల్ల దేశవ్యాపితంగా ఈనెల 24, 25 తేదీలలో జరుగుతున్న బ్యాంక్‌ల సమ్మెకు ఎఐటీయుసి సంపూర్ణ మద్దతు సంఘీభావం తెలుపుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 1972 గ్రాట్యుటీ చట్టాన్ని సవరించి ఉద్యోగ విరమణ పొందిన వారికి 25 లక్షలకు మాత్రమే పెంచాలని, ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని బ్యాంక్ ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం తన విధానాలలో భాగంగా అన్ని జాతీయ బ్యాంకులను మూసివేసే ఉద్దేశంతో బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్లతో చర్చలు జరపకుండా నిర్లక్ష్యం చేస్తున్నందుకు యున్కైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్‌లో ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐబిఇఎ), ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్ (ఎఐబిఓసి), నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ (ఎన్‌సిబిఇ), ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్ అసోసియేషన్ (ఎఐబిఓఎ) ప్రధాన బ్యాంకులలో మార్చి 24,25 తేదీలలో జరుగుతున్న సమ్మెను సంపూరంగా విజయవంతం చేసేందుకు ఎఐటీయుసి శ్రేణులందరు బ్యాంక్ ఉద్యోగ సంఘాలతో కలిసి సమ్మెను విజయవంతం చేయటంలో ఎఐటీయుసి ప్రధాన పాత్ర పోషించాలని ఆయన కోరారు.



దేశవ్యాప్తంగా కుల జనగణన చేపట్టేలా అసెంబ్లీలో కృషి చేయాలి

కూనంనేనికి వినతిపత్రం అందజేసిన ధనుంజయనాయుడు

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీసీలకు స్థానిక సంస్థలలో, విద్య ఉద్యోగాలలో 42శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి ఈరోజు తెలంగాణా అసెంబ్లీలో చట్టం చేసి కేంద్రానికి పంపుతామనీ రాష్ట్ర ప్రభుత్వం చెపుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా చేపట్టబోయే జనగణనతో పాటు కులజనగణన చేపట్టి బీసీలకు వారి జనాభా నిష్పత్తి ప్రకారం చట్టసభల్లో ప్రభుత్వ, ప్రయివేటు విద్య ఉద్యోగ ఉపాధి రంగాల్లో, బడ్జెట్లో బీసీల వాటా బీసీలకు ఇవ్వాలని కోరుతూ ప్రత్యేక తీర్మానం చేసి కేంద్రానికి పంపాలనే అంశాన్ని లేవనెత్తి, ప్రత్యేక తీర్మానం చేసి కేంద్రానికి పంపే విధంగా అసెంబ్లీలో కృషి చేయాలని కోరుతూ ఎంఎల్ఏ క్వార్టర్స్‌లో సిపిఐ ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావును కలిసి బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు, సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ బిల్లు ఆమోదింపజేసి కేంద్రాన్ని ఒప్పించి షెడ్యూల్ 9లో చేర్చే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చేయాలని అందుకు రాష్ట్రంలోని అఖిలపక్ష బీసీ సంఘాలను బీసీ ఎమ్మెల్యేలను అఖిలపక్ష పార్టీల నాయకులను ఢిల్లీకి తీసుకువెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలని, రాష్ట్రానికి చెందిన బీసీ బీజేపీ ఎమ్మెల్యేలు కూడా తమతో కలిసి రావాలని దేశ వ్యాప్తంగా జరగాల్సిన జనగణన, కులగణన పట్ల బీజేపీ నాయకులు మౌనం వీడాలని ఆయన కోరారు.

కుష్టువ్యాధి అవగాహనా ర్యాలీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమాన్ని హైదరాబాద్ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ డిఎంహెచ్ఓ డాక్టర్ జె. వెంకటి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కుష వ్యాధి అవగాహనా ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశానికి స్థానిక కార్పొరేటర్ రాజమోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కుష్టు వ్యాధిని మన రాష్ట్రం నుండి, అలాగే మన దేశం నుండి పూర్తిగా పారద్రోలాంటే ముఖ్యంగా 2027 సంవత్సరం నాటికి సమాజంలో కుష్టు వ్యాధి వ్యాప్తిని పూర్తిగా అరికట్టాలని అనే దృక్పథంతో కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, ఈనెల 17 నుండి 30 వరకు ఇంటింటికి వచ్చు ఆశా కార్యకర్తలకు, ఆరోగ్య కార్యకర్తలకు ప్రతి ఒక్కరు సహకరించి తమకు గాని తమ కుటుంబ సభ్యులకుగాని వ్యాధి లక్షణాలు ఉన్నాయా? లేదా? పరీక్షించుకోవాలి అలాగే వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే బహుళ ఔషధ చికిత్స ద్వారా వ్యాధి నుండి స్వస్థత పొందవచ్చు అని రాజమోహన్ అన్నారు. డాక్టర్ జే.వెంకటి, జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ... శరీరంలో రాగి రంగు లేక గోధుమ రంగు మచ్చలు ఉండి వాటిపైన స్పర్శ లేకుండా ఉన్న ఎడల వ్యాధి ప్రాథమిక చిహ్నం అని గుర్తించాలన్నారు. కే.జ్యోతి డీపీఎంఓ, పి.రాధా కిషన్ డీపీఎంఓ, వైద్య ఆరోగ్య సిబ్బంది, కుష్టు వ్యాధి నిర్మూలన అధికారులు, పురాణపూల్, కిషన్ భాగ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఆశా కార్యకర్తలు పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

వేసవిలో నీటి సమస్య నివారణకు కృషి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు గౌతంనగర్ డివిజన్‌లోని అన్ని కాలనీలో వేసవి కాలంలో నీటి సమస్య నివారణకు చర్యలు తీసుకుంటున్నామని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఆమె గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్ మరియు ఈస్ట్ ఇందిరా నెహ్రూ నగర్ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా గత కొంత కాలంగా పవర్ బోరుకు సంబంధించిన నీటి వాల్స్ పాడైపోవడంతో నీటి సరఫరా ఇబ్బందిగా ఉందని ఆయా కాలనీవాసులు కార్పొరేట్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ 10 నీటి వాల్స్ వరమతులకు సొంత నిధులు ఇచ్చి మరమ్మతులు చేయిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాములు, బైరు అనిల్, సిద్ధి రాములు, నరహరి రావు, నగేష్ గౌడ్, మల్లేష్ యాదవ్, మర్రి శీను, సూర్య ప్రకాష్, శ్రీను, శశి, హబీబ్, పద్మ, శైలజ, లక్ష్మి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాస్మోటిక్, డైట్ చార్జీలు 40 శాతం పెంచాం

విద్యార్థుల విషయంలో రాజకీయాలు వద్దు : మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : గతంలో ఎపుడు లేని విధంగా 16 సంవత్సరాల తర్వాత ఇందిరమ్మ ప్రభుత్వంలో కాస్మోటిక్ 212శాతం పెంచగా ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా ప్రభుత్వంలో డైట్ చార్జెస్ ఏడేళ్ల తర్వాత 40 శాతం పెంచామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. సోమవారం శాసనసభలో జరిగిన డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీల పెంపు అమలపై మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. నేను కూడా ఎస్టీ గర్ల్స్ హాస్టల్ ములుగులో చదివానని, కానీ ఆనాడు అవకాశాలు తక్కువగా ఉన్నా ఎంతోమంది పట్టుదలగా చదువుకొని అత్యున్నత స్థానాల్లోకి వచ్చారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, ఓసీలలో కూడా పేదలు పెద్ద ఎత్తున హాస్టల్‌లోకి వస్తున్నారని, సరైన తిండి పౌష్టికాహారం లేకుంటే చదువుకునే టైంలో అర్ధాకలితో కడుపు మాడుతుంటే చదువుకోవడం ఇబ్బందిగా ఉంటుందని ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే పిల్లలకు మంచి పౌష్టికాహారం ఇవ్వాలన్న ఉద్దేశంతో పెద్ద ఎత్తున డైట్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు పెంచారన్నారు. పిల్లల భవిష్యత్తు మన చేతుల్లో ఉంది కాబట్టి విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. విద్యార్థుల దేశ మానవ వనరులు అని కావున వారి జీవితాలను సమున్నతంగా పెంచేందుకు వాళ్ళ నాలెడ్జ్‌ను పెంచేందుకు పూర్తిస్థాయిలో బాధ్యత తీసుకొని చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కక్షిత ఆహారం కల్తీ జరిగితే చర్యలు తీసుకుంటున్నామని, మన ఐఏఎస్ ఆఫీసర్లను నైట్ హాల్ట్ చేయిస్తున్నామని, అదేవిధంగా మంత్రులు ఎమ్మెల్యేలు కూడా హాస్టల్లో బస చేస్తున్నా రన్నారు. మంచి విద్య పౌష్టికాహారం అందించేందుకు కృషి చేస్తున్నామని, నాలుగు నెలల కాలంలో 499 కోట్లకుపైగా ఖర్చు చేశామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం బడి పిల్లలకు స్కాలర్షిప్ లను రద్దు చేసిందని, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్, నూతన విద్యా విధానమని పెద్దపెద్ద మాటలు చెప్పి విద్యార్థులకు అందే స్కాలర్షిప్‌ల విధానాన్ని రద్దు చేసిందని తెలిపారు. విద్యారంగం మీద కేంద్ర ప్రభుత్వ వైఖరి బొట్టుపసే తప్ప బోనం లేదన్నట్టుగా ఉందని దుయ్యబట్టారు. ప్రభుత్వ విద్య బలోపేతం కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పేద మధ్యతరగతి కుటుంబీకులే ప్రభుత్వం మీద ఆధారపడతారు కాబట్టి కేంద్రం కూడా రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలన్నారు. అలాగే దుబ్బాక విద్యార్థి అస్వస్థతకు గురైతే హైదరాబాద్‌లోని నీలోఫర్‌కి తరలించి చికిత్స అందిస్తున్నామని అబ్బాయి కోలుకుంటున్నారని వివరించారు. గతంలో పెద్ద ఎత్తున కలుషిత ఆహార ఘటనలు జరిగాయని, ఈ విషయంలో రాజకీయాలు వద్దు... వాళ్ళ సంరక్షణ ముఖ్యం.... వారిని బలోపేతం చేస్తున్నామన్నారు. ఆశ్రమ పాఠశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ఆశ్రమ పాఠశాలలను కాలేజీలుగా అప్గ్రేడ్ చేస్తున్నట్లు తెలిపారు. మా ప్రభుత్వము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ విద్యార్థుల విదేశీ విద్య కోసం 167 కోట్లు చెల్లించామన్నారు. పిల్లలను సరిగా పర్యవేక్షించని సిబ్బంది అధికారులపై చర్యలు ఉంటాయన్నారు. విద్యార్థులకు స్కాలర్షిప్పులు ఈ ప్రభుత్వం ఇవ్వకుంటే బాగుండు అని బిఆర్ఎస్ భావిస్తోందని ఎద్దేవా చేశారు. మేము స్కాలర్షిప్లు ఇవ్వకపోతే రాజకీయాలు చేయాలని బీఆర్ఎస్ చూస్తోందని దుయ్యబట్టారు. కానీ మేము బిఆర్ఎస్‌కు అవకాశం ఇవ్వమని, విద్యార్థులకు సంబంధించిన స్కాలర్షిప్లు, విదేశీ విద్యా నిధి పూర్తిగా చెల్లిస్తున్నమన్నారు.

మేడ్చల్ మల్కాజిగిరిలో 73 ప్రజావాణి ఫిర్యాదులు

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : కలెక్టరేట్ ప్రజావాణి లోనే కాకుండా మున్సిపాలిటీ, మండల స్థాయి కార్యాలయాలలో వచ్చే దరఖాస్తులను కూడా పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు స్వీకరించారు. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (73) ఫిర్యాదులు అందాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ ప్రజావాణిలోనే కాకుండా మున్సిపాలిటీ, మండల స్థాయి కార్యాలయాల లో వచ్చే దరఖాస్తులను కూడా వెంటనే పరిష్కరించాలని అధికారులను కలెక్టరు ఆదేశించారు. వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశిం చారు. డిఆర్ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు కాంగ్రెస్‌తోనే న్యాయం

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో బీసీ కుల గణనను చేపట్టి బీసీ బిల్లుకు ఆమోదం తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి బీసీల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని టిపిసిసి ఓబిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌంటి విక్రమ్ యాదవ్ అన్నారు. అన్ని వర్గాలకు కాంగ్రెస్ నుంచే న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం శాసన సభలో కీలక బిల్లులను బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఒక బిల్లు, ఎస్సీ వర్గీకరణ, దేవాదాయ చట్ట సవరణపై బిల్లులను ప్రవేశ పెట్టడం హర్షణీయం అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ వర్గీకరణ బిల్లును మంత్రి దామోదర రాజనర్సింహ, దేవాదాయ చట్ట సవరణ బిల్లును మంత్రి కొండా సురేఖ సభలో ప్రవేశపెట్టడం కాంగ్రెస్ పార్టీ నిబద్ధతకు నిదర్శనం అన్నారు. అలాగే తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టే బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. స్థానిక సంస్థల్లో, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 42 శాతం రిజర్వేషన్ అందిన ప్పుడు సంతోషపడతాయని అభిప్రాయపడ్డారు. నిరుద్యోగులకు యువ వికాసం పేరుతో రూ.3 లక్షలు అందజేయడం హర్షణీయమన్నారు.

కాంగ్రెస్ మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం

విశాలాంధ్ర - కొత్తూరు : కాంగ్రెస్ అంటే మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి మామిడి శ్యాంసుందర్ రెడ్డిలు అన్నారు. సోమవారం కొత్తూరు మండలంలోని పెంజర్ల గ్రామంలో షాద్‌నగర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నిధులనుండి రూ.10 లక్షలతో సిసి రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి మామిడి శ్యాంసుందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే శంకర్ నియోజకవర్గానికి చేస్తున్న అభివృద్ధి మరువలేనిదన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంజమ్మ, మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి రమేష్, కాంగ్రెస్ నాయకులు ఎర్రోళ్ల జగన్, కే.రవి, పి.యాదయ్య, ఎం.శివ, ప్రేమ్ కుమార్, ఉస్మాన్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఆదర్శ నగర్, శేరిలింగంపల్లి, ప్లాట్ నెం. 53, స.నెం. 58/1 లో మిరియాల ప్రీతం నిర్మించిన అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని 'ప్రజావాణి'లో జోనల్ కమీషనర్‌కు 'జనం కోసం' అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి ఫిర్యాదు చేశాడు. స్టేటస్కో లో నిర్మాణం చేస్తున్న సందర్భంలో కంటెంప్ట్ కూడా ఫైల్ చేసినా బిల్డర్ నిర్మాణం చేశాడని కసిరెడ్డి భాస్కరరెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. సెల్లార్, అనేక ఫ్లోర్లు నిర్మించడంతో పాటు 53 గజాలు అదనంగా కబ్జా చేశాడనే విషయం టౌన్ ప్లానింగ్ దర్యాప్తులో తేలిందని వెంటనే చర్యలు తీసుకోవాలని 'జనం కోసం' డిమాండ్ చేసింది. హెూటల్ పేరు పెట్టి హెూటల్ నడుపడం లేదని, కోర్టు కేసు దృష్ట్యా అలా నడుపుతున్నట్టు ఫేక్ హెూటల్ సృష్టించాడని 'జనం కోసం' జోనల్ కమీషనర్ కు ఫిర్యాదు చేసింది. వెంటనే ఈ అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేయాలని 'జనం కోసం' జోనల్ కమీషనర్‌ను డిమాండ్ చేశారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదు బండలో గల సీఎంసీ ఎనక్లేవ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పిం చారు. ఎక్లేవ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతులు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నామ న్నారు. అదేవిధంగా కాలనీలో అంపూర్తిగా మిగిలిపోయిన సీసీ రోడ్లను వేయాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన యుజీడీ పనులు చేపట్టాలని, మంచినీటి వ్యవస్థను మెరుగుపర్చా లని, వీధి దీపాలను వ్యవస్థను ఏర్పాటు చేయాలని, వాటర్ ట్యాంకర్లతో కాలనీలో ఏర్పడిన ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని గాంధీకి వినతిపత్రం ద్వారా కోరారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ త్వరలోనే కాలనీలో పర్యటిస్తానని, సీఎంసీ ఎనక్లేవ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీలో నెలకొన్న అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను, యుజీడీ, పనులు అతి త్వరలో చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, అన్ని రోడ్లను దశల వారిగా చెప్పటి పూర్తి స్థాయిలో రోడ్ల నిర్మాణం పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని గాంధీ తెలియచేసారు. అసంపూర్తిగా మిగిలిపోయిన యుజీడీ, రోడ్ల పనులు వెంటనే చేపట్టి ప్రజలకు ఉపశమనం కలిగేలా చూడలని అధికారులకు తెలిపారు. కాలనీలో నిత్యం తిరుగుతున్న ట్యాంకర్ల వలన ఏర్పడిన ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామని, రోడ్లపై నిలిపి కాలనీ వాసులకు, పాదచారులకు ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, కాలనీలో ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తామని తెలియచేశారు. సీఎంసీ ఎనక్లేవ్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణి సందర్భంగా ప్రజల నుండి వచ్చిన విన్నపాల పరిష్కారంలో జాప్యం చేయరాదని జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు అధికారులకు సూచించారు. సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, వేణుగోపాల్, రఘు ప్రసాద్, చంద్రకాంత్ రెడ్డి అడిషనల్ సి.సి గంగాధర్ పాల్గొని నగరం నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి విన్నపాలు స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించి అక్కడికక్కడే పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా శివ కుమార్ నాయుడు మాట్లాడుతూ నగర ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు విశేష కృషి చేయాలన్నారు. వ్యక్తిగత, సామాజిక సమస్యల పై ఎన్ని రోజుల్లో పరిష్కారం చేస్తారో అర్జీదారునికి లిఖిత పూర్వకంగా సమాధానం పంపించాలని అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 85 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 36, ట్యాక్స్ సెక్షన్ 12, ఇంజనీరింగ్ విభాగం 8, అడ్మినిస్ట్రేషన్, శానిటేషన్ విభాగాలకు మూడు చొప్పున, యు.సి.డి, ఎలక్ట్రికల్, అడ్వర్టైజ్ మెంట్, స్పోర్ట్స్ విభాగాలకు రెండు చొప్పున, సి.టి.ఓ, హెల్త్, లేక్స్, ల్యాండ్ అక్విజిషన్, ఎస్టేట్స్, వెటర్నరీ, ఆర్.టి.ఐ సిపిఆర్ఓ, హౌసింగ్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 7 ఫిర్యాదులు అందాయి. అడిషనల్ సిసిపీ, ప్రదీప్, వాటర్ వర్క్స్ జిఎం సాయి రమణ, డిప్యూటీ సి.ఈ పనస రెడ్డి హౌసింగ్, ఈ.ఈ రాజేశ్వర్‌రావు, పి.వి.రమణరావు, ఎస్.యన్.డి.పి ఈ.ఈ వెంకటేశ్వరరావు, ఏ.ఈ.ఈ బాలాజీ, చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్, వాల్యూయేషన్ అధికారి మహేష్ కులకర్ణి, యు.బి.డి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు, ఓ.ఎస్.డి అనురాధ, ఏ.ఎం.సీలు ఇతర శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్స్ పేపర్లను రీవాల్యూయేషన్ చేయాలి : కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రూప్స్ పరీక్షల పేపర్లను రీవాల్యూషన్ చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. అభ్యర్థులు అనేక అనుమానాలను వ్యక్తం చేస్తున్నారని, వాటిని ప్రభుత్వం, పబ్లిక్ సర్వీస్ కమిషన్ నివృత్తి చేయాలని సూచించారు. సోమవారం నాడు శాసన మండలిలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ గ్రూప్స్ పరీక్షలు రాసిన విద్యార్థులు పలు అనుమానాలు లేవనెత్తుతూ తెలంగాణ విద్యార్థుల జేఏసీ విద్యార్థులు తనకు పిటిషన్ అందించారని తెలిపారు. గ్రూప్ 1 జనరల్ ర్యాంకింగ్ జాబితాను వెల్లడించకపోవడం నోటిఫికేషన్ నిబంధనలకు విరుద్ధమని ఎత్తిచూపారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు వేర్వేరు హాల్ టికెట్ నెంబర్లు కేటాయించడం వల్ల కూడా విద్యార్థులు అనేక అనుమానాలను వ్యక్తం చేస్తున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షలకు దాదాపు 5 లక్షల మంది దరఖాస్తు చేస్తున్నారని, అందులో 2.3 లక్షల మంది పరీక్షలు రాశారని తెలిపారు. 13315 ఓఎంఆర్ షీట్లు ఇన్వాలిడ్ అయ్యాయని పబ్లిక్ సర్వీస్ కమిషన్ చెబుతోందని, కానీ అందుకు కారణం చెప్పకపోవడంతో విద్యార్థుల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు.

మిర్చికి రూ.25 వేలు మద్దతు ధర ప్రకటించాలి...

మరోవైపు, మిర్చి పంటకు రూ. 25 వేలు కనీస మద్దతు ధర ప్రకటించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మిర్చి ధరలు పడిపోయి రైతులు ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడానికి నిరసనగా సహచర బీఆర్ఎస్ ఎమ్మెల్సీలతో కలిసి ఎమ్మెల్సీ కవిత శాసన మండలి ఆవరణలో ఆందోళనలో పాల్గొన్నారు. ఎండు మిర్చి దండలను మెడకు వేసుకొని ఎమ్మెల్సీలు విన్నూత రీతిలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ మిర్చి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడుతుంటే ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరించడం సరికాదని సూచించారు. నాఫెడ్, మార్క్ ఫెడ్ వంటి సంస్థ ద్వారా ప్రభుత్వమే మిర్చి పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల ముందు ఓ మాట ఇపుడు ఓ మాట

ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చేందుకు అనేక మాటలు, హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇపుడు మరో మాట మాట్లాడుతుందని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. సోమవారం శాసనమండలి వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదే పదే మేం ఇచ్చిన హామీలు మ్యానిఫెస్టో ఖురాన్, బైబిల్, భగవద్గీతతో సమానం అని చెప్పారని గుర్తు చేశారు. కళ్యాణ మస్తు పథకం ద్వారా లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని అన్నారని తెలిపారు. మహిళ వ్యతిరేక ముఖ్యమంత్రిగా చరిత్రలో రేవంత్ రెడ్డి నిలుస్తాడన్నారు.

ట్రేడ్ యూనియన్ నాయకులు సత్యనారాయణ మృతి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : తొలి దశ తెలంగాణ ఉద్యమకారుడు, ట్రేడ్ యూనియన్ నాయకులు జాల సత్యనారాయణ యాదవ్ (79) మృతి చెందారు. ఉమ్మడి నల్గొండ జిల్లా తుమ్మలగూడెం ఇంద్రపాల నగరంలో జన్మించారు. ఆయన సఫిల్‌గూడలో నివాసం ఉంటున్నారు. జాల సత్యనారాయణ యాదవ్ గతంలో విజయ డైరీ కార్పొరేషన్‌లో సీనియర్ మేనేజర్‌గా, ఐఎన్‌టియుసి విజయ డైరీ యూనిట్‌కు నాయకత్వం వహించి తొలి దశ తెలంగాణ ఉద్యమంలో 1969 వీరోచితంగా పోరాడిన ఘనత సత్యనారాయణ యాదవ్‌కి దక్కుతుందని ఆయన కుటుంబ సభ్యులు తెలియజేశారు. కూతురు విజయనిర్మల, కుమారులు జే.ప్రేమ్, జే.విజయనంద్ యాదవ్, మలిదశ తెలంగాణ ఉద్యమంలో, డేరి అభివృద్ధి కార్పొరేషన్ కార్మికుల హక్కులకై నిరంతరం పోరాడిన జె.సత్యనారాయణ యాదవ్ మరువలేనివని హైదరాబాద్ జిల్లా టి.జి.ఓ అధ్యక్షులు ఎం.బి.కృష్ణ యాదవ్ కొనియాడారు. ఎం.గోపాల్ యాదవ్. ఎం.బి విజయకుమార్ యాదవ్. ఎం.వెంకటేశ్వర్లు యాదవ్ తదితరులు పాల్గొని నివాళ్ళు అర్పించారు.

జాయింట్ ప్రిజర్వేషన్ ప్రోగ్రామ్‌ని ప్రారంభించిన అపోలో

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : శస్త్ర చికిత్స అవసరం లేకుండానే కీళ్ల నొప్పులు మాయం చేసే కార్యక్రమాన్ని అపోలో ఆసుపత్రి యాజమాన్యం ఘనంగా ప్రారంభించింది. జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలో సోమవారం ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహసంగా జరిగింది. కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి ఇది ఒక వరమనే చెప్పుకోవచ్చు. బాధితుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శస్త్రచికిత్స అవసరం లేకుండానే దీనిని రూపొందించారు. కీళ్ల నొప్పులు, ఆర్థరైటిస్, వాపు సమస్యలు, స్నాయువు గాయాలతో బాధపడుతున్న రోగుల అవసరాల తీర్చేలా డిజైన్ చేశారు. అసౌకర్యం కలగకుండా, శస్త్ర చికిత్స అవసరం లేకుండానే నొప్పులను తగ్గించే విధంగా దీనిని రూపొందించారు. జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీత రెడ్డి మాట్లాడుతూ, జాయింట్ ప్రిజర్వేషన్ ప్రోగ్రామ్ రోగికి సౌకర్యవంతంగా ఉండే చికిత్స. కీళ్ల నొప్పులతో బాధపడు తున్న అన్ని వయస్కుల వారికి ప్రయోజనం చేకూర్చేలా దీన్ని రూపొందిం చారు. ఇందులో భాగంగా టైలర్డ్ అడ్వైజ్, ట్రీట్మెంట్, థెరపీస్, రీహాబిలిటేషన్ , పోషకాహారం, అవసరమైన ప్రత్యామ్నాయ చికిత్సలు- '3 టిఎస్'పై దృష్టి పెడుతుంది. కీళ్ల పనితీరును మెరుగుపరచడం,పూర్తి కీలు మార్పిడి అవసరం లేకుండా సమస్య నివారించడంపై మేము దృష్టి సారించాం అని అపోలో హాస్పిటల్స్ చీఫ్ జాయింట్ రీప్లేస్‌మెంట్, ఆర్థోస్కోపిక్ సర్జన్ డాక్టర్ కెజె రెడ్డి అన్నారు. ఆర్థోస్కోపీ, స్పోర్ట్స్ మెడిసిన్ కన్సల్టెంట్ డాక్టర్ రవితేజ రుద్రరాజు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం అత్యాధునిక రీ జెనరేటివ్ చికిత్సలను సమగ్రమైన రీహాబిలిటేషన్, పోషకాహార పద్ధతులతో మిళితం చేసి సమగ్ర చికిత్స మార్గాన్ని అందిస్తుంది. తద్వారా కీళ్ల సమస్యలకు ముందుగానే ప్రభావవంతమైన చికిత్స అందేలా తోడ్పడుతుంది అని అన్నారు. జాయింట్ ప్రిజర్వేషన్ ప్రోగ్రాంలో భాగంగా ప్లేట్‌లెట్-రిచ్ ప్లాస్మా చికిత్స, అత్యాధునిక స్టెమ్ సెల్ వినియోగం వంటి మార్గదర్శక పునరుత్పత్తి చికిత్సలతో పాటు అధునాతన ఆర్థోబయోలాజిక్ చికిత్సలను ఉపయోగించడం ద్వారా, రోగులు తమ కీళ్ల పనితీరును మెరుగ్గా నిర్వహించుకోవడానికి అవకాశం కల్పిస్తారు. అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీత రెడ్డి, సిడ్నీ రాయల్ ప్రిన్స్ ఆల్ఫ్రెడ్ హాస్పిటల్ ఆర్థోపెడిక్ సర్జన్, ఆర్థోస్కోపిక్, మోకీళ్ల మార్పిడి నిపుణులు డాక్టర్ బ్రెట్ ఫ్రిట్ష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు అందజేసిన అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యార్థులకు కంటి అద్దాలను అదనపు కలెక్టర్ అందజేశారు. రెవెన్యూ శాఖ 40, ఇతర శాఖలకు 32, మొత్తం 72 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహాశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు నిదర్శనం ప్రజావాణి కార్యక్రమం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : తెలంగాణలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి దిశానిర్దేశంలో అధికారులు అభివృద్ధి, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. సోమవారం హాఫీజ్ పెట్ డివిజన్ పరిధిలోని హెచ్.ఎం.డబ్లు.ఎస్.ఎస్.బి కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్ని శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని గచ్చిబౌలి, కొండాపూర్, లింగంపల్లి, హాఫీజ్ పెట్, మాదాపూర్ డివిజన్ పరిధిలో తమ దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన మంజీర పైప్ లైన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజ పైప్ లైన్ పనులపై జీఎం, డిజిఎం ఇతర అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమానికి భారీగా తరలివస్తున్న ప్రజలు, సత్వరమే సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజలు, బస్తి నాయకులు పాల్గొన్నారు.

విద్యా రంగానికి 20శాతం బడ్జెట్ కేటాయించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టబోయే రాష్ట్ర బడ్జెట్ లో విద్య రంగానికి 20 శాతం బడ్జెట్ కేటాయించాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆప్ రాష్ట్ర కార్యాలయం నుండి విడుదల చేసిన ఒక ప్రకటనలో ధనిక రాష్ట్రంగా చెప్పుకునే తెలంగాణ విద్య రంగంలో దేశంలో చివరి స్థానంలో ఉండడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ ప్రాముఖ్యతను గుర్తించా లని, ఈ బడ్జెట్ లో విద్యకు అధిక నిధులు కేటాయించవలసిన అవసరం ఉంద న్నారు. ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల మూసివేతను తక్షణమే నిలిపివేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల సమస్యలను పరిష్కరించి, మౌలిక సౌకర్యాలు కల్పించి, బలోపేతం చేసి, ఖాళీగా ఉన్న టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్‌ల పోస్టులను భర్తీ చేయాలనీ కోరారు. రాష్ట్రంలో 90 శాతం పైగా ఉన్న అట్టడుగు వర్గాలు అభివృద్ధి పథంలో పయనించాలంటే విద్యకు అధిక నిధులు కేటాయించి వారి పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రేయింబర్సుమెంట్ సైతం వెంటనే చెల్లించాలని అలాగే రాష్ట్ర విద్య కమిషన్ రిపోర్ట్‌ను వెంటనే అమలు చేయాలనీ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు.

కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకం

విశాలాంధ్ర-దుండిగల్: కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకమని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గం 130 - సుభాష్ నగర్ డివిజన్ కృషి కాలనీ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, కార్యవర్గ సభ్యులు కుత్బుల్లాపూర్ నందు ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో కీలకమని, కాలనీ అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఆయన తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ వివేకానంద నూతన సభ్యులను శాలువాలు, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్, రాజ్‌కుమార్, మాజీ అధ్యక్షుడు బైరీష్ గౌడ్, రామ్‌రెడ్డి, మైస గౌడ్, కిషోర్ కుమార్, పూర్ణచందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

విశాలాంధ్ర- ఆమనగల్లు : పాఠశాల దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని ఆమనగల్లు మున్సిపాలిటీ 15వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ అన్నారు. సోమవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డబ్బుతో సాధ్యం కాని ఉన్నత పదవులను చదువుతో సొంతం చేసుకోవచ్చునని తెలిపారు. పరీక్షలంటే భయాన్ని వీడాలని, ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ మార్కులు సాధించాలని తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన వారికి మొదటి బహుమతి 5116, రెండవ బహుమతి 2016 అందజేస్తానని లక్ష్మణ్ హామీ ఇచ్చారు. అనంతరం పదవి విరమణ పొందిన విద్యవతమ్మకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

In the Court of the II AddL. District Judge at Amalapuram
A.S.No.46 of 2023

Between:
PETITIONER/APPELLANT :: Gollapalli Nalini Muthaiah
And
RESPONDENTS :: Myla Lavanya Rani and others
6th Respondent :: Dr Mohammad Azeez Ahmed S/o Sk.Hyder, Medical Practitioner, Khammam, Khammam District, State of Telangana.

Take notice that the above Appeal matter filed against you and others and you are arrayed as 6th Respondent and the matter is posted to 21-03-2025 for your appearance. As you are not responding to the Appeal notices issued by the Hon'ble Court several times hence the Hon'ble Court ordered notice by way of this Publication.

You are hereby informed to appear before the Hon'ble II Addl. District Judge Court, Amalapuram personally or through Advocate on 21-03-2025 from 10 AM onwards else, the Hon'ble court will proceed in the matter as per law.

N.V.S.S.P.Rama Mohan, Advocate, Tanuku. Cell: 99088 22433

ఇళ్ల స్థలాలు, సాగు భూములు పంచే వరకు పోరు

జల్లి విల్సన్, సీహెచ్ కోటేశ్వరరావు, ఆవుల శేఖర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: గ్రామీణ కష్టజీవులకు ఇళ్ల స్థలాలు, సాగు భూములు దక్కేవరకు పోరాటాలు ఆగవని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు గుంటూరులోని మల్లయ్యలింగం భవన్‌లో సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షతన రెండోరోజు సోమవారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి గ్రామీణ కష్టజీవులకు సాగుభూములు, ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాజకీయ పెద్దల చేతుల్లోకి ప్రభుత్వ భూములు పోతున్నా చోద్యం చూస్తోందన్నారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులు అమలు చేస్తే పేదలకు ఇళ్ల స్థలాలు, సాగుభూములు అందుతాయని, అయితే ఆ సిఫారసులను చెత్త బుట్టలో వేశారని మండిపడ్డారు. ప్రభుత్వం పంపిణీ చేయకపోతే ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో భూపోరాటాలు చేసి పేదలకు పంచుతామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు పూర్తి అయినప్పటికీ సూపర్ సిక్స్ హామీల అమలు అతీగతీ లేదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీపైనా కాలయాపన చేస్తున్నట్లు ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రంలో 2 లక్షల పెన్షన్లు తొలగించారని, పేదల సంక్షేమ పథకాల్లో కోత విధించడానికి సర్వే చేస్తున్నారని విమర్శించారు. పెరుగుతున్న వలసన నివారణకు తీసుకుంటున్న చర్యలు శూన్యమని, ఉపాధి హామీని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఉపాధి కూలీలకు దాదాపు 10 వారాల నుంచి పెండింగ్ బకాయిలు ఉన్నాయన్నారు. ఇందులో మంత్రి పవన్ కల్యాణ్ నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. సనాతన ధర్మంపై గల ఆసక్తి ఉపాధి కూలీల బకాయిలపై లేదని విమర్శించారు. ఇప్టా జాతీయ కార్యదర్శి గని మాట్లాడారు. తీర్మానాల ఆమోదం

ఉపాధి హామీపై అన్ని జిల్లాల్లో వర్క్‌షాప్‌లు నిర్వహించాలని, అటవీ భూముల్లో వన సంరక్షణ సమితులు ఏర్పాటు చేసి... అందులో వచ్చే ఫలసాయం సాగుదారులకు అందించాలని సమావేశం తీర్మానించింది. ఉపాధి హామీ మేట్ల రాష్ట్ర సదస్సు మే చివరి వారం కడపలో నిర్వహించాలని, ఉపాధి హామీ పని ప్రదేశాలను జిల్లా నాయకులు సందర్శించాలని, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానం చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘంలో అహర్నిశలు పనిచేసి అసువులు బాసిన అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జూన్ 1న విజయవాడలో నిర్వహించాలన్న తీర్మానాన్ని ఆమోదించారు. గ్రామ సంఘాలు ఏర్పాటు, సభ్యత్వ నమోదు చేయాలని తీర్మానించారు. పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల ఇళ్ల స్థలాల కోసం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ఏప్రిల్ చివరి వరకు గ్రామ సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల ముందు ఆందోళనలు చేయాలని, జూన్ 10న భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ పిలుపును జయప్రదం చేయాలని తీర్మానించారు. తీర్మానాలను ఆవుల శేఖర్ వెల్లడించారు. రాష్ట్ర నాయకులు బండి వెంకటేశ్వరరావు, బి.కేశవరెడ్డి, సీహెచ్ ప్రభాకర్, సి.సుబ్రహ్మణ్యం, చిలుకూరు వెంకటేశ్వరరావు, కాటోతు ఈశ్వరరావు, ఆర్.విజయ, కలిశెట్టి వెంకట్రావు, నాగమణి, ఎస్డీ మౌలాలి, పండుగోలమని, ఉప్పెన నరసింహారావు, బి.కృష్ణ, నాగులు మీరా, కదిరప్ప, ప్రభుదాస్, రామారావు, రామకృష్ణ, వసంతరావు, రామమూర్తి, తులసీ రాజన్, త్రిమూర్తులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుతో పాటు పరిహారం

పోలవరం నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇస్తాం

జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోలవరం ప్రాజెక్టు తొలిదశ ఆర్‌అండ్ ఆర్‌ను వచ్చే ఏడాది(2026) జూన్ కల్లా పూర్తి చేస్తామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. 75 కాలనీలకుగాను 49 కాలనీలు నిర్మాణంలో ఉన్నాయని, సత్వరమే పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నట్లు చెప్పారు. పోలవరం ఎత్తు తగ్గింపుపై శాసనమండలిలో వైసీపీ సభ్యుడు కుంభా రవిబాబు సోమవారం అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసినట్లే... నిర్వాసితులను సైతం జగన్ నిలువునా ముంచేశారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లలో ఒక్క రూపాయి నష్టపరిహారం గానీ, కాలనీల నిర్మాణానికి అరబస్తా సిమెంట్ పనులు గానీ చేయలేదని ఆరోపించారు. ఐదేళ్లు నిర్వాసితులను పట్టించుకోకపోవడంతో తమను తెలంగాణలో కలిపేయాలని నిర్వాసితులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేశారని మంత్రి గుర్తుచేశారు. 2017లో రూ.800 కోట్లు జమ చేసిన చంద్రబాబు ప్రభుత్వం... మళ్లీ ఏడేళ్ల తరువాత నిర్వాసితుల కష్టాలు తీర్చేలా నిర్వాసితులకు సంక్రాంతి కానుక అందించారని గుర్తుచేశారు. ఎలాంటి హంగామా లేకుండానే ఒకే విడతగా రూ.800 కోట్లు నిర్వాసితుల ఖాతాల్లో జమ చేసింది కూటమి ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక పోలవరం నిర్వాసితుల వైపు కన్నెత్తి చూడకపోగా పునరావాస కాలనీల్లో ఒక్క ఇంటిని పూర్తి చేయలేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు ఇచ్చిన రూ.3,385 కోట్ల రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రాజెక్టు నిర్మాణానికి గానీ, నిర్వాసితులకుగానీ అందించకుండా దారి మళ్లించి... దోచుకున్నారన్నారు. 2019 ఎన్నికలకు ముందు పోలవరం ఎత్తు గురించి ఎక్కడా ప్రస్తావన లేదని, జగన్ హయాంలోనే పోలవరం ప్రాజెక్టును 41.15 మీటర్లు, 45.72 మీటర్లుగా విభజించి రెండు విడతలుగా చేశారని మంత్రి తెలిపారు. పోలవరం ఎత్తు ఎందుకు తగ్గించారో వైఎస్ జగన్‌ను వైసీపీ సభ్యులు నిలదీయాలన్నారు. 45.72 మీటర్లకు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్లకు నిర్మిస్తే 96,660 కుటుంబాలు ముంపునకు గురవుతాయని గుర్తించామన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి భూములు, ఇళ్లు త్యాగం చేసిన వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని చెప్పారు. పునరావాస కాలనీల నిర్మాణ పనులు వేగవంతం చేసి... 2026 జూన్ నాటికి నిర్వాసితులకు అప్పగిస్తామని మంత్రి తెలిపారు.

వైసీపీపై బురదజల్లే యత్నం

మండలి ప్రతిపక్ష నేత బొత్స

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ పాలనపై బురద చల్లేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. అసెంబ్లీ బయట మీడియా పాయింట్‌లో వైసీపీ ఎమ్మెల్సీలతో కలిసి సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన స్కాంలపై చర్చించాలంటూ అధికారపక్షం పట్టుబట్టడం వెనుక కుట్ర దాగి ఉందని అన్నారు. అసలు విచారణే జరగకుండా కేవలం ఆరోపణలను స్కామ్‌లుగా చిత్రీకరించి వైసీపీ పాలనపై విషం చిమ్మేందుకు ప్రయత్నించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేనిది ఉన్నట్లుగా... ఉన్నది లేనట్లుగా చిత్రీకరించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, అలాగే ఈ రోజు స్కామ్‌లపై చర్చ అంటూ మండలిలో అధికారపక్షం హంగామా చేసిందని మండిపడ్డారు. రాష్ట్ర విభజన తరువాత నుంచి ఇప్పటి వరకు అంటే 2014-24 వరకు జరిగిన స్కామ్‌లపై చర్చించాలని వైసీపీ ప్రభుత్వాన్ని కోరామన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం కేవలం వైసీపీ పాలన అంటే 2019-24 వరకు మాత్రమే చర్చకు సిద్ధమని ప్రకటించిందని, అసలు ఐదేళ్ల పాలనలో జరిగిన వాటిపైన కూటమి ప్రభుత్వం ఈ 10 నెలల్లో అనేక ఆరోపణలు మాత్రమే చేసిందని చెప్పారు. ఈ ఆరోపణలపై దర్యాప్తు కూడా పూర్తి కాలేదని, నిరూపణ జరగలేదని, అలాంటప్పుడు వైసీపీ పాలనలో స్కామ్‌లు అంటూ మీరు చేసిన తప్పుడు ఆరోపణల పైన సభలో ఎలా చర్చిస్తారని అధికారపక్షాన్ని నిలదీశామన్నారు. 2014-19 మధ్య తెలుగుదేశం పాలనలో అనేక కుంభకోణాలు జరిగాయని, వాటిపై కేసులు కూడా నమోదయ్యాయని, దర్యాప్తు కూడా పూర్తయిందని గుర్తు చేశారు. వాటిపై మాత్రం చర్చకు వచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించడం లేదని తెలిపారు. ఇది కూటమి ప్రభుత్వ ద్వంద్వ వైఖరి కాదా?, దీనికి నిరసనగా మండలి నుంచి వాకౌట్ చేశామని బొత్స చెప్పారు.

ఫడ్నవీస్ క్రూరుడు

కాంగ్రెస్ మండిపాటు

ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మతాన్ని సాధనంగా వినియోగించుకుంటున్నారని, ఆయన ఔరంగజేబు వంటి క్రూరుడని ఆ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కల్ విమర్శించారు. 'ఔరంగజేబు క్రూరమైన పరిపాలకుడు. అతడు తన సొంత తండ్రిని జైల్లో పెట్టాడు. ముఖ్యమంత్రి ఫడ్నవీస్ కూడా అటువంటి క్రూర స్వభావం గలవారే. మతం ఆధారంగా ప్రజల్లోకి వెళ్లడానికి ప్రయత్నిస్తాడు. కాబట్టి వీరిద్దరి పరిపాలన ఒకేవిధంగా ఉంది' అని హర్షవర్ధన్ తీవ్ర విమర్శలు చేశారు. ఫడ్నవీస్‌ను ఔరంగజేబుతో పోల్చడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. రాష్ట్ర రాజకీయ సంస్కృతికి ఉన్న గుర్తింపును అవమానిస్తూ కాంగ్రెస్ మరింత దిగజారిపోయిందని బీజేపీ మహారాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాంకులే దుయ్యబట్టారు. ఔరంగజేబుతో ఫడ్నవీస్‌ను పోల్చడం ఆ పార్టీకి ఉన్న బాధ్యతారాహిత్యాన్ని, పిల్ల చేష్టలను తెలియజేస్తున్నాయని అన్నారు. దీనివల్ల ప్రజల్లో పార్టీకి ఉన్న కొద్దిపాటి మద్దతు కూడా పోతుందని పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీ జీవిత కథతో రూపొందిన 'ఛావా' చిత్రం విడుదలైన అనంతరం... మొఘల్ చక్రవర్తి ఔరంగ జేబును కీర్తిస్తూ మహారాష్ట్రకు చెందిన సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే అబు అసీమ్ నజ్మీ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ముఖ్యంగా శంభాజీ మహారాజ్‌ను వేధించిన ఔరంగజేబును ప్రశంసించ డంపై అధికార కూటమి తీవ్రస్థాయిలో మండిపడింది.

బీజేపీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

బెంగళూరు: దొంగ బంగారం రవాణా కేసులో అరెస్టయిన కన్నడ నటి రన్యారావు తన ప్రైవేట్ భాగాల్లో బంగారం దాచి అక్రమ రవాణా చేసిందంటూ బీజాపూర్ సిటీ బీజేపీ ఎమ్మెల్యే బసంగౌడ పాటిల్ యత్నాల్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దొంగ బంగారం వ్యవహారంలో రాష్ట్ర మంత్రుల ప్రమేయం కూడా ఉందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... 'ఆమె తన శరీరమంతా బంగారంతో కప్పేసింది.

నూతన కౌలుచట్టం తేవాలి

- గుర్తింపు కార్డులు జారీజేయాలి
- హామీలేని పంట రుణాలు ఇవ్వాలి
- కలెక్టరేట్ల ఎదుట కౌలురైతుల సంఘం ఆందోళన
- రైతు సంఘం నేతల సంఘీభావం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కౌలు రైతుల సంక్షేమ కోసం నూతన సమగ్ర కౌలు చట్టం తీసుకురావాలని, భూ యజమాని ప్రమేయం లేకుండానే గుర్తింపు కార్డులు జారీ చేయాలని, హామీలేని పంట రుణాలివ్వాలనే తదితర డిమాండ్లపై రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతుల సంఘం సోమవారం ఆందోళనలు నిర్వహించింది. అనంతరం కలెక్టరేట్లలోని అధికారులకు సంఘం నేతలు వినతి పత్రాలను అందజేశారు. ఈ ఆందోళనలకు ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కలెక్టరేట్‌లో స్పందన సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్నీడి యలమందారావు, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల డేవిడ్, ఉపాధ్యక్షులు పెయ్యల వెంకటేశ్వరరావు తదితర ప్రతినిధి బృందం ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు. అంతకంటే ముందుగా కౌలు చట్టం తీసుకురావటం జాప్యాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. పి.జమలయ్య మాట్లాడుతూ గుర్తింపు కార్డులు పొందిన వారికి రిజర్వ్ బ్యాంకు ఆదేశాల ప్రకారం సాగు చేస్తున్న భూమి దామాషా ఆధారంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రూ.2 లక్షల వరకు హామీలేని పంట రుణాలు జారీ చేయాలని అధికారులకు విన్నవించారు. నంద్యాల జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరయిన ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.కాటమయ్య మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డులు పొందలేని కౌలు రైతులకు కౌలు మిత్ర గ్రూపులు ఏర్పాటు చేసి వడ్డీ లేని పంట రుణాలు అందించాలని కోరారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సోమన్న, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు పి.నరసింహులు, రైతు సంఘం సహాయ కార్యదర్శి కె.భాస్కర్ తదితరులు హాజరయ్యారు. ఏలూరు జిల్లాలో ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతుల సంఘం అధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొంత కృష్ణ మాట్లాడుతూ భూమి లేని కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు పెట్టుబడి సాయం అందాలంటే కౌలు చట్టం అవసరమని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా సీపీఐ కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, రైతుసంఘం ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, తక్కెళ్లపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.తిమ్మయ్య, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంపన్నగౌడ్ పాల్గొన్నారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం మాట్లాడుతూ జిల్లాలో పండిన కందులు, మినుములు, శెనగలు తదితర అపరాలను విక్రయించుకోవాలంటే కౌలు గుర్తింపు కార్డులు తక్షణం అవసరమని, గుర్తింపు లేకపోవడం వల్ల తక్కువ ధరలకు పంటలు అమ్ముకుని నష్టపోతున్నారన్నారు. అనంతపురం జిల్లాలో ధర్నా నిర్వహించి స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కౌలు రైతుల సంఘం జిల్లా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీటీ రామాంజనేయులు, నీళ్లపాల రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ రాము తదితరులు మాట్లాడుతూ జిల్లాలో దేవాదాయ, ధర్మాదాయ భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలంటే అందుకు నూతన సమగ్ర చట్టం అవశ్యకత ఉందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో కలెక్టరేట్ దగ్గర ధర్నా నిర్వహించి, అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. సమగ్ర కౌలు చట్టం లేకపోవడం వల్ల ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించలేకపోతున్నామని చెప్పారు. కౌలు రైతుల సంఘం పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు తాటిపాముల రాంబాబు, జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వైవీ ఆనంద్, జిల్లా కౌలు రైతుల సంఘం నాయకులు ఎం.సీతారాంప్రసాద్, వంకా అప్పారావు, బాషా తదితరులు పాల్గొన్నారు. కడప జిల్లా కలెక్టర్‌ను కలిసి సంఘం నేతలు వినతిపత్రం ఇచ్చారు. జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు టెక్కోలి మనోహర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వైవీ సుదర్శన్ రెడ్డి, కడప జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పాతిరెడ్డి భాస్కర్, కౌలు రైతుల సంఘం నాయకులు శంకర్ రెడ్డి, బాలచంద్రరాయుడు తదితరులు పాల్గొన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతుల బాధిత కుటుంబాలకు తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన ధర్నాలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పర్వతనేని లక్ష్మాధికారి, జిల్లా కౌలు రైతుల సంఘం నాయకులు గరికపాటి బ్రహ్మయ్య, జి.పెద్దారావు, కాటం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గుంటూరు జిల్లాలో జరిగిన ధర్నాలో కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ జగన్నాథం, కంజుల విఠల్‌రెడ్డి, సంఘ నాయకులు పర్చూరు స్టాలిన్ పాల్గొన్నారు. ప్రకాశం జిల్లాలో మార్కాపురం సబ్‌కలెక్టర్‌కు సంఘం నేతలు పి.వెంకట కొండయ్య, ఆ సంఘ జిల్లా నాయకులు ఎస్.కె.ఖాసీమ్, ఆదినారాయణ, పెద్ద సిద్దయ్య తదితరులు వినతిపత్రం ఇచ్చారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి వినతిపత్రం అందజేశారు. టమాటా పంట సాగు చేస్తున్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. సత్యసాయి జిల్లాలో జరిగిన ధర్నాలో జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షులు చౌడప్ప, వేమనారాయణ, రామయ్య, మల్లప్ప, చంద్ర తదితరులు పాల్గొని, కౌలు రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నినదించారు.

ప్రజలకు అండగా జనసేవాదళ్

డాక్టర్ కె.నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశంలో మతోన్మాదశక్తులు పెరిగిపోతున్న నేపథ్యంలో లౌకిక రాజ్య పరిరక్షణ, మతసామరస్యం కోసం జనసేవా దళ్ పాటుపడాలని, వరదలు, తుపాను సమయాల్లో ప్రజలకు అండగా ఉండాలని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పిలుపునిచ్చారు. విజయవాడ దాసరి భవన్‌లో జనసేవా దళ్ రాష్ట్ర కన్వీనర్ జి.ఈశ్వరయ్య అధ్యక్షతన సోమవారం సమావేశం జరిగింది. నారాయణ మాట్లాడుతూ జన సేవాదళ్ కార్యకర్తలు ప్రజలకు సేవ చేసేందుకు ముందుండాలన్నారు. సీపీఐ జాతీయ మహాసభల సందర్భంగా దేశవ్యాప్తంగా లక్షలాదిమంది జనసేవాదళ్ క్యాంపుల ద్వారా శిక్షణ ఇచ్చి... ఢిల్లీలో వేలాది మందితో కవాతు నిర్వహిస్తామని వివరించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ జన సేవాదళ్ రాష్ట్రస్థాయి శిబిరాన్ని ఏప్రిల్ మొదటి వారంలో మంగళగిరిలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. సీనియర్ ఇన్‌స్ట్రక్టర్లు నార్ల వెంకటేశ్వరరావు, పీఎల్ వెంకటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ఎస్.లెనిన్ బాబు, కె.శివారెడ్డి, మురళి, పరుచూరి రాజేంద్ర, సంతోశ్ కుమార్, యుగంధర్, నాసర్ జీ, వల్లరాజు, హేమశంకర్, సింగరకొండ, శశి కుమార్ పాల్గొన్నారు.

మోదీ పాలనలో 'రైల్వే' అధ్వానం

సీపీఐ ఎంపీ సునీర్

న్యూఢిల్లీ: భారతీయ రైల్వేల పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని, ప్రయాణికుల భద్రతను గాలికొదిలేసిందని సీపీఐ ఎంపీ పీపీ సునీర్ విమర్శించారు. సోమవారం ఆయన రాజ్యసభలో మాట్లాడుతూ... బీజేపీ గత పదేళ్ల పాలనలో భారత రైల్వేల పరిస్థితి అధ్వానంగా తయారైందని ఆందోళ వ్యక్తం చేశారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో రైల్వే మంత్రిత్వ శాఖ పనితీరుపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2017లో ప్రత్యేక రైల్వే బడ్జెట్‌ను రద్దు చేయడాన్ని చారిత్రక తప్పిదంగా అభివర్ణించారు. ఈ చర్య పార్లమెంటరీ పర్యవేక్షణను బలహీనపరిచిందని, రైల్వేలు తగినంత జవాబుదారీతనం లేకుండా పోయాయన్నారు. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన విషాదకర తొక్కిసలాటను ఈ నిర్లక్ష్యానికి భయంకరమైన గుర్తుగా ఆయన పేర్కొన్నారు. దీనికి మూల కారణాలను పరిష్కరించడానికి బదులుగా, రైల్వే మంత్రిత్వ శాఖ ఈ సంఘటన యొక్క వీడియోలను తొలగించడంపై దృష్టి పెట్టడం బాధాకరమన్నారు. గత సంవత్సరంలో 40 రైలు ప్రమాదాలు జరగ్గా... 313 మంది ప్రాణాలు కోల్పోయారని, 744 మంది గాయపడ్డారని సునీర్ పేర్కొన్నారు. భద్రతా మెరుగుదలల కోసం ఉద్దేశించిన రాష్ట్రీయ రైలు సంరక్షణ కోష్ నుండి నిధులు దుర్వినియోగమయ్యాయని... ఈ నిధులు ఫుట్ మసాజర్లు, ఆఫీస్ ఫర్నిచర్ వంటి విలాసాల కోసం వృథా చేశారన్నారు. ఓ పక్క సాధారణ ప్రయాణీకులు రద్దీగా ఉండే, రక్షణ లేని కోచ్‌లలో ప్రయాణిస్తుండగా... బీజేపీ ప్రభుత్వం మాత్రం అట్టహాసంగా ప్రారంభోత్సవాలపై దృష్టిపెడుతోందని దుయ్యబట్టారు. రైల్వేల్లో భద్రతకు సంబంధించి కీలకమైన పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇటీవల పెండింగ్‌లో ఉన్న నియామకాలను రద్దు చేయడం వ్యవస్థను మరింత బలహీనపరిచిందన్నారు. భారతీయ రైల్వేలో భద్రత, పారదర్శకత, జవాబుదారీతనం పునరుద్ధరించడానికి తక్షణ చర్య తీసుకోవాలని సీపీఐ పక్షాన డిమాండ్ చేశారు.

24 నుంచి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం

విశాలాంధ్ర- తిరుపతి: తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం కల్పించేందుకు అనుమతించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. తెలంగాణ నేతల సిఫార్సు లేఖలపై వీఐపీ బ్రేక్ దర్శనాలకు ఆది, సోమవారం మాత్రమే లేఖలు స్వీకరిస్తామని తెలిపింది. బుధవారం, గురువారం రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనాలకు లేఖలు అనుమతిస్తామని స్పష్టం చేసింది. నిర్దేశిత రోజుల్లో ప్రజాప్రతినిధులకు సంబంధించి ఒక లేఖ మాత్రమే (ఆరుగురు భక్తులకు మించకుండా) స్వీకరిస్తామని వెల్లడించింది. ఈ విధానం ఈ నెల 24 నుంచి అమలు చేయనున్నట్లు టీటీడీ పేర్కొంది. ఇప్పటివరకు సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనానికి ఆదివారం ఏపీ ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు స్వీకరిస్తున్నారు. ఇకపై శనివారం (ఆదివారం దర్శనం కోసం) స్వీకరించనున్నట్లు వివరించారు. తిరుమలలో అందుబాటులో ఉన్న వసతి సౌకర్యాలు, ఇతర భక్తుల దర్శన సమయాలను దృష్టిలో పెట్టుకొని, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. మార్పులను భక్తులు దృష్టిలో ఉంచుకొని దేవస్థానానికి సహకరించాలని కోరింది.

19 మంది మావోయిస్టుల లొంగుబాటు

విశాలాంధ్ర-చింతూరు: చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో 19 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో తొమ్మిది మందిపై మొత్తం రూ.28 లక్షల రివార్డు ఉంది. పోలీసు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సీనియర్ అధికారుల ముందు వీరు లొంగిపోయారు. మావోయిస్టు భావజాలంపై నిరాశ చెందడం, సీనియర్ క్యాడర్లు అమాయక గిరిజనులను దోపిడీ చేయడం, నిషేధిత సంస్థలో పెరుగుతున్న విభేదాల కారణంగా వారు లొంగిపోయినట్లు బీజాపూర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ వెల్లడించారు. లొంగిపోయిన మావోయిస్టులందరూ ఆంధ్ర-ఒడిశా బోర్డర్ డివిజన్, మావోయిస్టుల పామెడ్ ఏరియా కమిటీలో వివిధ హోదాల్లో ఉన్నారని యాదవ్ పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టులలో దేవ పదం (30), అతడి భార్య దులే కలాము (28) మావోయిస్టు బెటాలియన్ నంబర్ -1లో సీనియర్ సభ్యులుగా ఉన్నారు. వారి తలపై ఒక్కొక్కరికి రూ.ఎనిమిది లక్షల రివార్డు ఉంది. ఏరియా కమిటీ సభ్యుడు సురేష్ కట్టం (21) తలపై రూ. ఐదు లక్షల రివార్డు ఉంది. లొంగిపోయిన మావోయిస్టలలో ఒక్కో తలపై రూ. రెండు లక్షలు, ఐదుగురు మావోయిస్టుల తలపై ఒక్కొక్కరికి రూ. లక్ష లక్ష రివార్డు ఉంది.

లష్కరే ఉగ్రవాదికి పాక్ భద్రత

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో గుర్తుతెలియని గన్‌మెన్ల భయంతో లష్కరే తోయిబా అధిపతి, 26/11 దాడుల సూత్రధారి హఫీజ్ సయీద్‌కు భద్రత గణనీయంగా పెంచినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అతడు ఉగ్రకార్యకలాపాల ఆరోపణలపై లాహోర్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. అక్కడ అతడికి కల్పించిన భద్రతను పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ సమీక్షించింది. మరోవైపు హఫీజ్ కుటుంబీకులకు రక్షణ ఏర్పాట్లను కట్టుదిట్టం చేసింది. అతడి కుమారుడు తల్హా సయీద్‌కు భద్రత పెంచారు. హఫీజ్ ఇటీవల తరచూ దాడులకు లక్ష్యంగా మారుతున్నాడు. 2021లో అతడి ఇంటి వద్ద భారీ పేలుడు చోటుచేసుకొంది. దాని నుంచి త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. 2023లో ఇద్దరు టాప్ లష్కరే ఉగ్రవాదులు, హంజ్లా అదన్నాన్, రియాజ్ అహ్మద్‌లను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. వరుసగా హఫీజ్ సన్నిహితులపై దాడులు జరగడం లష్కరేలో భయం పుట్టిస్తోంది. డిసెంబర్ 2024లో జరిగిన దాడిలో హఫీజ్ తర్వాతి స్థానంలో అబ్దుల్ రెహ్మాన్ మక్కీ మృతిచెందాడు. దీంతో భయపడిన హఫీజ్ అతడి అంతిమయాత్రలో పాల్గొనలేదు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.